
# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 116 | హైదరాబాద్ | శుక్రవారం 24-10-2025 | పేజీలు : 12 | వెల : 1.00


11లో

## పాకిస్థాన్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై రగడ..



## తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫీజు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలో పదో తరగతి ఫైనల్ పరీక్ష ఫీజు చెల్లింపు తేదీలను డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ప్రకటించింది. అక్టోబరు 30వ తేదీ నుంచి నవంబర్ 13 లోపు పాఠశాల హెడ్‌మాస్టర్లకు విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపింది. హెచ్ఎంలు ఆన్‌లైన్ ద్వారా నవంబర్ 14 లోపు ఫీజు చెల్లింపు చేయాలని, విద్యార్థుల డేటాను నవంబర్ 18 లోపు డీఈవోలకు అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రూ.50 ఆలస్య రుసుముతో నవంబర్ 29 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 2 నుంచి 11వ తేదీవరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 నుంచి 29 వరకు పదో తరగతి పరీక్ష ఫీజు చెల్లించేందుకు విద్యార్థులకు అవకాశం కల్పించారు.

# హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన..

## స్తంభించిన జనజీవనం

- హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములతో కూడిన భారీ వర్షం
- రోడ్లన్నీ జలమయం కావడంతో ట్రాఫిక్ జామ్
- కూకట్‌పల్లి, అమీర్‌పేట్, జూబ్లీహిల్స్‌లో కుండపోత వాన
- మరో గంటలో మరిన్ని ప్రాంతాలకు వర్ష సూచన జారీ
- అవసరమైతేనే బయటకు రావాలని ప్రజలకు పోలీసుల సూచన

11లో



## నేటి భారతం

- సేవ ముగిసినా, సేవా జ్ఞాపకాలు ఎప్పటికీ నిలిచిపోతాయి.
- పదవి ముగింపు కాదు.. అనుభవాల కొత్త ఆరంభం.
- మీ కృషి కాలగమనంలో మాయంకాదు, అది తరాలకు మార్గదర్శనం.
- సంస్థ కోసం పనిచేసిన ప్రతి క్షణం.. మీ జీవిత విజయ గాథ.
- ప్రభుత్వ సేవలో మీ ప్రస్థానం నిజాయితీ, కర్తవ్యానికి ప్రతీక.
- విరమణ అనేది విశ్రాంతి కాదు, జీవితానుభవాల నూతన పయనం.
- మీ పనితనం మాటల్లో కాదు.. ప్రజల హృదయాల్లో నిలిచింది.
- సేవతో గెలుచుకున్న గౌరవం.. పదవులు మరిచిపోయినా చిరస్మరణీయం.
- పెన్షన్ ప్రారంభం.. మరో జీవన అధ్యాయం ఆరంభం.
- మీ సేవా యాత్రకు వందనాలు, మీ జీవితానికి శుభకామనలు.

ఇలా అభినందనలు చెబుతాం..

- పెన్షన్ రాక అల్లాడుతున్న వారిని పట్టించుకోము.
- ప్రభుత్వ నిర్లక్షాన్ని ప్రశ్నించం.. ఈ పద్ధతి మారాలి..

– ఇంద్రపల్లి. గోవర్ధన్




## తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం..

## స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

- ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలున్నా స్థానిక ఎన్నికల్లో పోటీకి అర్హులే!
- పంచాయతీరాజ్ చట్టంలో కీలక సవరణ దిశగా రేవంత్ సర్కారు
- ఆర్డినెన్స్ ద్వారా చట్ట సవరణకు ఆమోదం
- త్వరలో అమలులోకి రానున్న కొత్త విధానం

11లో

## నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్..

*నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్..*




11లో

- నవంబర్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త బ్యాంకింగ్ నామినేషన్ నిబంధనలు
- ఖాతాదారులు నలుగురి వరకు నామినీలను నియమించుకునే అవకాశం

## కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్ కు టికెట్ ఇచ్చింది..

# చిత్తుగా ఓడించండి

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక వ్యాఖ్యలు
- హైదరాబాద్ ప్రజల విజ్ఞతకు ఈ ఎన్నిక ఒక పరీక్ష అని వ్యాఖ్య
- ఈ ఫలితం జీహెచ్ఎంసీ ఎన్నికలపై ప్రభావం చూపుతుందని



11లో

## టెక్ హబ్‌గా ఏపీ, ఇంధన రంగంలో అపార అవకాశాలు...

### అబుదాబిలో సీఎం చంద్రబాబు కీలక సమావేశాలు

- అబుదాబిలో రెండో రోజు పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు
- ఇంధన, టెక్నాలజీ రంగాలపై ప్రధానంగా దృష్టి
- ఏడీఎన్ఓసీ, జీ42 సంస్థల ప్రతినిధులతో కీలక భేటీలు
- ఏపీని టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దుతామని వెల్లడి
- రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం
- విశాఖ భాగస్వామ్య సదస్సుకు రావాలని పిలుపు



11లో

# సామాజిక అంశంగా పెన్షన్ దారుల సమస్యలు..

- ఆర్థిక భద్రత కోల్పోతున్న పెన్షన్ దారులు..
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుమిలిపోతున్న వేలమంది..
- ఆసరాగా ఉంటుందన్న పెన్షన్ నిరాశను మిగిలిస్తోంది..
- దాదాపు 30 సంవత్సరాలు ప్రభుత్వానికి ప్రజలకు సేవ..
- విశ్రాంతి తీసుకోవాల్సిన తరుణంలో ఇబ్బందులు పడుతున్న వైనం..
- ఒక్కోసారి నెలల తరబడి పెన్షన్ అందడం లేదంటున్న బాధితులు..
- స్వయంగా ముఖ్యమంత్రి నిధులు లేవని చెప్పడం సిగ్గుచేటు..
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో విలవిల లాడిపోతున్న పెన్షన్ దారులు..
- పీ.ఆర్.సి. అమలులో కూడా జాప్యం జరుగుతోంది..
- ప్రభుత్వం స్పందించకపోతే ఆత్మహత్యే శరణం అంటున్న పెన్షన్ దారులు..
- పెన్షన్ దారుల తరఫున న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "




12లో

దాదాపు 35 సంవత్సరాలు ప్రభుత్వానికి ప్రజలకు సేవచేసిన ఒక ప్రభుత్వ ఉద్యోగి తాను రిటైర్ అవుతున్న రోజు ఒక పండుగలాగా జరుపుకుంటారు.. తోటి ఉద్యోగులు ఎంతో గౌరవంగా సన్మానించుకుంటారు.. గొప్పగా అతడు చేసిన సేవలను చెప్పకుంటారు.. ఎంతో ఆనందంగా ఇంటికి వస్తాడు.. శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని భావిస్తాడు.. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కాలం గడిపేస్తుంటారు.. అతనికి ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాడ్యూటీ లాంటి పైకాన్ని తన వారసులకు అందించి గర్వంగా ఫీల్ అవుతాడు.. అంతా బాగానే ఉంది అనుకున్నంతలో నెలరోజులు తిరిగిపోతాయి.. విధుల్లో ఉన్నప్పడు ఒకరోజు ఆటో, ఇటుగా వచ్చేది జీతం.. దాంతో తన కుటుంబ అవసరాలు తీరిపోయేవి.. కానీ ఇప్పడు పెన్షన్ సకాలంలో అందకపోవడంతో ఊహించని ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తుంది.. ఖర్చులకు అప్పలు చేయాల్సిన పరిస్థితి.. ఆ వయసులో ఏపనీ చెయ్యాలన్నా కష్టమే.. ఇలాంటి పరిస్థితుల్లో ఆ రిటైర్డ్ ఉద్యోగి ఏమి చేయగలడు..? ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుదేలవుతున్న పెన్షనర్ల జీవితాలు ఎప్పడు గాడిలో పడతాయి..?

# సంపాదకీయం

## ఆసక్తికరంగా మారుతున్న బీహార్ పాలిట్రిక్స్

రాజకీయాలు ఎప్పుడు ఎలా మారతాయో తెలియదు. రాజకీయాల్లో శాశ్వత శత్రువులు, శాశ్వత మిత్రు లు ఉండరనే నానుడి దశాబ్దాలుగా విం టూనే ఉన్నాం. భారత రాజకీయాల్లో అనే క మార్లు ఇది రుజువైంది. రెండు పార్టీల మధ్య పొత్తు కానీ, పలు పార్టీలు కలిసి కూ టమి ఏర్పాటు చేయడం, రాజకీయ అవసరాల కోసం రాత్రికి రాత్రి నాయకులు కండువాలు మార్చడం పరిపాటైపోయిం ది. ఇక్కడ స్నేహం, మోజు లాంటివి ఉండ వు.జాతీయ, రాష్ట్ర రాజకీయాల్లో ఫిరాయింపుల సునామీ వేగంగానే సంభవిస్తుం టాయి. ఈ మార్పుల గురించి ప్రజలు పట్టించుకోవడం మర్చిపోయారు. అయితే ఇప్పుడు బీహార్ ఎన్నికల దృష్ట్యా దేశం చూపు మొత్తం అటు వైపే మళ్లింది. ఈ రాష్ట్రంలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలు అధికార, ప్రతిపక్ష కూటములకు కీలకంగా మారాయి. బీహార్‌లో అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి కాంగ్రెస్, ఆర్జేడీ, జేఎం ఎం, ఇతర పార్టీలతో కలిసి 'మహాఘట్ బంధన్' కూటమిగా ఏర్పడింది.ఈ దఫా అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా రాష్ట్రంలో అధికారాన్ని చేజెక్కించుకోవాలని కృతనిశ్చయంతో ఈ కూటమి పావులు కదుపు తుంది. మరోవైపు అధికార ఎన్డీఏ కూట మి సీట్ల పంపకంలో చాణక్యత ప్రదర్శించింది. ప్రతిపక్ష మహాఘట్ బంధన్ కూట మికి సీట్ల పంపకంలో తేడాలు వచ్చి ఊ హించని విధంగా బీహార్ ఎన్నికల్లో కొత్త పంచాయతీ తెరపైకి వచ్చింది.ఏకంగా మ హా కూటమి నుంచి జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) వైదొలిగిందనే ప్రచా రం జోరుగా జరుగుతుంది. ఇదే జరిగితే అధికార కూటమికి కలిసి వచ్చే అంశంగా చెప్పవచ్చు. ఇక జేఎంఎం పార్టీ బీహార్‌లో ఆరు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు స్పష్టం చేసింది. ఒకవేళ కూటమి నుంచి బయటకు వచ్చినా, 2025 అసెంబ్లీ ఎన్నికలకు ముందు మహా కూటమితో జేఎంఎం తెగతెంపులు చేసుకున్నా ఒక ముఖ్యమైన పరిణామంగా మా రబోతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.బీహార్‌లో ఇప్పటికే ఎన్నికల వాతావరణం వేడెక్కింది. తాజాగా మహాకూట మిలో సీట్ల పంపకాల అంశం మరింత వేడిని పెంచింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో రోజురోజుకు పరిణామాలు మారు తూ వస్తున్నాయి. ఇప్పటికే మొదటి విడత ఎన్నికలకు సంబంధించిన నామినేషన్లు వేసిన ఎన్డీయే ఎన్నికల ప్రచారంలో దూ సుకుపోతుంది. కానీ మహాఘట్ బంధన్‌లో మాత్రం సీట్ల పంచాయతీ నేటికి తెగ లేదు. ఆర్జేడీ, కాంగ్రెస్ పార్టీలు పరస్పరం సీట్ల విషయంలో విభేదాలు తలెత్తడంతో కూటమిలో అసహజ పరిస్థితి నెలకొంది.కాంగ్రెస్‌కు కేటాయించిన కొన్ని స్థానాల్లో ఆర్జేడీ నాయకులు తమ అభ్యర్థులను నిలబెట్టడం తీవ్ర అసహనానికి దారితీసింది. ముఖ్యంగా బీహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ రామ్ కుటుంబ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఆర్జేడీ అభ్యర్థి నా మినేషన్ దాఖలు చేయడం ఉద్రిక్తతను పెంచింది. ఇదే సమయంలో, జార్ఖండ్ ముక్తి మోర్చా కూడా అసంతృప్తి వ్యక్తం చేసింది. కూటమిలో తగిన సీట్లు దక్కకపోవడంతో బీహార్ ఎన్నికల్లో ఒంటరిగా బరి లోకి దిగుతామని ఆ పార్టీ ప్రకటించింది.నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను దింపనున్నట్లు జేఎంఎం నేతలు వెల్లడించారు. కానీ తెల్లారే సరికి జేఎంఎం పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించడం ఆశ్చర్యపరిచింది. ఎన్నికల సమయంలో పాత పొత్తుల భగ్నం, కొత్త పొత్తులు ఏర్పడడం షరామామూలే. 'మహాఘట్ బంధన్' కూటమిలో సీట్ల పంచాయతీ చర్చలు ఇం కా స్పష్టతకు రాకపోవడంతో, ఆర్జేడీ??కాంగ్రెస్ మధ్య అవిశ్వాస వాతావరణం ఏర్ప డుతుంది. ఈ విభేదాలు పరిష్కారం కాకపోతే, రాబోయే ఎన్నికల్లో మహా కూటమి ప్రభావం తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు.బీహార్ రాజకీయ రంగంలో వంశపారంపర్య పార్టీల ఆధిపత్యం కొనసాగు తోంది. ఎన్నికల సమయంలో వారసత్వ రాజకీయాలను ప్రచారాస్త్రంగా మార్చుకుని ప్రత్యర్థులపై విరుచుకుపడడం చూ స్తుంటాం. కానీ బీహార్‌లో మాత్రం అలాం టి దాడికి తావులేదు. అన్ని రాజకీయ పా ర్టీలు ఇలాంటి వారసత్వ రాజకీయాలు పు ణికి పుచ్చుకున్నవే. అధికార బీజేపీ, జేడీ యూ మొదలుకొని ఆర్జేడీ సహా అన్ని పార్టీలది అదే తీరు.అభ్యర్థుల్లో గణనీయమైన సంఖ్యలో స్థిరపడిన రాజకీయ నా యకుల కుమారులు, కుమార్తెలు, భార్య లు, దగ్గరి బంధువులు ఎక్కువగా ఉన్నా రు. రాఘోపూర్ నుంచి ఆర్జేడీకి చెందిన తేజస్వి యాదవ్ (లాలూ వారసుడు), తా రాపూర్ నుంచి బీజేపీకి చెందిన సామ్రాట్ చౌదరి (మాజీ మంత్రి శకుని చౌదరి కుమారుడు), రఘునాథ్‌పూర్ నుంచి ఆర్జేడీకి చెందిన ఒసామా షాహాబ్ (దివంగత మహ్మద్ షాబుద్దీన్ కుమారుడు) ఉన్నా రు.ఈ అసెంబ్లీ ఎన్నికల సమరానికి 'సై' అంటున్నారు. పార్టీల్లో వారసుల తీరును చూస్తుంటే సైద్ధాంతిక నిబద్ధత రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య సూత్రాలను వా రు పెద్దగా పట్టించుకోవడం లేదనే విష యం స్పష్టంగా తెలుస్తోంది. ఎన్డీఏ కూట మి చాప కింద నీరులా ప్రచారంలో దూ సుకుపోతున్నది.నితీశ్ ఆశలు అన్నీ కూడా జేఎంఎం కలయిక బెడిసికొట్టి కలిసి వస్తుందనే ఆశాభావంతో ఎదురు చూస్తున్నది. అయితే బీహార్ ఎన్నికల్లో మహా కూ టమి నుంచి జేఎంఎం పార్టీ బయటికి వచ్చినట్లు ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. రాష్ట్రంలో విద్యకు సరైన ప్రాధాన్యం కల్పించక పోవ డం వల్లనే సామాజిక స్పృహ లేక ఈ పరిస్థితి తలెత్తిందని అభిప్రాయపడ్డారు.లాలూ ప్రసాద్ యాదవ్, రబ్రీ దేవి నేతృత్వంలోని ఆర్జేడీ దుష్పరిపాలన తర్వా త రాష్ట్రం ఎదుర్కొన్న గందరగోళం నుంచి బీహార్‌ను బయటకు తీసుకురావడంలో ప్రస్తుత సీఎం నితీశ్ కుమార్ విఫలమయ్యారు. బీహార్ ఆర్థిక వ్యవస్థ స్తబ్దంగా ఉందని, క్షీణించిందని ఆర్థికవేత్తలు వాదిస్తున్నారు. బీహార్ ఎన్ఎస్‌డీపీ ఇప్పటికీ జాతీయ సగటులో మూడింట ఒక వంతు పడిపోయింది.నితీశ్ కుమార్ ప్రభుత్వం 12 లక్షల ఉద్యోగాలను సృష్టిస్తామని ప్రకటించినప్పటికీ 2023లో పట్టణ ప్రాం తాల్లో రాష్ట్ర నిరుద్యోగిత రేటు 10.2 శాతం గా ఉంటే.. గ్రామీణ నిరుద్యోగం దాదాపు 7.8 శాతంగా ఉంది. ఇది జాతీయ సగటు కంటే చాలా ఎక్కువ. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడంలో, ఉద్యోగాలను సృష్టించడంలో, పెట్టుబడులను తీసుకురావడంలో బీహార్‌లో కుంటుపడుతున్న పేద రికాన్ని అంతం చేయడంలో ఆయన పూర్తి గా విఫలమయ్యారు.పాలనలో బీహారీలు రాష్ట్రంలో జీవనాధార రాబడిని ఇచ్చే వ్య వసాయానికి తిరిగి వెళ్లారు. లక్షలాది మం ది కార్మికులు వివిధ రాష్ట్రాల్లో వలసలు వెళ్లి పొట్ట గడుపుకుంటున్నారు. పారిశ్రామిక అభివృద్ధి నితీష్ కుమార్ అతిపెద్ద వైఫల్యాల్లో ఒకటి.

## విస్తరణం...
# కేబినెట్‌లో ఎర్త్.. బెర్త్.



విజయవాడ, అక్టోబర్ 23 (భారత శక్తి) ,ఆంధ్రప్రదేశ్ లో మంత్రి వర్గ విస్తరణకు సమయం దగ్గరపడినట్లుంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు పదహారు నెలలు గడిచింది. అంటే మరో ఆరు నెలలు గడిస్తే రెండేళ్లు పూర్తవుతుంది. అయితే మంత్రి వర్గ విస్తరణ ఖచ్చితంగా ఉంటుందని పార్టీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో అందరూ కొత్త వారే కావడంతో పాటు విపక్షానికి సరైన కౌంటర్ ఇవ్వడంలోనూ విఫలమవుతున్నారు. కొందరి మంత్రుల్లో సబ్జెక్ట్ పై అవగాహన కూడా లేదు. అనేక వివాదాలు ఈ పదహారు నెలల్లోనే చుట్టుముట్టాయి. చంద్రబాబు నాయుడు అంతా తాను ఒక్కడే అయి వ్యవహరించాల్సి వస్తుంది. జిల్లాలో కూటమి నేతల మధ్య తలెత్తిన విభేదాలను కూడా పరిష్కరించలేని పరిస్థితుల్లో ఉన్నారన్న అభిప్రాయంలో చంద్రబాబు ఉన్నారు.స్థానిక వ్యాపారాలు ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి పాజిటివ్ వేవ్స్ ఉన్నాయని చంద్రబాబు బలంగా నమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండటంతో పాటు పెట్టుబడులు కూడా వస్తుండటంతో పాటు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారు. నిధుల కొరత ఉన్నా ఏ మాత్రం చెప్పింది చెప్పినట్లు లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయినా మంత్రులు దానిని పెద్దగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమయ్యారన్న అభిప్రాయంతో చంద్రబాబు ఉన్నారు. జిల్లాలను పర్యటించడంతో పాటు అక్కడ కూటమి నేతల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించడంలోనూ మంత్రులు వైఫల్యం చెందుతున్నారన్న బలమైన అభిప్రాయం చంద్రబాబులో ఏర్పడింది. అందుకే వచ్చే ఏడాదిలో మంత్రి వర్గ విస్తరణ చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిసింది ఇప్పటికే మంత్రి వర్గ సమావేశాల్లో పలుమార్లు చంద్రబాబు నాయుడు మంత్రులను హెచ్చరించారు. అయినా కొందరిలో మార్పు రాకపోవడాన్ని గమనించారు. మంత్రులకు ఫైళ్ల క్లియరెన్స్ లోనూ, పనితీరులోనూ మార్కులు కూడా ఇచ్చారు. కానీ మంత్రుల్లో మార్పు కనిపించకపోవడంతో ఇక సమయం చాలని, ఎన్నికల టీంను సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సిద్ధమయినట్లు సమాచారం. ప్రస్తుతం మంత్రివర్గంలో ఒక పోస్టు ఖాళీగా ఉంది. జనసేనకు చెందిన ముగ్గురు మంత్రులున్నారు. బీజేపీకి చెందని ఒక మంత్రి ఉన్నారు. వాటితో సంబంధం లేకుండా మంత్రివర్గంలో పెద్దయెత్తున ప్రక్షాళన చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సారి మాత్రం ఎన్నికల టీం కావడంతో సీనియర్లకు అవకాశం కల్పించే అవకాశాలే ఎక్కువ కనిపిస్తున్నాయి. దీంతో ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో కొంత ఆందోళన బయలుదేరింది. ఎవరు ఉంటారో.. ఎవరికి ఊస్టింగ్ అనేది అన్న చర్చ జరుగుతుంది. ఇన్ -అవుట్ లపై కూడా పార్టీలో పెద్దయెత్తున ప్రచారం అయితే ఉంది.

ప్రస్తుతం క్యాబినెట్లో మంది మంత్రులు ఉన్నారు. అందులో జనసేనకు చెందిన ముగ్గురు, బిజెపి నుంచి ఒకరు, టిడిపి నుంచి 19 మంది ఉన్నారు. ఒక మంత్రి పదవి ఖాళీగా ఉంది. రాజ్యసభ పదవుల సర్దుబాటులో భాగంగా మెగా బ్రదర్ నాగబాబు కు అవకాశం చిక్కలేదు. దీంతో ఆయనను మంత్రివర్గంలోకి తీసుకుంటామని చంద్రబాబు ప్రకటించారు. అందుకు తగ్గట్టుగానే ఆయనను ఎమ్మెల్సీ చేశారు. త్వరలో మంత్రి పదవిలోకి తీసుకుంటారని ప్రచారం నడిచింది. కానీ మంత్రివర్గ విస్తరణ వరకు ఆయన వేచి ఉండక తప్పదు. ఎందుకంటే నాగబాబుకు ఇవ్వాలనుకుంటే ఒక మంత్రి పదవి ఖాళీ ఉంది. కానీ అలా చేయలేదు.ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో సంతృప్తి కనిపిస్తోంది. పాజిటివ్ వేవ్స్ సైతం ఉన్నాయని సర్వేల్లో తేలుతోంది. కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందుతుండడంతో పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు వస్తున్నాయి. మరోవైపు సంక్షేమ పథకాలు కూడా అమలవుతున్నాయి. వైసిపి హయాంలో కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే అమలు చేసేవారు. ఇప్పుడు సంక్షేమంతో పాటు అభివృద్ధిపై కూడా దృష్టి పెట్టింది కూటమి. అయితే ఇది ప్రభుత్వం పై సానుకూలంగా మారుతోంది. కానీ దీనిపై మంత్రులు ప్రచారం చేసుకోలేకపోతున్నారన్న విమర్శ ఉంది. పనితీరులో వెనుకబడి పోతున్నారన్న ప్రచారం ఉంది. అందుకే మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న టాక్ నడుస్తోంది. చంద్రబాబుఅనవసరంగా తేనె తుట్టను కదులుస్తారా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. మంత్రి పదవుల కోసం కూటమిలోనే చాలామంది నేతలు ఎదురుచూస్తున్నారు. అందులో సీనియర్లు సైతం ఉన్నారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు అటువంటి వారి జాబితా పదుల సంఖ్యలో ఉంది. ఇప్పుడు అనవసరంగా కెలికి మంత్రి పదవులు భర్తీ చేస్తారా అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే కచ్చితంగా ప్రజలనుంచి సంతృప్తి స్థాయి ఉండడంతో.. పూర్తిగా ఎన్నికలను ఉద్దేశించి.. కొత్త టీం రంగంలోకి వస్తుందని ప్రచారం జరుగుతోంది. సీనియర్లతో పాటు జూనియర్లకు సైతం మంత్రివర్గంలో స్థానం ఉంటుందని కొత్త టాక్ అయితే తెరపైకి వచ్చింది. అందులో ఎంత వాస్తవం ఉందో తెలియాలి.

# పడక గదిలో సీసీ కెమెరాలు...




తిరుపతి, అక్టోబర్ 23 (భారత శక్తి) ఒక మనిషిని గెలవాలంటే నేరుగా తలపడాలి. యుద్ధక్షేత్రంలో ప్రత్యర్థిని ఓడించాలంటే ముందుగా మన సత్తా ఏమిటో చూపించాలి. అలాకాకుండా వెన్నుపోటు పొడిచి.. దొడ్డి దారి ప్రణాళికలు రూపొందిస్తే దానిని యుద్ధ రీతి అనరు. ఇటువంటి విధానాన్ని అమలు చేసిన ఓ రాజకీయ నాయకుడు ఇప్పుడు తీవ్రమైన ఒత్తిడి ఎదుర్కొంటున్నాడు. విపరీతమైన విమర్శలను చవిచూస్తున్నాడు. తట్టుకోలేక రాష్ట్రానికి దూరంగా ఉంటున్నాడు.ఆ రాజకీయ నాయకుడికి బలమైన నేపథ్యం ఉంది. ఆయన తండ్రి మంత్రిగా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఆ నాయకుడు ఎమ్మెల్యేగా పనిచేస్తున్నారు.. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలో ఉంది. ఆ నియోజకవర్గ ప్రజలు దీవించారు కాబట్టి ఆయన ఎమ్మెల్యే అయ్యారు. మరోసారి ఆయన గెలవాలంటే గొప్ప పనులు చేయాలి. ప్రజల మనసులో స్థిరమైన స్థానాన్ని సంపాదించుకోవాలి. అవసరమైతే తనకు శత్రుత్వం అనేది లేకుండా.. ప్రత్యర్థి అనే వ్యక్తి ఉండకుండా చూసుకోవాలి. ఇవన్నీ జరగాలంటే ముందుగా ఆ రాజకీయ నాయకుడిలో మంచితనం ఉండాలి. కానీ ఎమ్మెల్యే గా గెలిచిన ఆ నాయకుడిలో మంచితనం అనేది లేకుండా పోయింది. ముంచేతనం అనేది పెరిగిపోయింది. అన్నిటికంటే ముఖ్యంగా తనకు ప్రత్యర్థిగా ఉన్న ఒక మహిళపై పైశాచికత్వాన్ని ప్రదర్శించిన తీరు ఇప్పుడు ఆ రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనంగా మారింది.ఆమె ఉన్నత విద్యావంతురాలు. తన నియోజకవర్గానికి సేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చారు. అంతేకాదు సేవా కార్యక్రమాలు కూడా విస్తృతంగా చేశారు. డబ్బు కూడా భారీగా ఖర్చు పెట్టారు. ఆమె భర్త కూడా ఇందుకు సహకరించారు. అయితే ఆమెకే టికెట్ అనుకుంటున్న క్రమంలో.. ఊహించిన విధంగా పొత్తు ఏర్పడింది.. దీంతో ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ పొత్తు ధర్మంలో భాగంగా భాగస్వామ్య పార్టీకి సపోర్టు ఇవ్వాల్సి వచ్చింది. దీంతో ఆమెకు ఎమ్మెల్యే యోగ్యం దక్కలేదు. సరే తమతో పొత్తు కుదుర్చుకున్న పార్టీ తరపున పోటీ చేసిన అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిచారని.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చామని ఆమె గొప్పగా చెప్పుకుంది. అంతేకాదు అధికారంలోకి తమ పార్టీ భాగస్వామిగా ఉన్న సమూహం రావడంతో ఆనందపడింది. కానీ ఇక్కడే ఆమె ఆనందం ఆవిరైంది. దానికి ప్రధాన కారణం ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యే నే.ఎమ్మెల్యే గెలిచిన తర్వాత ఆ నాయకుడి ప్రవర్తన పూర్తిగా మారిపోయింది. వచ్చే ఎన్నికల నాటికి తనకు రాజకీయ శత్రుత్వం ఉండకూడదని ఆయన భావించాడు. అందువల్లే తమ సమూహంలో ఉన్న పార్టీకి సంబంధించిన నాయకురాలికి అసలు రాజకీయ జీవితంలో లేకుండా చేయాలని అనుకున్నాడు. ఆమె దగ్గర పని చేస్తున్న ఒక వ్యక్తిని దగ్గరికి తీసుకున్నాడు. డబ్బు ఆశ చూపించాడు. అయితే ఆ నాయకురాలికి మరొక వ్యక్తితో సంబంధం ఉండేది. ఇదే అదునుగా భావించిన ఆ ఎమ్మెల్యే ఆ నాయకురాలి వద్ద పనిచేస్తున్న వ్యక్తితో చేయకూడని కార్యక్రమాలు చేయించాడు. ఆ నాయకురాలు పడకగదిలో సీసీ కెమెరాలు పెట్టించాడు.. దీంతో ఆ నాయకురాలు తన ప్రియుడితో సాగించే సరసాలు అందులో రికార్డ్ అయ్యాయి. ఈ వీడియోలు మొత్తం కూడా ఆ వ్యక్తి సదరు ఎమ్మెల్యేకు పంపించాడు. ఆ వీడియోలను అడ్డం పెట్టుకొని సదరు నాయకురాలిని బెదిరించేందుకు ఆ ఎమ్మెల్యే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. కానీ ఇంతలోనే ఆ నాయకురాలు తన వద్ద పనిచేసే వ్యక్తి వీడియోలు పంపిస్తుండగా చూసింది.. ఆ తర్వాత ఈ విషయాన్ని తన భర్తకు వేరే విధంగా చెప్పింది. దీంతో ఆమె భర్త.. తన అనుచరులతో కలిసి ఓ ప్రణాళిక రూపొందించాడు. అంతేకాదు తమ వద్ద పనిచేస్తున్న ఆ వ్యక్తిని అంతం చేశాడు. ఈ వ్యవహారంలో అతడు ప్రస్తుతం జైల్లో ఉంటున్నాడు. ఆవుల మంద పోట్లాడుకుంటే దూడల కాళ్ళు విరిగినట్టు.. ఎమ్మెల్యే, ఓ నాయకురాలు మధ్య ఏర్పడిన వివాదం చివరికి ఒక మనిషి ప్రాణం పోవడానికి కారణమైంది. అతని కుటుంబాన్ని దిక్కులేని వాళ్ళను చేసింది. అందుకే సాధ్యమైనంతవరకు పెద్దల వ్యవహారాలలో వేలు పెట్టకపోవడమే మంచిది.

## బయటకు రా...
# కేడర్ లో ఒక్కటే డిమాండ్

విజయవాడ, అక్టోబర్ 23 (భారత శక్తి) వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఎక్కువ సమయం బెంగళూరులోనే ఉంటున్నారు. ఇప్పటికే 2024 ఎన్నికల్లో ఓటమి పాలయి దాదాపు రెండేళ్లకు దగ్గరపడుతుంది. ఇప్పటికైనా బెంగళూరు వదిలి తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో నేతలకు, ముఖ్యమైన కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. నెలలో ఇరవై నాలుగు రోజులు బెంగళూరులోనే జగన్ ఉంటున్నారు. కేవలం ఆరు రోజులు మాత్రమే తాడేపల్లికి వస్తున్నారు. అదీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకో.. నేతలతో సమావేశమవ్వడానికో ఆయన వస్తున్నారు. కానీ ఇకపై లాభం లేదని, ఇప్పటికే సమయం మించి పోయిందని, కార్యకర్తలపై అక్రమ కేసులు నమోదవుతున్నాయని, నేతలు కూడా బయటకు ఇంకా రావడం లేదని, దీనికి ప్రధాన కారణం జగన్ ఇక్కడ ఉండకపోవడమేనన్న అభిప్రాయం కార్యకర్తల్లో బలంగా కనిపిస్తుంది.. కానీ రాయలసీమలో అతి తక్కువ సార్లు మాత్రమే జగన్ పర్యటించారు. నిజానికి ఓటు బ్యాంకు, వైసీపీకి పట్టున్న రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు. రాయలసీమలో వైసీపీ నేతల మధ్య సఖ్యత కొరవడింది. ఇప్పటి నుంచే సీట్ల కోసం కొందరు ప్రయత్నిస్తున్నారు. మరికొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. పటిష్టమైన క్యాడర్ ఉన్న రాయలసీమను అలా వదిలేస్తే రానున్న కాలంలో ఎలా అన్న ప్రశ్న వినపడుతుంది. జగన్ మాత్రం ఇంకా టైముందని చెబుతున్నారు. కానీ అప్పటికి నష్టం తీవ్రత మరింత పెరిగే అవకాశముందన్న ఆందోళన పార్టీ నేతల్లో కనిపిస్తుంది.

క్షేత్ర స్థాయిలో నాయకత్వం... నిజానికి ఇప్పటి వరకూ పార్టీకి క్షేత్రస్థాయిలో సరైన నాయకత్వం లేదన్నది వాస్తవం. నియోజకవర్గాల్లో బూత్ లెవెల్ కమిటీలను నియమించాలని కొద్దిరోజుల క్రితం జగన్ నేతలను ఆదేశించినప్పటికీ అవి కార్యరూపం దాల్చలేదు. చాలా నియోజకవర్గ ఇన్ ఛార్జుల విషయంలోనూ ఇంకా జగన్ నుంచి క్లారిటీ లేదు. గత ఎన్నికల్లో నియోజకవర్గాలను మార్చారు. అయితే అక్కడ గత ఎన్నికల్లో పోటీ చేసిన నేతలు వెళ్లడం లేదు. మరొకవైపు జోగి రమేష్ వంటి నేతలు తాము మైలవరంలో వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించుకుంటున్నారు. ఇలాంటి సమయంలో జగన్ బయటకు వస్తేనే తప్ప ఈ సమస్యలకు తెరపడదు. కానీ ఆయన బెంగళూరు వదిలి రాకపోవడంతో క్యాడర్ కు అదే బెంగ పట్టుకుందంటున్నారు.

## సొంత సామాజికవర్గంలోనే తప్పుతున్న పట్టు



ఏలూరు, అక్టోబర్ 23 (భారత శక్తి) జనసేన అధినేత పవన్ కల్యాణ్ నీతి నిజాయితీల పట్ల ఎవరికీ అనుమానం లేదు. అదే సమయంలో ఆయన మౌనం కూడా పార్టీని డ్యామేజీ చేస్తుందంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాల విషయాల్లో కానీ, కొన్ని సంఘటనలపై కానీ పవన్ కల్యాణ్ సరైన రీతిలో స్పందించకుండా సైలెంట్ గా ఉండటం ప్రధానంగా జనసేన పార్టీ నేతలు, క్యాడర్ లోనూ అంతకంటే ముఖ్యంగా కాపు సామాజికవర్గంలోనూ అసంతృప్తి ఉంది. ప్రశ్నిస్తానని పార్టీని పెట్టిన పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ విషయాన్ని మరిచిపోయారన్న అభిప్రాయం ఎక్కువ మంది కాపు సంఘాల నేతలు కూడా వ్యక్తం చేస్తున్నారు. సోషల్ మీడియాలో పవన్ వైఖరిని ప్రశ్నిస్తూ పోస్టులు పెడుతున్నారు.. కానీ పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఉన్నారు. కూటమి ప్రభుత్వంలో ఆయన భాగస్వామి. ఆయనే ప్రశ్నిస్తే ప్రభుత్వానికి ఇబ్బందులు ఎదురవుతాయి. అదే సమయంలో కొన్ని కేసులకు సంబంధించి ప్రభావం చూపే అవకాశముంది. అయితే పవన్ కల్యాణ్ మాత్రం అంతర్గత సంభాషణల్లో రాష్ట్రంలో శాంతి భద్రతలు అంత బాగా లేవన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఎక్కువగా అత్యాచారాలు, హత్యలు జరుగుతుండటం పట్ల ఆయన కలత చెందినట్లు పార్టీకి చెందిన ముఖ్య నేతలు చెబుతున్నారు. గతంలోనే హోం మంత్రి పదవిని తాను తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించిన పవన్ కల్యాణ్ తర్వాత పదుల సంఖ్యలో జరిగిన సంఘటనలపై మాత్రం బాహాటంగా స్పందించకపోవడాన్ని కాపు సంఘం నేతలు ప్రశ్నిస్తున్నారు... అయితే పవన్ కల్యాణ్ కేవలం తాను కాపు సామాజికవర్గానికి సంబంధించిన నేతను కాదని, అన్నివర్గాలకు చెందిన నేతనని గుర్తు చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయాలను కొన్నింటిని మంత్రి వర్గ సమావేశంలో ప్రశ్నిస్తున్నారని, కానీ బహిరంగంగా మాట్లాడే అవకాశం ఆయనకు ఇప్పుడు ఉండదని పార్టీ నేతలు చెబుతున్నారు. అయినా ఎప్పటికప్పుడు అన్యాయం జరిగితే వెంటనే స్పందిస్తున్నారని, అందుకు ఉదాహరణ భీమవరం డీఎస్పీ జయసూర్యపై చంద్రబాబుకు ఫిర్యాదు చేశారని ఉదహరిస్తున్నారు. సివిల్ వ్యవహారాల్లో తలదూరుస్తున్నారని, వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని మంత్రి నాదెండ్ల ద్వారా చంద్రబాబుకు సమాచారం అందించారని అంటున్నారు. అయినా సరే పవన్ కల్యాణ్ మాత్రం ఇంతకు ముందులా ఫోర్స్ గా లేకపోవడం, అన్యాయాన్ని ప్రశ్నించకపోవడంపై సొంత పార్టీ నేతలతో పాటు కాపు సామాజికవర్గం నుంచి కూడా విమర్శలను ఎదుర్కొనాల్సి వస్తుంది.

## వర్మ షిఫ్టింగ్ తప్పదా

కాకినాడ, అక్టోబర్ 23 (భారత శక్తి)
పిఠాపురం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ఎన్. వర్మ రాజకీయ ప్రస్థానం ఎటూ అర్థం కాకుండా ఉంది. జనసేనాని పవన్ కల్యాణ్ కోసం తన స్థానాన్ని త్యాగం చేసిన వర్మకు ఇచ్చే ప్రాధాన్యత ఇదేనా? అన్న ప్రశ్న వర్మ వర్గీయుల నుంచి వినపడుతుంది. పిఠాపురం నియోజకవర్గాన్ని పవన్ కల్యాణ్ దాదాపు ఫిక్స్ చేసుకున్నట్లే కనపడుతుంది. పిఠాపురం నియోజకవర్గాన్ని పవన్ వదలిపెట్టే అవకాశం ఎంత మాత్రం లేదు. ఎందుకంటే పవన్ తన అడ్డాగా నియోజకవర్గాన్ని మార్చుకుంటున్నారు. నిజానికి పవన్ కల్యాణ్ ఎన్నికయిన తర్వాత ఈ నియోజకవర్గానికి కొంత ఇమేజ్ ఏర్పడింది. అక్కడ భూముల ధరలు కూడా పెరిగాయి. అదేసమయంలో అక్కడ ఓటు బ్యాంకు కూడా పవన్ అక్కడే ఫిక్స్ అయ్యేలా చేసేటట్లే కనపడుతుంది. మరి మాజీ ఎమ్మెల్యే వర్మ పరిస్థితి ఏంటన్నది మాత్రం ఎటూ తేలకుండా ఉంది. వర్మ పిఠాపురం నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన నేత కావడంతో పాటు టీడీపీలో కూడా కీలకమైన నేత. 2024 ఎన్నికలకు ముందు పవన్ కల్యాణ్ కోసం త్యాగం చేసినందుకు వర్మకు ఎమ్మెల్సీ పదవి ఇస్తానని అప్పుడే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. కూటమి ధర్మంతో పాటు జగన్ ను ఓడించాలన్న లక్ష్యంతో వర్మ కూడా పవన్ కల్యాణ్ విజయానికి కృషి చేశారు. అంతవరకూ బాగానే ఉంది కానీ, కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత మాత్రం పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన స్థానిక నేతల మధ్య మాత్రం సఖ్యత లేదు. టీడీపీ నేతలను కట్టడి చేశామని చెప్పినప్పటికీ వర్మకు ఎలాంటి పదవి రాకపోవడం కొంత అసంతృప్తి వర్మ అనుచరుల్లో ఉంది.ఇక ఇటీవల మంత్రి నారాయణ చేసిన వ్యాఖ్యలపై కూడా వర్మ అనుచరులు గరంగరంగా ఉన్నారట. నారాయణ తాను ఆ మాట అనలేదని సర్ది చెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వర్మను జీరో చేశామని టీడీపీ చెప్పడం వెనక ఇక భవిష్యత్ లో ఏ పదవి దక్కదని చెప్పకనే చెప్పినట్లయిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. వర్మకు అక్కడ ఎమ్మెల్సీ పదవో మరే పదవి ఇచ్చినా పిఠాపురం నియోజకవర్గంలో మరో పవర్ సెంటర్ ఏర్పడుతుందని, అప్పుడు పవన్ కల్యాణ్ కు, తమకు గ్యాప్ ఏర్పడే అవకాశముందని పార్టీ నాయకత్వం వర్మకు భవిష్యత్ లోనూ ఏ పదవి దక్కే అవకాశముండకపోవచ్చని అంటున్నారు. మొత్తం మీద ఈ టర్మ్ లో మాత్రం వర్మ మాజీ ఎమ్మెల్యేగానే మిగిలిపోక తప్పదంటున్నారు.
===========

## ఆస్ట్రేలియాకు ఆక్వా ప్రొడక్ట్స్



విజయవాడ, అక్టోబర్ 23 (భారత శక్తి)
అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పేరు చెబితేనే ఇప్పుడు ప్రపంచ దేశాలు ఆగ్రహంతో ఊగిపోతున్నాయి. పన్నులు పెంచి ప్రపంచ దేశాలను కోలుకోలేని దెబ్బతీశారు. ఆ దేశానికి ఉత్పత్తి అయ్యే అన్ని రకాల వస్తువుల పై భారీగా సుంకం పెంచి ప్రపంచంలో చాలా దేశాలను ఇబ్బంది పెట్టారు. అందులో బాధిత దేశంగా ఇండియా ప్రథమ స్థానంలో ఉంది. అక్కడ పెంచిన సుంకాలతో మన దేశంపై పెద్ద ప్రభావమే పడుతోంది. ముఖ్యంగా ఆక్వారంగం కష్టాల్లో పడింది. రొయ్యల ధరలు పడిపోవడంతో రైతులు ఆందోళనతో ఉన్నారు. సరిగ్గా ఇటువంటి సమయంలోనే ఏపీ మంత్రి నారా లోకేష్ చతురతతో వ్యవహరించారు. అమెరికా ద్వారా జరిగిన నష్టాన్ని ఆస్ట్రేలియాతో బత్తి చేయడంలో లోకేష్ సక్సెస్ అయ్యారు. ఇది నిజంగా ఏపీలోని ఆక్వారంగానికి ఉపశమనం కలిగించే విషయమే.
అగ్రరాజ్యం అమెరికాకు ఏపీ నుంచి ఆక్వా ఉత్పత్తులుఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. మొత్తం 100% ఉత్పత్తుల్లో 90 శాతం అమెరికాకే తరలిస్తుంటారు. అయితే ఆక్వాపై అమెరికాలో సుంకాలు పెంచడంతో.. ఏపీలో వాటికి సంబంధించిన ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. ఆక్వాతో పాటు పదిరకాల అనుబంధ రంగాలపై కూడా ఇది ప్రభావం చూపింది. ఒక్కసారిగా రొయ్యల ధరలు సైతం పతనం అయ్యాయి. వాస్తవానికి మన రొయ్యలు జపాన్, చైనా తదితర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అయితే అమెరికాకు ఎగుమతి అవుతున్న ఉత్పత్తులపై సుంకం విధించడంతో అక్కడ డోర్ క్లోజ్ చేసినట్లు అయింది. దీంతో దేశీయ మార్కెట్ రంగంపై ఏపీ ఆక్వా ఆధారపడాల్సి వచ్చింది. మరోవైపు జపాన్ తో పాటు చైనాకు పరిమిత స్థాయిలోనే ఎగుమతులు అవుతున్నాయి. ఇటువంటి సమయంలో ఆస్ట్రేలియా ఏపీ ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసుకునేందుకు ముందుకు రావడం శుభ పరిణామం. దీని వెనుక మంత్రి నారా లోకేష్ కృషి ఉంది. ఆస్ట్రేలియా ఆక్వారంగా అధికారులు, ప్రతినిధులు తో సమావేశం అయిన లోకేష్ వారిని ఒప్పించగలిగారు.ఆస్ట్రేలియా గతంలో భారత్ నుంచి రొయ్యలను దిగుమతి చేసుకునేది. అయితే వైట్ స్పాట్ వైరస్ రొయ్యలు కావడంతో భారత్ నుంచి దిగుమతులను రద్దు చేసుకుంది. అప్పటినుంచి మన రొయ్యలపై ఆస్ట్రేలియాలో నిషేధం కొనసాగుతోంది. ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో భాగంగా సముద్ర ఉత్పత్తుల పరిశ్రమ ప్రతినిధులతో లోకేష్ సమావేశం అయ్యారు. ఏపీ ఆస్ట్రేలియా మధ్య ఆక్వా ఎగుమత్తుల అంశంపై వారితో చర్చించారు. ఏపీలో ఈ రంగం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారు. 2027 అక్టోబర్ 20 వరకు భారతీయ రొయ్యలను ఆస్ట్రేలియా దిగుమతి చేసుకునేందుకు అంగీకరించింది. ఈ మేరకు అక్కడి ప్రతినిధులు ఆమోదం తెలిపిన డాక్యుమెంట్లను జతచేస్తూ నారా లోకేష్ ట్వీట్ చేశారు. ఏ ఏ రకాల రొయ్యలు? ఎంత ధరకు దిగుమతి చేసుకుంటారు? అన్న వివరాలను ఆ పత్రాలలో ప్రస్తావించారు.నారా లోకేష్ ట్వీట్ ఇప్పుడు వైరల్ అవుతోంది.' భారతదేశ నుంచి ఆస్ట్రేలియాకు రొయ్యల ఎగుమతుల్లో ఒక పెద్ద అడ్డంకి తొలగిపోయింది. గతంలో తెల్ల మచ్చ వైరస్ ఉన్న రొయ్యలను తొక్క తీయకుండా ఆస్ట్రేలియా దిగుమతి చేసుకోలేదు. కానీ ఇప్పుడు భారత్ నుంచి వచ్చే ఆ రొయ్యల దిగుమతికి ఆస్ట్రేలియా అనుమతి ఇచ్చింది. ఈ విజయం వెనుక భారత్, ఆస్ట్రేలియా ప్రభుత్వాల కృషి ఎంతో ఉంది. వారికి నా కృతజ్ఞతలు. ఒకే మార్కెట్ పై ఆధారపడకుండా.. కొత్త మార్కెట్లను ఓపెన్ చేయడం చాలా ముఖ్యం ' అన్నారు మంత్రి నారా లోకేష్. వాస్తవానికి ఆస్ట్రేలియాతో పాటు సౌదీ అరేబియాలో మన రొయ్యలకు గిరాకీ ఉంది. అయితే తాజాగా ఆస్ట్రేలియా ప్రభుత్వం అంగీకారం తెలపడంతో సుమారు 8వేల కంటైనర్ల రొయ్యలను ఎగుమతి చేసే అవకాశం ఉంది. అమెరికాతో సమానమైన ధర లభిస్తుందని తెలుస్తోంది. మొత్తానికైతే ట్రంప్ కొట్టిన దెబ్బను ఆస్ట్రేలియాతో భర్తీ చేశారు మంత్రి నారా లోకేష్.

## పవన్ వర్సెస్ ఆర్ ఆర్ ఆర్

భీమవరం, అక్టోబర్ 23 (భారత శక్తి)
ఏపీలోఒక అంశం హాట్ టాపిక్ అవుతోంది. నిన్న రోజంతా భీమవరం డిఎస్పి జయ సూర్య వార్తల్లో నిలిచారు. ఆయన విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించడం ఈ ప్రచారానికి కారణం. కూటమినేతల పేర్లు చెప్పుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారంటూ డీఎస్పీ జయ సూర్య పై అనేక రకాల ఫిర్యాదులు వచ్చాయి. భీమవరం పరిధిలో పేకాట శిబిరాలకు అండగా నిలుస్తున్నారని.. సివిల్ కేసుల్లో తల దూర్చుతున్నారని ఆయనపై వచ్చిన ఆరోపణలపై నివేదిక ఇవ్వాలని పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ ని ఆదేశించారు డిప్యూటీ సీఎం. ఇదే విషయాన్ని హోం శాఖ మంత్రితో పాటు బిజెపి కార్యాలయానికి సైతం సమాచారం అందించాలని పవన్ డిప్యూటీ కార్యాలయ అధికారులను ఆదేశించినట్లు తెలుస్తోంది. అప్పటినుంచి ఇది హాట్ టాపిక్ గా మారింది. అయితే తాజాగా ఈ అంశంపై మాట్లాడారు ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణం రాజు.గన్నవరం డిఎస్పీగా ఉండేవారు జయసూర్య. అప్పట్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్ల విధేయత ప్రదర్శించే వారని ఆయన పై ఆరోపణలు ఉన్నాయి. ఓ కూటమి ఎమ్మెల్యే మద్దతుతో ఆయన భీమవరం లో పోస్టింగ్ ఇప్పించుకున్నారని కూడా టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఆ డీఎస్పీని ఓ కూటమి ఎమ్మెల్యే అండదండగా నిలుస్తున్నారని ఒక టాక్ అయితే ఉంది. సరిగ్గా ఇదే సమయంలో రఘురామకృష్ణంరాజు స్పందించడం గమనార్హం. మరోవైపు పవన్ కళ్యాణ్ ఫిర్యాదుతో సీఎం చంద్రబాబు సైతం ఈ విషయాన్ని సీరియస్గా తీసుకున్నారు. దీనిపై నివేదిక ఇవ్వాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తాను ఆదేశించారు. మరోవైపు హోం మంత్రిత్వ శాఖ విషయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం ఏమిటి అన్న ప్రశ్న వస్తోంది. ఆయన కేవలం హోదా ప్రకారమే డిప్యూటీ సీఎం కానీ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయాలు ఫైనల్ అని.. మరి పవన్ కళ్యాణ్ ఎలా స్పందిస్తున్నారని విలేకరులు హోంమంత్రి వంగలపూడి అనితను ప్రశ్నించారు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఏపీలో హెరిటేజ్ టూరిజం అభివృద్ధికి సహకారం అందించండి

### విక్టోరియా టూరిజం, స్పోర్ట్స్ శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్‌తో లోకేష్ భేటీ

ఆస్ట్రేలియా (మెల్‌బోర్న్): విక్టోరియా రాష్ట్ర పర్యావరణ, టూరిజం, స్పోర్ట్స్ శాఖల మంత్రి స్టీవ్ డిమోపౌలోస్ ను రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ మెల్‌బోర్న్ లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... వారసత్వ పర్యాటకంలో విక్టోరియా ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఆంధ్రప్రదేశ్ లో పాపికొండలు, విశాఖ బీచ్ వంటి సుందరమైన ప్రదేశాలు ఉన్నాయి. గ్రేట్ ఓషన్ రోడ్ తరహా పర్యావరణ బ్రాండింగ్ కు విక్టోరియా నైపుణ్యాన్ని ఏపీకి అందించండి. ఆంధ్రప్రదేశ్ పర్యాటకశాఖతో కలిసి హెరిటేజ్ టూరిజం, మార్కెటింగ్, ఎకో సర్టిఫికేషన్ పై కలిసి పనిచేయండి. ఆంధ్రప్రదేశ్ లో 1053 కి.మీ.ల సువిశాల తీరం ఉంది. విక్టోరియా పోర్టు ఫిలిప్ బే ప్రాజెక్టు తరహాలో వాతావరణ సాంకేతికతను ఉపయోగించి ఏపీలో తీరప్రాంత స్థితిస్థాపకతపై ఉమ్మడి పరిశోధన, అభివృద్ధి (ఆర్ ఽ డి) కార్యక్రమాలు చేపట్టండి. విక్టోరియా సర్క్యులర్ ఎకానమీకి చేయూతనిస్తున్న వ్యర్థాల నిర్వహణ, కార్బన్ న్యూట్రల్ టూరిజం తరహా ప్రాజెక్టులపై ఆంధ్రప్రదేశ్ తో కలిసి పనిచేయండి. విక్టోరియా మెల్‌బోర్న్ గ్రాండ్ ప్రిక్స్ తరహాలో ఆంధ్రప్రదేశ్ లో గ్లోబల్ ఈవెంట్ల నిర్వహణకు సహకారం అందించండి. ఏపీలోని ఈవెంట్ మేనేజ్ మెంట్ నిపుణులకు శిక్షణా కార్యక్రమాలు చేపట్టండి. ఆంధ్రప్రదేశ్/విక్టోరియాలలో క్రికెట్, హాకీ వంటి క్రీడలకు సంబంధించి ఉమ్మడి శిక్షణా శిబిరాలు, స్నేహపూర్వక మ్యాచ్ లు నిర్వహించండి. స్పోర్ట్స్ సైన్స్ పై ఏపీ-విక్టోరియా నడుమ స్టూడెంట్ ఎక్స్ఛేంజి కార్యక్రమాలకు సహకారం అందించండి. విక్టోరియా అడ్వెంచర్ టూరిజం గవర్నెన్స్ (ఆల్పిన్ నేషనల్ పార్క్) తరహాలో ఆంధ్రప్రదేశ్ లోని అరకు (ట్రెక్కింగ్), పులికాట్ (వాటర్ స్పోర్ట్స్) అభివృద్ధికి చేయూతనివ్వండి. విక్టోరియా సంస్థల ద్వారా అడ్వెంచర్ గైడ్స్/ రేంజర్ల సర్టిఫికేషన్, నైపుణ్యాభివృద్ధికి సహకారం అందించండి. విక్టోరియాలోని ఆఫ్ షోర్ విండ్, సోలార్ రెన్యువబుల్ ప్రాజెక్టులు విజయవంతంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏపీలో యువతకు గ్రీన్ జాబ్స్ పై స్కిల్ డెవలప్ మంట్ కార్యక్రమాలకు సహకారం అందించాల్సిందిగా మంత్రి లోకేష్ విజ్ఞప్తి చేశారు.
=========================

## దిగొస్తున్న బంగారం ధర



ముంబై, అక్టోబర్ 23 (భారత శక్తి)
భగ్గున మండిన బంగారం ధరలు.. ఇప్పుడు చల్లబడుతున్నాయి. ఇన్నాళ్లూ ఆకాశమే హద్దుగా పెరుగుతూ పోయిన గోల్డ్ రేట్లు.. కంప్లీట్ యూటర్న్ తీసుకున్నాయి. ఒక్కరోజులో 9వేలు పడిపోవడంతో.. బులియన్ మార్కెట్లో కాస్తంత రిలీఫ్ కనిపిస్తోంది. ఈనెల 16న 24 క్యారెట్ల తులం బంగారం లక్షా 36వేల ధర పలికింది. ఇక లక్షన్నరే టార్గెట్‌గా పసిడి పరుగులు తీస్తుందని అంతా భావించారు కాని.. జరిగింది వేరు. బంగారం రూటు మార్చి దిగొస్తోంది. అమెరికా లెక్కల ప్రకారం ఔన్సు బంగారం 4360 డాలర్లను తాకింది. రెండ్రోజులు అక్కడే చక్కర్లు కొట్టి.. ఒక్కసారిగా టప్ మని పడిపోయింది. రెండు రోజుల్లో 300 డాలర్లు దిగింది. ఇంకా తగ్గుతుందన్న టాక్ ఉంది.ప్రస్తుతం హైదరాబాద్‌లో బంగారం ధర లక్షా 25వేల 880కి చేరింది. ఇక కిలో వెండి ధర.. లక్షా 74వేల 900కి చేరింది. వెండి ఒకానొక దశలో లక్షా 88వేలకు చేరుకుని.. ఇప్పుడు పదిహేను వేల వరకు దిగివచ్చింది. మరికొన్ని రోజుల్లో బంగారం ధరలు ఇంకా పడిపోయే అవకాశాలున్నాయి. దీనికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ట్రంప్ పేల్చిన బాంబుతో బంగారం పడిపోతోంది. చైనాతో ఇన్నిరోజులు కయ్యం పెట్టుకున్న ట్రంప్.. ఇప్పుడు ఆ దేశంపై సుంకాలు ఎక్కువ రోజులు కొనసాగవని సంకేతాలు ఇవ్వడంతో బంగారం తగ్గుతున్నట్లు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. అంతేకాదు.. కొన్ని రోజులుగా పెరుగుతూపోయిన బంగారం మార్కెట్లో.. ప్రాఫిట్ బుకింగ్ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇదికూడా ఒక కారణమే. గతేడాది ట్రంప్ గెలిచిన దగ్గర్నుంచి పెరుగుతూపోయిన బంగారం ధర.. ఇప్పుడు తగ్గడానికి ముఖ్యమైన కారణమేంటంటే.. అనేక దేశాల్లో యుద్ధవాతావరణ పరిస్థితులు తొలగిపోయి.. సాధారణ పరిస్థితులు నెలకొనడం కూడా ఇంకో కారణం.

## పదవీ విరమణ వెతలు

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)
రిటైల్ ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఆవేదనలో ఉన్నారు. ప్రభుత్వ తీరుతో వారు కంట కన్నీరు పెడుతున్నారు. పెన్షనరీ బెనిఫిట్స్ అందక.. వైద్యానికి డబ్బుల్లేక ప్రాణాపాయ స్థితిలో కొందరు కొట్టుమిట్టాడుతుంటే.. మరికొందరేమో బలవన్మరణాలకు పాల్పడు తున్నారు. ఇంట్లో ఎదిగిన బిడ్డ పెళ్లి చేయలేక నరకయాతన పడుతున్నారు.ఉద్యోగ విరమణ పొందాక జీవిత కాలం దాచుకున్న డబ్బు వస్తుందనుకొని తెలిసిన వాళ్ల నుంచి.. బ్యాంకుల నుంచి రుణం తీసుకున్న వారు దానికి వడ్డీ, ఈఎంఐలు కట్టలేక తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజలకు సేవలందించి, రిటైర్మెంట్ తర్వాత వచ్చే బెనిఫిట్స్ కోసం కార్యాలయాల చుట్టు తిరిగితే పనికావడంలేదు. పైగా ఫైల్ క్లియర్ చేయాలంటే వచ్చే మొత్తంలో 10 నుంచి 20 శాతం వరకు తమకివ్వాలని అధికారులు అడుగుతున్నారని పెన్షనర్లు ఆరోపిస్తున్నారు.ప్రభుత్వం పలుమార్లు సమీక్ష చేసినా వారి పరిస్థితి మార డంలేదు. పదవీ విరమణ పొంది ఏడాదిన్నర అవుతున్నా బెనిఫిట్స్ అందక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల నల్లగొండ జిల్లాలో తనకు రావాల్సిన బెనిఫిట్స్ అందకపోవడంతో మనోవేదనతో ఓ విశ్రాంత ఉపాధ్యాయుడు ఇంటినుంచి వెళ్లిపోయారు. ఆయన ఎక్కడున్నాడో ఆచూకీ తెలియక కుటుంబ సభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.కే కొండయ్య అనే మరో ఉపాధ్యాయుడు 'ప్రాణాపాయ స్థితిలో ఉన్నా ను. ఎప్పుడు చనిపోతానో తెలియదు. ఆరోగ్యం విషమించింది. కడసారైనా తన రిటైర్మెంట్ బెనిఫిట్స్ చూసే భాగ్యం కలిగించం' దని ప్రభుత్వానికి మొరపెట్టుకొని ఇటీవల చనిపోయిన ఘటన అందరినీ కలిచివేసింది.ముప్పు ఏళ్ల పాటు ప్రజలకు సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ తర్వాత రావాల్సిన బెనిఫిట్స్ రాక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కనీసం వైద్యానికి డబ్బులు అందక అనారోగ్యం పాలవుతున్నారు. కేసీఆర్ పెంచి న ఉద్యోగ విరమణ వయసు వల్ల నిలిచిపోయిన రిటైర్మెంట్లు 2024 మార్చి 31తో ప్రారంభమయ్యాయి.అప్పటినుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా దాదాపు వెయ్యి మంది వరకు ఉద్యోగ విరమణ పొందుతూ వస్తున్నారు. ఇప్పటివరకు 8,672 మంది రిటైరయ్యారు. పదవీ విరమణ పొంది ఏడాదిన్నర అవుతున్నా బెనిఫిట్స్ మాత్రం అందడంలేదు. వీరందరికీ గ్రాట్యూటీ, జీపీఎఫ్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, టీజీఎల్ఐ, కమ్యూటేషన్, జీఐఎస్ లాంటి బెనిఫిట్స్ కింద దాదాపు రూ. 10 వేల కోట్ల నుంచి రూ.13 వేల కోట్లు వరకు ప్రభుత్వం విడుదలచేయాల్సి ఉంది.సాధారణంగా రిటైర్మెంట్ అయిన ఉద్యోగు లు పనిచేసిన కాలంలో జమ చేసుకున్న జీపీఎఫ్‌తో పాటు, ఇతర ప్రయోజనాలు అన్నిం టినీ కలిపి రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను ప్రభుత్వం అందజేయాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నెలలు గడుస్తున్నా పెన్షనర్లకు ఆ సొమ్మును ఇవ్వడంలేదు.బీఆర్ఎస్ ప్రభుత్వం 2021లో ఉద్యోగుల రిటైర్డ్‌మెంట్ వయసును 58 ఏళ్ల నుంచి 61 ఏళ్లకు పెంచింది. ఆర్థిక భారంతో రిటైర్డ్‌మెం ట్ బెనిఫిట్స్ ఇవ్వలేకనే అప్పట్లో ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును పెంచింది. దాంతో 2024 మార్చి 31 వరకు ఉద్యోగుల రిటైర్డ్‌మెంట్లే లేవు. ఏప్రిల్ నుంచి ప్రారంభమయ్యాయి. 2024లోనే 7,995 మంది రిటై రయ్యారు.ఈ ఏడాది 9,630మంది అవుతా రు, 2026లో 9,719 మంది, 2027లో 9,443 మంది, 2028లో 7,213 మంది పద వీ విరమణ చేయనున్నారు. 2024 ఏప్రిల్ నుంచి రిటైర్ అవుతున్నవారికి ప్రభుత్వం సొమ్ములు చెల్లించడం లేదు. ఉద్యోగుల క్యాడర్ (స్థాయి)ను బట్టి ఇలా ఒక్కో ఉద్యోగికి కనీసం రూ.30 లక్షలు, అత్యధికంగా రూ.80 లక్షలు రావల్సి ఉంది.ఇందులో జీపీఎఫ్ కిం ద ఒక్కో ఉద్యోగికి దాదాపు రూ. 10 నుంచి రూ.12 లక్షలు, గ్రాట్యూటీ కింద రూ.16 లక్షల వరకు, లీవ్ ఇన్‌క్యాష్‌మెంట్ కింద రూ. 3 నుంచి 5 లక్షలు, కమ్యూటేషన్ కింద రూ.7 లక్షల నుంచి రూ. 15 లక్షలు, టీజీఎల్ఐ కింద రూ.5లక్షల వరకు, జీఐఎస్ కింద రూ.20 వేల వరకు బెనిఫిట్స్ రావాల్సి ఉంది. ఉద్యోగుల జేఏసీ ప్రభుత్వంతో గతంలో జరిపిన చర్చల నేపథ్యంలో.. మెడికల్ రీయింబర్స్‌మెంట్, జీపీఎఫ్ డబ్బులు గత నెలలో కొంత మొత్తంలో మంజూరు చేశారు.

## పాపం.. మాధవీలత...



హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)
గత ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణలో ప్రధానంగా మీడియాలో హైదరాబాద్ నుంచి పోటీ చేసిన మాధవి లత గురించి చర్చ జరిగింది. హైదరాబాద్ సిట్టింగ్ ఎంపీ ఓవైసీ మీద ఆమె పోటీ చేశారు. బిజెపి అభ్యర్థిగా వినూత్నమైన విధానంలో ప్రచారం చేశారు. పైగా మాధవి లతకు సొంతంగా ఒక ఆసుపత్రి కూడా ఉంది. సమాజంలో పలుకుబడి కూడా విపరీతంగా ఉంది. అటువంటి మహిళను హైదరాబాద్ ఓటర్లు గెలిపించుకుంటారని అందరూ అనుకున్నారు. స్వయంగా హోంశాఖ మంత్రి అమిత్ షాను కూడా మాధవి లత గురించి ప్రస్తావించారు. వాస్తవానికి ఎన్నికల్లో ఫలితం బిజెపికి అనుకూలంగా వస్తుందనుకుంటే.. మాధవి లత ఊహించని విధంగా హైదరాబాద్ ఓటర్లు తీర్పు ఇచ్చారు. దీంతో ఆమె ఒక్కసారిగా షాక్ అయ్యారు.ఓటమి తర్వాత కొంతకాలం పాటు ఆమె పెద్దగా కనిపించలేదు. ఇటీవల కాలంలో తన ఆసుపత్రిలో తగ్గించిన ఫీజుల గురించి ఆమె ఒక వీడియోలో మాట్లాడారు. ఇప్పుడు జూబ్లీహిల్స్ శాసనసభకు ఉప ఎన్నికలు వచ్చిన నేపథ్యంలో బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డి తరఫున ఆమె ప్రచారం చేస్తున్నారు. ఓటర్లను వెళ్లి నేరుగా కలుస్తున్నారు. ఈ క్రమంలో బిజెపికి ఓటు వేయాలని.. హైదరాబాద్ నగర రూపురేఖలు బిజెపి ద్వారానే మారుతాయి అని ఓటర్లను కోరుతున్నారు. ఆమె రాజకీయ నాయకురాలు కాబట్టి.. పైగా బీజేపీలో ఉన్నారు కాబట్టి ఎన్నికల్లో అలా ప్రచారం చేయడం సర్వసాధారణం. అయితే మాధవి లత సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటారు. మీడియాలో కూడా ప్రముఖంగా కనిపిస్తారు కాబట్టి.. ఆమె గురించి సహజంగానే ప్రజల్లో ఆసక్తి ఉంటుంది. పైగా స్వయంగా ఆమె ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు ఆమెతో మాట్లాడేందుకు ఉత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఆమెను కొంతమంది ఓటర్లు టార్గెట్ చేయడమే ఇక్కడ అసలైన విషాదం.మాధవి లత ప్రచారానికి వెళ్తున్న సమయంలో జూబ్లీహిల్స్ ఓటర్లు ఆమెను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మోడీ మా ఖాతాలో డబ్బులు వేస్తానని చెప్పారని.. కానీ ఇంతవరకు వేయలేదని ఓటర్లు ఆమెను ప్రశ్నిస్తే.. వివిధ పథకాల ద్వారా మీ ఖాతాలలో డబ్బులు జమ అవుతున్నాయి కదా అని మాధవి లత సమాధానం చెప్పారు. అయితే ఆ పథకాలు తమదాకా రావడంలేదని ఓటర్లు అన్నారు. క్రితం ఎన్నికల్లో మీకే ఓటు వేశామని మెజారిటీ ఓటర్లు మాధవి లతతో చెప్పారు. దానికి ఆమె ఏ గుర్తుకు ఓటు వేశారని అడిగితే.. కారు గుర్తు అని చెప్పారు. కారు గుర్తు తమది కాదని.. తమది కమలం అని చెబితే.. ఏ గుర్తుకు ఓటు వేసినా పెద్దగా ప్రయోజనం లేదని ఓటర్లు పెదవి విరిచారు. కేటీఆర్, రేవంత్ రెడ్డి అభివృద్ధి చేశారని.. మీరు ఏం చేస్తారో చెబితే ఓటు వేస్తామని ప్రజలు మాధవి లతను ప్రశ్నించారు. దానికి ఆమె ఆలోచించుకుని చెబుతామని అన్నారు. అలాంటప్పుడు మీరు మా వద్దకు ఎందుకు వచ్చారని కొంతమంది ఓటర్లు ప్రశ్నించారు. దీంతో ఆమె వారి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక.. వేగంగా వచ్చేశారు.

## భక్తి, ప్రేమ, వెలుగుల పండుగ

### హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్లో ఘనంగా గోవర్ధన పూజ, కార్తీక దీపోత్సవం

హైదరాబాద్ అక్టోబర్ 23 (భారత శక్తి)
బంజారాహిల్స్ లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్లో గురువారం నాడు శ్రీ గోవర్ధన పూజ, కార్తీక దీపోత్సవం వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో ఆధ్యాత్మిక ఉత్సాహం, భజనలు, కీర్తనలు, దీపాల వెలుగులతో వైభవంగా అలంకరించారు. మరోవైపు ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అద్భుతమైన గోవర్ధన పర్వత ప్రతిరూపం భక్తులను అమితంగా ఆకట్టుకుంది.
ఇందులో భాగంగా స్వామివారికి 56 రకాల ఫలహారాలు – మిఠాయిలు, వంటకాలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలతో కూడిన అన్నకూట సమర్పణను భక్తిపూర్వకంగా నివేదించారు.
ఉదయం కార్యక్రమాలు ఆలయ గోశాలలో గోపూజతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆవులు, దూడలకు శ్రీకృష్ణ ప్రసాదాన్ని సమర్పించారు.
గోవర్ధన పర్వత ప్రతిరూపం ఆవిష్కరణ జరిగింది. ఆ తర్వాత అన్నకూట మహోత్సవంలో భాగంగా అనేక రకాల నైవేద్యాలు సమర్పించి, అనంతరం భక్తులు గోవర్ధన పర్వతం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.
హరేకృష్ణ మూమెంట్, హైదరాబాద్ అధ్యక్షులు శ్రీ సత్య గౌర చంద్రదాస ప్రభూజీ గోవర్ధన లీలల ఆధ్యాత్మిక ప్రాధాన్యం గురించి ప్రసంగించారు.
ఇంద్రుడి ఆగ్రహం నుంచి బృందావన వాసులను రక్షించేందుకు దేవాధిదేవుడైన కృష్ణ పరమాత్ముడు, గోవర్ధన పర్వతాన్ని ఎత్తిన సంఘటన, భక్తుల పట్ల భగవంతుడికి ఉన్న అపారమైన కరుణకు ప్రతీక అని ప్రభూజీ ప్రవచించారు. గౌవర్ధనగిరిని ఆరాధించిన వారికి ఆరోగ్యం, సంపద, శాంతి మరియు శ్రేయస్సు తప్పక కలుగుతాయని ప్రభూజీ అన్నారు.

## నారాయణరావు మృతదేహం లభ్యం

తుని అక్టోబర్ 23 (భారత శక్తి)
మైనర్ బాలికపై ఆత్యాచార యత్నం కేసు నిందితుడు నారాయణరావు మృతిపై రూరల్ సీఐ చెన్నకేశవరావు వివరణ ఇచ్చారు. బుధవారం సాయంత్రం ఐదు గంటలకి కోర్టులో ప్రొడ్యూస్ చేసే క్రమంలో ఎస్కార్ట్ తో తీసుకెళ్తుండగా చెరువు వద్ద ఘటన జరిగింది. నిందితుడు నారాయణరావు వాష్ రూమ్ కెళ్ళిన క్రమంలో వర్షం పడడంతో పోలీసులు చెట్టు కిందకు వెళ్ళారు. ఆ సమయంలో ఒక్కసారిగా చెరువులో దూకేసాడు. రాత్రంతా వెతికినా బాడీ దొరకలేదు గురువారం ఉదయం ఫైర్ , పోలీస్ సిబ్బంది గజ ఇతగాళ్లతో వెతకగా బాడీ దొరికిందని వెల్లడించారు.

## టీచర్లకు టెన్షన్..

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)
ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ అర్హత తప్పనిసరి చేసింది ఎన్‌సీటీఈ. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లగా అత్యున్నత న్యాయస్థానం కూడా నిర్ణీత గడువులోగా టెట్ అర్హత సాధించాలని స్పష్టం చేసింది. టెట్ లేనివారికి పదోన్నతులు, ఇంక్రిమెంట్ల విషయంలో ప్రాధాన్యం ఇవ్వొద్దని పేర్కొంది. అయితే రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటికే విధుల్లో ఉన్న టీచర్లకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలన్న వినతిని ఎన్‌సీటీఈ తాజాగా పూర్తిగా తిరస్కరించింది. గతంలో ఎంపికైన ఉపాధ్యాయులకు కొంత వెసులుబాటు ఇవ్వాలని సంఘాలు, టీచర్లు రాసిన పత్రాలను తోసిపుచ్చింది. ఇటీవల సుప్రీం కోర్టు తీసుకున్న కీలక నిర్ణయం ప్రకారం, ఏ ప్రభుత్వ టీచర్ అయితే 5 ఏళ్లకు పైగా సర్వీసు పూర్తి చేశాడో, అలాంటి ప్రతీ ఒక్కరూ రెండు సంవత్సరాల వ్యవధిలో టెట్ అనివార్యంగా ఉత్తీర్ణత సాధించాల్సిందే. ఇది ఇటీవల 2017లో పార్లమెంట్‌లో దిద్దుబాటు చేసిన నిబంధనలకు అనుగుణంగా తీసుకున్న తీర్పు కావడం గమనార్హం. సుప్రీం ధర్మాసనం చెప్పిన తీర్పును 2017లో పార్లమెంట్ చేసిన తీర్మానాన్నే ఆధారంగా చూపారు. అయితే, టీచర్లు తమ నియామకాలు అంతకు ముందు జరిగాయని, కొత్త నిబంధనల ప్రభావం అందరికీ వర్తించకూడదని అభ్యర్థించినా, ఆ వాదనలను ఎన్‌సీటీఈ పరిగణనలోకి తీసుకోలేదు. టెట్ అభ్యర్థన విషయంలో వచ్చిన వినతులను ఎన్‌సీటీఈ తిరస్కరించడంతో ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఇప్పటికే విధుల్లో ఉన్నవారు కూడా టెట్ ఉత్తీర్ణత కీలకంగా మారడంతో, ఉద్యోగ భద్రతపై అనేక మంది ఆందోళన చెందుతున్నారు. తాజా నిర్ణయానికి కొంతకాలపాటు గరిష్ఠ గడువు ఇచ్చినా, పరీక్ష పాస్ అయేంత వరకు ఒత్తిడి తొలగదు. నూతన విధానాల అమలులో నాన్?టెట్ టీచర్లకు ఇక వెసులుబాటు లేకుండా మారింది. ఎన్నాళ్లుగా డ్యూటీలో ఉన్నా టెట్ అర్హత తప్పదు. విద్యారంగంలో నాణ్యతను పెంపొందించేందుకు తీసుకుంటున్న ఈ మార్గం కొంతమందికి సవాళ్లను, మరికొంతమందికి నూతన అవకాశం కావచ్చు.
==============

## నకిలీలు... మోసాలు...

ఆర్మూరు, అక్టోబర్ 23 (భారత శక్తి)
తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత వలసలు కాస్త తగ్గాయి. కానీ ఐదేళ్లుగా మళ్లీ విదేశాలకు వలసలు పెరుగుతున్నాయి. పల్లె, పట్టణ ప్రాంతాల్లోని ఎన్నో కుటుంబాలకి విదేశీ ఉద్యోగాలంటే గొప్ప ఆశ. స్థిరమైన ఉపాధి, మంచి జీతం, కుటుంబ జీవన ప్రమాణం మెరుగుండా మారుతుందని భావిస్తూ వేల మంది, ముఖ్యంగా గల్ఫ్ దేశాల వెలుపలికి వలస వెళు తున్నారు. నిరక్షరాస్యులు సాదాసీమ ఉద్యోగాలకు సిద్ధపడగా, విద్యావంతులు మెరుగైన అవకాశాల కోసం ప్రయత్నిస్తూ ఉంటున్నారు. విదేశీ మోజును కొందరు ఏజెంటు మోసాలకు పాల్పడుతున్నారు. విదేశాల్లో చోటుచేసే ఉద్యోగ అవకాశాల పేరిట డబ్బులు దండుకుని మోసం చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేని సంస్థలు, వ్యక్తులు అక్రమ రీతిలో వలస అవకాశాలు కల్పిస్తున్నారని ప్రతీ ఏడాది కేసులు నమోదవుతున్నాయి. వేలాది మంది రూ. లక్ష నుంచి రూ. 4 లక్షల వరకు చెల్లించి విదేశాలకు వెళ్తున్నారు. అక్కడకు వెళ్లాక సరైన ఉద్యోగం లేక మోసపోతున్నారు. నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, సిద్దిపేట, నిర్మల్ జిల్లాలకి చెందిన చాలా మంది ఉపాధి కోసం గల్ఫ్ బాట పడుతున్నారు. విదేశాలలో ( జోర్డాన్, ఇజ్రాయెల్ సరిహద్దు) అసాధారణ పరిస్థితుల్లో ఉన్నారు. కొందరు ఏజెంట్లను సంప్రదించగా, 'మీరు అమ్ముడయ్యారు' అనే భయంకరమైన సమాధానం ఇచ్చారు. మూడు లక్షల రూపాయలకు పైగా అప్పులు చేసి విదేశాలకు వెళ్లడం తీరని మోసానికే నిదర్శనం. బాధితులకు కొంత మేర సాయం తోటి తెలుగువారూ, ఎన్నారై సంఘాలూ అందిస్తున్నాయి. కొందరు వారి ద్వారా తల్లిదండ్రుల వద్దకు తిరిగిరాగలుగుతున్నారు. కానీ పెద్దశాతం వలసదారులు విదేశాల్లో దుర్భర జీవితాన్ని కొనసాగే పరిస్థితి. దేశంలో విదేశీ వలసలు, మానవ వనరుల చట్టాల ప్రకారం కన్సల్టెన్సీలు రిజిస్టర్ అయి ఉండాలి. తెలంగాణలో మంజూరైనవి 160 ఉండగా, నకిలీ ఏజెంట్లు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. రెండేళ్లలో వలస మోసాల కేసుల్లో అనేకమంది అరెస్ట్ అయ్యారు. విదేశీ వలసల్లో తెలంగాణ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు అక్రమ ఏజెన్సీల మోసాలు, గుర్తింపు ఉన్న సంస్థల కొరత, బాధితులకు వ్యవస్థబద్ధమైన సహాయం లేకపోవడం. మరింత ప్రభావవంతమైన ప్రభుత్వ చర్యలు, ప్రజలకు అవగాహన, చట్టసంబంధ సమాచారం అవసరమన్నది తాజా ఉదంతాలు స్పష్టం చేస్తున్నాయి.
==================

## అకాల వర్షానికి తడిసిన ధాన్యం

నల్గొండ అక్టోబర్ 23 (భారత శక్తి)
ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో గత మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షానికి.. పలు చోట్ల ఊకేపీ, పీఏసీఎస్ కేంద్రాల్లో వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఉదయం భగ భగమంటూ భానుడు మెరుపులు మెరుపుస్తుండగా.. మధ్యాహ్నం తర్వాత అకస్మాత్తుగా వాతావరణం లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి.

నిమిషాల వ్యవధిలోనే వాతావరణం మారిపోయి వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, గురువారం ఉదయం నుంచి ఆరబోసిన ధాన్యం.. కుప్పగా చేర్చేలోపే అకాల వర్షంతో దాన్యం వర్షార్పణం అవుతుంది. ఇది గత మూడు రోజులుగా రైతులకు నిత్య కృత్యమైంది. మరోవైపు 17 తేమశాతం వచ్చిన దాన్యం సైతం, వాతావరణ మార్పుతో కొనుగోలు జరపడం లేదు. ఈ క్రమంలో.. రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# ముఖ్యమంత్రికి... పదవీ గండం..?



హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కాంగ్రెస్ హైకమాండ్ ఆగ్రహంగా ఉందన్న ప్రచారం ఊపందుకుంది. కొన్ని మీడియాలు ఇటువంటి కథనాలు ప్రచురిస్తున్నాయి. కానీ కాంగ్రెస్ వర్గాలు మాత్రం ఆ ప్రచారాన్ని కొట్టిపారేస్తున్నాయి. రేవంత్ రెడ్డి అంటే గిట్టని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారని బాహాటంగానే చెబుతున్నారు. మల్లికార్జున ఖర్గే తనను పరామర్శించడానికి వెళ్లిన కాంగ్రెస్ నేతలతో ఈ వ్యాఖ్యలు చేసినట్లు కథనాలు వచ్చాయి. అయితే ఏఐసీసీ అధ్యక్షుడిగా ఇటువంటి వ్యాఖ్యలు పార్టీ నేతలు ముందు మల్లికార్జున ఖర్గే చే?స్తారా? అన్న అనుమానం లేకపోలేదు. ఎందుకంటే జాతీయ అధ్యక్షుడి హోదాలో ఉంటూ నేతలతో ముఖ్యమంత్రి పనితీరును తప్పుపట్టే విధంగా మాట్లాడటం అసాధ్యమన్నది రేవంత్ రెడ్డి వర్గీయుల వాదననిజానికి రేవంత్ రెడ్డిపై పార్టీ హైకమాండ్ కు నిజంగా అసంతృప్తి ఉంటే ఆయనను ఏదో ఒక వంకతో పదవి నుంచి తప్పించే వారు. అంతే తప్ప కాంగ్రెస్ నేతలతో ఆయన పనితీరును తప్పుపట్టే పనిని ఏ పార్టీ నాయకత్వం చేయదన్నది వాస్తవం. నిజానికి తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ ఇచ్చినప్పుడు కూడా రెండు సార్లు అధికారంలోకి రాలేదు. 2014 లో కాంగ్రెస్ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చినప్పటికీ 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవలేకపోయింది. నిజంగా ప్రజలకు కేసీఆర్ పై గురి కుదిరి ఉంటే 2014 ఎన్నికల్లో విజయంతో సరిపెట్టేవారు. రెండోసారి కూడా ఆయనకే పట్టం కట్టారంటే కాంగ్రెస్ నేతల పట్ల సరైన నమ్మకం లేకపోవడమే. అంతేకాకుండా కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం ప్రజలను కూడా ఆ రెండు ఎన్నికల్లో ఆకట్టులేకపోయిందని రేవంత్ వర్గీయులు అంటున్నారు. 2023 ఎన్నికలకు ముందు పీసీసీ చీఫ్ పదవి దక్కించుకున్న తర్వాత రేవంత్ రెడ్డి జనంలోకి వెళ్లడమే కాకుండా పార్టీని గెలుపు దిశగా తీసుకు వచ్చారంటున్నారు. కేసీఆర్ మాటలకు ధీటుగా రేవంత్ రెడ్డి ప్రసంగం కూడా ప్రజలను ఆకట్టుకోవడం గత ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఒక కారణమన్న విశ్లేషణలు కూడా ఉన్నాయి. దీంతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు కూడా బాగా పనిచేయడం వల్లనే కాంగ్రెస్ గెలుపు సాధ్యమయింది. ఈ పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి ని తప్పించి మరొకరిని ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టే సాహసం కాంగ్రెస్ హైకమాండ్ చేసే అవకాశం లేదు. నిధులు లేకపోయినా ఇచ్చిన హామీలను అమలు చేశారని, ముఖ్యమంత్రిపై పార్టీలో వ్యతిరేకత లేదన్నది వారుచెబుతున్న మాట. మొత్తం మీద తప్పుడు ప్రచారం చేయవద్దంటూ రేవంత్ రెడ్డి వర్గీయులు సోషల్ మీడియాలో వార్నింగ్ ఇస్తున్నారు.

# కాంగ్రెస్ సోషల్ మీడియా కకావికలం



హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)
మంత్రుల మధ్య సయోధ్య లేదు. చివరికి సాటి మంత్రిని మరో మంత్రి దున్నపోతు అని అనడానికి కూడా వెనుకాడడం లేదు. ఇది వివాదానికి కారణమైంది.. ఆ తర్వాత పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ మధ్య వివాదాలు ఏర్పడ్డాయి. మధ్యలోకి కుండా సురేఖ కుమార్తె సుస్మిత రావడంతో ఆ వివాదం మారింత పెరిగింది. దీంతో స్వయంగా ముఖ్యమంత్రి కల్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. చివరికి ఆ వివాదం తాత్కాలికంగా ముగిసినప్పటికీ పార్టీకి విపరీతమైన డ్యామేజ్ చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో ముసలం ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీకి సంబంధించి సోషల్ మీడియాలో కీలకంగా వ్యవహరించిన బీటెక్ వంశీ అలియాస్ వంశీ తన పదవికి రాజీనామా చేశారు. రాజీనామా చేస్తున్నందుకు గల కారణాలను ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాను తాము కష్టపడి నిలబెట్టుకున్నామని.. కానీ చూస్తుండగానే అది కూలిపోతోందని.. దానికి కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా చైర్మన్ కారణమని వంశీ తన పోస్టులో పేర్కొన్నారు. గుండె బరువెక్కి, ఆవేదనతో రాజీనామా చేస్తున్నానని ఆయన ప్రకటించారు.. పార్లమెంట్ ఎన్నికల వరకు సోషల్ మీడియాలో ఎటువంటి సమస్య లేదని.. తమ పూర్తి స్వేచ్ఛతో పని చేశామని.. ఎప్పుడైతే ప్రైవేట్ వ్యక్తులు సోషల్ మీడియాలోకి వచ్చారో.. అప్పుడే పరిస్థితులు మారిపోయాయని వంశీ పేర్కొన్నారు. సోషల్ మీడియా పై ఎటువంటి అవగాహన లేని వ్యక్తులను తీసుకొచ్చారని.. వారంతా కూడా కష్టపడి పని చేసిన తన లాంటి వారిని అవమానానికి గురి చేశారని వంశీ తన లేఖలో ప్రస్తావించారు. ఉద్యోగాలు మానేసి.. పార్టీ కోసం కష్టపడిన సోషల్ మీడియా కార్యకర్తలకు అవకాశాలు కల్పించాలని కోరితే.. వివిధ కారణాలను చెబుతూ దాటవేశారని వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. ఉంటే ఉండండి.. పోతే పొండి అంటూ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలు తీవ్ర ఆవేదనకు గురి చేస్తున్నాయని వంశీ పేర్కొన్నారు. ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ.. ఇప్పటికీ తమను మభ్య పెడుతూనే ఉన్నారని వంశీ ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సోషల్ మీడియాలో తనకు మాత్రమే కాదని.. అందరికీ ఇలాంటి పరిస్థితే ఎదురవుతోందని వంశీ వివరించారు. "ఇతర విభాగాల చైర్మన్ల ను మార్చినట్టే.. సోషల్ మీడియా చైర్మెన్ కూడా మారితే పార్టీకి మళ్ళీ పూర్వ వైభవం తీసుకురావడానికి ప్రయత్నించాం. ఇదే విషయాన్ని రాష్ట్రంలో ఉన్న సోషల్ మీడియా వారియర్స్ అందరికీ చెప్పుకుంటూ వచ్చాం.. మీ కార్యాలయంలో పనిచేసే ప్రైవేట్ ఉద్యోగులకు పార్టీ పదవులు ఇచ్చారంటే పార్టీలో మీకెంత పవర్ ఉందో ఊహించగలం. కానీ ఆ పవర్ ను పనిచేసిన కార్యకర్తల కోసం ఉపయోగించి ఉంటే ఒకరైన బాగుపడేవారు. పార్టీ గెలుపు కోసం కష్టపడిన కార్యకర్తలను విస్మరించారు. 10 సంవత్సరాలు గులాబీ పార్టీ ప్రభుత్వ ఫలాలు పొంది.. పదవులు అనుభవించిన వారికి.. కాంగ్రెస్ పార్టీ ఓటమి కోసం కృషి చేసిన వారికి పదవులు ఇవ్వడం దేనికి.. ఇది పార్టీలో అంతర్గత సమస్యలను తెచ్చిపెడుతుంది కదా.. చివరిగా నేను చెప్పేది ఒకటే విషయం.. పార్టీ అనేది కార్యకర్తల సమూహం. వారికి గౌరవం ఇవ్వాలి. కార్యకర్తలను ఉద్యోగులుగా మార్చుకోవాలి అను చూడడం దారుణం. పార్టీని చెప్పుచేతల్లో ఉంచాలనుకోవడం పార్టీ విధానాలకు పూర్తి విరుద్ధం. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అంటే స్మార్ట్ ఫోన్లు, లాప్టాప్ లు మాత్రమే కాదు. అంతకుమించిన శ్రమ ఉంటుంది. పార్టీ ఏజెండాను 365 రోజులు ప్రజలకు చేరవేసిన చరిత్ర మాది. అటువంటి వేలాదిమంది కార్యకర్తలకు కృషి చేస్తే మీరు పదవులు అనుభవిస్తున్నారు. ఈ రాజీనామా వెనుక ఎవరి బలవంతం లేదు. పూర్తిగా నా వ్యక్తిగతం. ఇకనుంచి కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తగా మాత్రమే పనిచేస్తాను. నా రాజీనామాతో నైనా పార్టీ నాయకత్వం మారాలి. పార్టీలో పని చేసే సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయం చేయాలని" వంశీ ఆ పోస్టులో పేర్కొన్నారు.

## విద్యార్థులను చర్చికి తీసుకుపోయిన పాస్టర్ పోలీసులకు పిర్యాదు

మెదక్ అక్టోబర్ 23 (భారత శక్తి),
వెల్దుర్తి (మం) శెట్టిపల్లిలో పాస్టర్ నిర్వాకం బయటపడింది. స్కూల్ కి అని చెప్పి విద్యార్థులను చర్చికి తీసుకెళ్లాడు. చర్చిలో విద్యార్థులతో ప్రార్థనలు చేయించి సోషల్ మీడియాలో పెట్టడంతో విషయం వెలుగులోకి వచ్చింది. పాస్టర్ ఏసుపై పోలీసులకు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేసారు. చివరకు విద్యార్థుల తల్లిదండ్రులకు పాస్టర్ క్షమాపణ చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.
============================

## విద్యార్థినులకు అసభ్యకర మెసేజీలు

జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 23 (భారత శక్తి)
జిల్లా కేంద్రంలోని బిట్స్ ప్రైవేట్ పాఠశాలలో పీఈటీ మోహన్ నాయక్, టీచర్ కిరణ్ లు అక్కడ చదివే అమ్మాయిలను సోషల్ మీడియా మాధ్యమాల్లో అసభ్యకరమైన మేసేజ్ లు చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు పోలీసులకు పిర్యాదు చేసారు.

## రేణుకుంట లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

కరీంనగర్ అక్టోబరు 23,తిమ్మాపూర్ మండలం రేణుకుంట లో వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. దుండగులు సీసీ కెమెరా కేబుల్ కట్ చేసి దొంగతనానికి పాల్పడం?డారు. రోల్డ్ గోల్డ్ నగలు, నగదు అపహరించారు. మూడేళ్లలో రెండవసారి వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ జరిగింది. మూడు నెలల క్రితం అదే గ్రామంలోని సాయిబాబా ఆలయంలో చోరీ జరిగింది. ఆలయాలకు రక్షణ కరువైందని స్థానికులు ఆవేదనతో ఆందోళన చెందుతున్నారు. పోలీసులు విచారణ చేపట్టారు.

## సెల్ టవర్ పై నుంచి దూకి ఆత్మహత్య

రాజన్న సిరిసిల్లకోనరావుపేట మండలం మామిడిపల్లిలో దారుణం జరిగింది. సెల్ టవర్ పై నుంచి దూకి గుమ్మడి బాబు ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య పిల్లల ఎదుటే టవర్ పై నుంచి దూకాడు. బుధవారం రాత్రి ఓ డిన్నర్ వెళ్ళగా గొడవ జరిగిందని కుటుంబ సభ్యులు వెల్లడించారు. బాబు ఆత్మహత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని డిమాండ్ చేసారు. మృతుడు, భార్య ప్రవళిక పదేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆర్థిక ఇబ్బందులతో దుబాయ్ వెళ్ళి నెల రోజుల క్రితమే స్వగ్రామానికి వచ్చాడు న బాబు. పోలీసులు ఆత్మహత్యపై ఆరా తీస్తున్నారు.

## సదాశివపేట (మం) అనంతసాగర్ వద్ద స్కూల్ బస్సుకి తప్పిన ప్రమాదం

సంగారెడ్డిఅక్టోబర్ 23 (భారత శక్తి)సదాశివపేట నుంచి అనంతసాగర్ వెళ్తుండగా లిటిల్ బర్డ్స్ స్కూల్ బస్సు ఒక్కసారిగా రోడ్డు పక్కకి దూసుకెళ్లింది. విద్యార్థులు ప్రమాదంలో అదృష్టవశాత్తూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రోడ్డు బాగలేక ప్రమాదం జరిగిందని బస్సు డ్రైవర్ చెబుతున్నాడు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం అని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# కిస్సా...కుర్సీకా

**పార్టీ కార్యక్రమంలో మాత్రం డిసిసి పదవి ఎవరికి ఇచ్చిన కలిసి పని చేస్తామని చెప్తూనే క్షేత్రస్థాయిలో మాత్రం తమ వర్గానికి డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని పట్టుబడుతున్న నేపథ్యంలో డిసిసి అధ్యక్షుని ఎంపికపై తర్జన భర్జన జరుగుతుంది ఏదేమైనా నిర్మల్ జిల్లాలో డిసిసి అధ్యక్షుని ఎంపిక పార్టీకి పెను సవాలుగా నిలవనున్నట్టు రాజకీయ చర్చ జరుగుతుంది**

అదిలాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)
నిర్మ ల్ జిల్లాలో చేతి పగ్గాలను చేజిక్కించుకునేందుకు ఎవరికి వారే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో అఖిల భారత కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీల ను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. ఈనెల 25 లోపు తెలంగాణ రాష్ట్రం లోని అన్ని జిల్లాల్లో డిసిసి అధ్యక్షులు నియామకానికి క్షేత్రస్థాయిలో కసరత్తు పూర్తి కావ డంతో ఎంపికపై ఆసక్తి నెలకొంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రాజకీయ చైతన్య ఉన్న నిర్మల్ జిల్లాలో అధ్యక్ష పదవికి పెద్ద ఎత్తున దరఖాస్తులు రావడం అందులో సీనియర్ నేతల ఉండడంతో ఎవరిని ఎంపిక చేస్తారన్న అంశంపై జిల్లా కాంగ్రెస్లో తీవ్రంగా చర్చ జరుగుతుంది. ప్రస్తుతం నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కే శ్రీహరిరావు డిసిసి అధ్యక్షు నిగా రెండు సంవత్సరాలుగా కొనసాగుతున్నారు. 2023 డిసెంబర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు డిసిసి అధ్యక్ష పదవి చేపట్టిన శ్రీహరి రావు కాంగ్రెస్ జిల్లా బాధితు లను కూడా నిర్వర్తిస్తూ వస్తున్నారు.

కర్ణాటక చెందిన మాజీ మంత్రి సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అజయ్‌సింగ్ నిర్మల్ ఖానాపూర్ ముధోల్ నియోజకవర్గం బ్లాక్ స్థాయి సమావేశాలు నిర్వహించి బీసీసీ అధ్యక్షుని ఎంపికపై అభిప్రాయ సేకరణ నిర్వహించారుఅఖిలభారత కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షు లు ఎంపిక విషయంలో ఈసారి పారదర్శకత పద్ధతిలో ఎంపికకు శ్రీకారం చుట్టింది. రాజకీయ ప్రాబల్యం ఉన్న నేతలకు కాకుండా ప్రజలతో సంబంధాలు ఉండి పార్టీ కార్యక్రమాలు నిర్వహించి ఈ నాయకుడిని అయినా డీసీసీ అధ్యక్షులు ఎంపిక చేసుకోవచ్చని సూచించింది. నిర్మల్ జిల్లాలో డిసిసి అధ్యక్ష పదవి కోసం మొత్తం 20 మంది దరఖాస్తు చేసుకున్నారు. డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు తో పాటు సీనియర్ నాయకులైన పత్తిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, అల్లూరి కృష్ణావేని, దశరథం రాజేశ్వర్, గ్రంథాలయ చైర్మన్ అర్జున్ మత్ అలీ, అనుముల భాస్కర్, ముడుసు సత్యనారాయణ, గంగారెడ్డి, ఆనందరావు పటేల్, రాజుర సత్యం తదితర సీనియర్ నాయకులతో పాటు జూనియర్ నాయకులు కూడా ఉన్నారు. డిసిసి అధ్యక్షులు ఎన్నికలు పేర్ల కసరత్తు పూర్తి అయి ముగ్గురు పేర్లను ఢిల్లీకి పంపినట్టు ప్రచారం జరుగుతుంది ఇందులో అయితే డిసిసి డిసిసి అధ్యక్షులు శ్రీహరి రావు, గ్రంథాలయ చైర్మన్ అర్జుమత్ అలీ, సీనియర్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి పేర్లు ఉన్నట్టు తెలుస్తోంది.

కాంగ్రెస్ పార్టీలో ఐదు సంవత్సరాలుగా పనిచేసే ఉం డాలని ఒకరికి ఒక పదవి ఇవ్వాలని ప్రజల అభిప్రాయం మీదకి ఎంపిక బాధితులు చేపట్టాలని రాజకీయ లాబింగ్లకు దూరంగా ఉంటూ జిల్లాలో సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని ఎంపిక చేయాలని రాష్ట్ర పరిశీలకులను ఆదేశించింది దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు 15 మందిపైగా 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన వారి అధికంగా ఉన్నారు. ఇందులో కాంగ్రెస్ పార్టీలో గ్రంథాలయ చైర్మన్ అర్జుమాత్ అలీ బ్లాక్ కాంగ్రెస్ నాయకులు దశర థం రాజేశ్వర్ బైంసాకు చెందిన మాజీ మార్కె ట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పార్టీలతో పాటు మరో నలుగురు ఉంటారని పార్టీ నేత లు చెప్తున్నారు. అయితే జిల్లాలో రాజకీయ చైతన్యం అందర్నీ కలుపుకుపోయే నేతలు ప్రజలతో ఉన్న సంబంధాలను దృష్టిలో పెట్టుకొని డిసిసి అధ్యక్షుని ఎంపిక నిర్వహించే విధంగా కసరత్తు జరుగుతుంది. డిసిసి అధ్యక్షుని ఎంపికకు తన పేరు కూడా పరిశీలిం చాలని రాష్ట్ర కాంగ్రెస్ మహిళా ఉపాధ్యక్షురా లు కృష్ణవేణి కూడా దరఖాస్తు చేసుకున్నారు. నిర్మల్ జిల్లాలో డిసిసి అధ్యక్ష పదవి చేపట్టేందుకు జిల్లాలోని ముఖ్య నేతలంతా కూడా తమ రాజకీయ పలుకుబడితో ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో పార్టీ కోసం చేసిన కార్యక్రమాలు రాజకీయ ప్రాబల్యం సీనియర్ నేత రాజకీయ అనుభవం తదితర అంశాలను వివరిస్తూ డిసిసి అధ్యక్ష పదవిని తమకే కేటాయించాలని రాష్ట్ర అధిష్టానం పై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు.

జిల్లాలో నిర్మల్ ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలు ఉండగా మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీలో నేతల మధ్య గ్రూపు వివరాలు చాప కింద నీరుల ఉండడంవల్ల డిసిసి అధ్యక్షులు ఎంపిక విషయంలో తమవారికి అవకాశం ఇవ్వాలని ఎవరికి వారి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీ కార్యక్రమంలో మాత్రం డిసిసి పదవి ఎవరికి ఇచ్చిన కలిసి పని చేస్తామని చెప్తూనే క్షేత్రస్థాయిలో మాత్రం తమ వర్గానికి డిసిసి అధ్యక్ష పదవి ఇవ్వాలని పట్టుబడుతున్న నేపథ్యంలో డిసిసి అధ్యక్షుని ఎంపికపై తర్జన భర్జన జరుగుతుంది ఏదేమైనా నిర్మల్ జిల్లాలో డిసిసి అధ్యక్షుని ఎంపిక పార్టీకి పెను సవాలుగా నిలవనున్నట్టు రాజకీయ చర్చ జరుగుతుంది. నిర్మల్ జిల్లాలో గత కొన్ని రోజులుగా డీసీసీ అధ్యక్ష పదవిని ఓసి సామాజిక వర్గానికి కేటాయిస్తున్నందున ఈసారి బీసీలకు కేటాయించాలని బీసీ నేతలు పట్టుబడుతున్నారు.

ముఖ్యమంత్రి రేవం త్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమా ర్‌గౌడ్ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం పోరాడుతు న్న నేపథ్యంలో డిసిసి అధ్యక్షులు ఎంపికలు కూడా బీసీ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలని బీసీ నేతలు కోరినట్లు తెలిపారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సామాజిక సమీకరణల నేపథ్యంలో డిసిసి అధ్యక్షుని ఎంపిక ముడిపై ఉన్నందున రాష్ట్ర అధిష్టానం ఏ జిల్లాలో ఏ సామాజిక వర్గానికి కేటాయించాలని తీవ్రంగా చర్చిస్తున్నట్టు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలోని మాజీ మంత్రులైన వేణుగోపాలచారి ఏ ఇంద్రకరణ్‌రెడ్డి, గడ్డం వినోద్ కుమార్ ప్రస్తుత మంత్రి వివేక్ వెంకటస్వామి తో పాటు సీనియర్ నేతలు మాజీ ఎమ్మెల్యేల అభిప్రాయాలను కూడా తీసుకొని డిసిసి అధ్యక్షుని ఎంపిక చేసే విధంగా పార్టీ చర్యలు తీసుకుంటుంది. ఇప్పటివరకు నిర్మల్ జిల్లా లో డిసిసి అధ్యక్ష పదవి బీసీ వర్గానికి పోవడానికి ఇతర వర్గాల ఆధిపత్యమేనని ఈసారి తమకు తప్పకుండా అవకాశం కల్పిస్తారని బీసీ నేతలు ఎదురుచూస్తున్నారు

# ప్రగతి పరుగులో తగ్గని పేదరికం

78 సం" రాల స్వతంత్ర భారత్ లో కేంద్ర ప్రభుత్వం అవలంబించిన వ్యవసాయ' ఆర్థిక 'ప్రణాళిక' పారిశ్రామిక పెట్టుబడి 'ఉత్పత్తి ' మార్కెటింగ్ సమాచార ' విదేశీవర్తకం ' సాంకేతిక' పరిజ్ఞాన విధానాల వల్ల ధనికులు మరింత ధనవంతులై పేదవారు మరింత పేదరికంలోకి నెట్టి వేయబడి దేశంలో వివిధ వర్గాల ప్రజల ఆదాయాలు సంపదలు ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయి.

ప్రపంచంలో 5 పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న ఇండియాను 2030 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానానికి చేరుకుంటుందని ఎస్' అండ్' పీ గ్లోబల్ రేటింగ్ సంస్థ తాజాగా ప్రకటించడం గమనార్హాం.

3.6 లక్షల కోట్ల డాలర్ల స్థాయిలో వున్న భారత దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం2046 నాటికి 8 రెట్లకు పెరుగుతుందని అనేది వినడానికి గొప్పలు చెప్పుకునే పరిస్థితిలో దేశంలో అట్టడుగు స్థాయిలో జీవిస్తున్న పేదల సంఖ్య ఆశించిన స్థాయిలో తగ్గని విచిత్ర స్థితి నెలకొనడం విచారకరం.

పేదలు ఉన్న జనాభా భారత్

ఐక్యరాజ్య సమితి ఇటీవల వెల్లడించిన తాజా నివేదిక ప్రకారం ప్రపంచ దేశాల్లో పేద ప్రజల జనాభా ఎక్కువగా భారతదేశంలోనే ఉన్నారని. ప్రపంచ వ్యాప్తంగా 110 కోట్ల మంది పేదలు ఉండగా అందులో 23.4 కోట్ల మంది భారతదేశంలోనే ఉన్నారనే విషయాన్ని తమ అధ్యయనంలో వెల్లదించింది. వెలుగు చూసింది. మన ప్రగతి వెలుగుల మాటలతో మగ్గిపోతున్న జీవితాలకు అద్దం పడుతుంది .ప్రజల ఆదాయాలు జీవన ప్రమాణాలు మెరుగుదల అభివృద్ధికి సరైన కొలమాణాలు. జి' డి 'పిలో ఉన్నత స్థాయికి చేరుతున్న ఇండియా తలసరి ఆదాయం పరంగా 140 దేశాల కన్నా దిగువన ఉంది.

ఆక్స్ఫామ్ నివేదిక ప్రకారం

జనాభాలో ఒక శాతం చేతుల్లో40 శాతం దేశ సంపద కేంద్రీకృతమై ఉంది .ఆర్థిక ప్రగతి తో ప్రజ్వరిల్లుతున్న ఆర్థిక అసమానతలు పేదరికాన్ని రూపుమపడంలో విఫలమైనాయి.

సమాజంలో ఉన్నత వర్గాల సంపద ఆదాయం పెరుగుతూ ఉంటే దిగువ శ్రేణిలో వున్న వారి పరిస్థితి నానాటికి దిగజారిపోతుంది.

ఆర్థిక వ్యవస్థలో మొత్తం జాతీయ సంపద 71% జనాభాలో పై 10 శాతం కలిగి ఉన్నారు ఇండియాలో 119మంది బిలియనీర్లు వున్నారు. వీరి సంపద పది ఏళ్లలో 10 రెట్లు పెరిగింది.

మనదేశంలో రోజుకు 70 మంది కొత్తగా మిలియనీర్లు అవుతున్నారు. దేశములో ఉత్పత్తి చేయబడిన73శాతం దేశములో అత్యంత ధనవంతులైన1శాతంమందికి చేరింది. 670మిలియన్ పేదల సంపదలో కేవలం1 శాతం మాత్రమే పెరుగుదల సూచిస్తుంది.

5వ ఆర్థిక శక్తి భారత్

అమెరికా చైనా జపాన్ జర్మనీ తర్వాత భారత్ జిడిపి లో దూసుకుపోతూ5 వఆర్థిక శక్తిగా ఎదుగుతున్నప్పటికి ప్రజల ఆదాయాలు సంపద ఆర్థిక వ్యత్యాసాలు పెరుగుతున్నాయి.

**హురూన్ ఇండియా వెల్లడి**

ఇటీవల హునర్ ఇండియా సంస్థ దేశంలోని అత్యంత సంపన్న జాబితా విలువ చేసింది. జూలై31 నాటికి దేశములో కుబేరుల సంఖ్య 1539కి పెరిగింది. వీరి వద్ద పోగైన సంపద రూ" 159లక్షల కోట్లు . వీరి ఆస్తులు ఈ ఏడాది 46% వృద్ధి చెందాయి. దేశంలో 140 కోట్ల జనాభాలో ఆదాయ అసమానతలు సంపద అసమానతలు ఆర్థిక వ్యత్యాసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ పరిస్థుతులు ఇలాగే కొనసాగితే సామాజిక అశాంతికి దారితీసే ప్రమాదం వుందని సామాజిక ఆర్థిక వేత్తలు అభిప్రాయ పడుతున్నారు.

బ్రిటిష్ కాలం నాటి కంటే స్వదేశీ పాలనలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఆర్థిక 'ప్రణాళిక 'పారిశ్రామిక సేవల 'ఉత్పత్తి 'మార్కెటింగ్ ఉపాధి ' రవాణా ' సమాచార విధానాల వల్ల ఆర్థిక వ్యవస్థలో అసమానతలు పెరుగుతున్నాయి. వివిధ అభివృద్ధి నివేదికల ప్రకారం పరిశీలిస్తే దేశములో1శాతం జనాభా చేతుల్లో40.01శాతం సంపద కేంద్రీకృతమై వుంది.

వివిధ వర్గాల ఆదాయ సంపద అసమానతలు పెరుగుతున్నాయి. వాస్తవిక ఆదాయం క్రమంగా పెరుగుతున్నపటికి ప్రజల ఆదాయాల మధ్య అంతరాలు పెరుగుతున్నాయి. దీనికి కారణం కేంద్ర ప్రభుత్వం అనుసరించిన1991 ఆర్థిక సంస్కరణలే.

1991 కిముందు మన దేశ జిడిపి లో3శాతం వద్ద వృద్ధి ఆగిపోయింది. సంస్కరణల తర్వాత మన దేశ జిడిపి 6-8శాతం వృద్ధి రేటు పెరిగింది. ఈ కాలములో అతి తక్కువ శాతం జనాభాలో గరిష్ఠ సంపద పెరిగింది. ఇదే కాలములో ప్రభుత్వం ఆర్థిక అంతరాలు తగ్గించే చర్యలు తీసుకోలేదు. ఆర్థిక వ్యవస్థలో ఉపాధి రహిత ఉత్పత్తి ఉత్పాదకత పెరిగి ఆర్థిక ఆదాయ అసమానతలను తీవ్రతరం చేశాయి.

దేశములో జరిగిన గణనీయమైన ప్రగతి వల్ల సుమారు 25 కోట్ల మంది కఠిన పేదరికం నుండి విముక్తి పొందారని నీతి అయోగ్ చర్చా పత్రం లో ప్రకటించడం జరిగింది. 5 శాతంకంటే తక్కువ మంది భారతీయులు పేదరికంలో ఉన్నారనినీతి ఆయోగ్ సి ఇ ఓ పేర్కొన్నారు.ఒక వైపు 81కోట్ల మంది ప్రజలకు ప్రభుత్వమే ఉచితంగా ఆహారధాన్యాల నూపంపిణి చేస్తుంది. ప్రభుత్వానికి వచ్చే రాబడి లెక్కల మీధ ఆధారపడి పేదరికాన్ని లెక్కించడం సరైంది కాదు

నాణ్యమైన.విధ్య వైద్యం 'ఆరోగ్యం తాగునీరు పౌష్టికాహారం మున్నగు అంశాలు సామాన్యులకు అందుబాటులో ఉన్నాయా? లేదా అంశాల్ని పరిశీలించాలి.

**అందుబాటులో లేని ప్రజారోగ్యం**

ప్రభుత్వ ఆసుపత్రులు సిబ్బంది కొరత మౌలిక వసతుల కొరత బెడ్స్ కొరత మందుల కొరతతో కుమారిల్లుతున్నాయి. పేద వర్గాల ప్రజలు కనీస వైద్య సేవలు అందుబాటులో లేక పోవడం వల్ల ప్రైవేటు కార్పొరేట్ ఆసుపత్రులకు ఆశ్రయించ వలసి వస్తుంది. ఖరీదైన వైద్య ఖర్చులు భరించలేక అప్పుల పాలై ఆర్థిక భారాన్ని మోయలేక ఉన్న ఆస్తులను అమ్ముకొని పీదరికంలోకి నెట్టి వేయబడుతున్నారు.

**లోపించిన సమతుల ఆహారం**

దేశములో 15బి 49 ఏళ్ల వయసులోనే స్త్రీలలో57 శాతం పురుషుల్లో 25 శాతం రక్త హీనతతో బాధపడుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే పేర్కొంది. 5ఏళ్ల లోపు పిల్లలు

పౌష్టికాహార లోపంతో ఆరోగ్యపరంగా ఎదుగుదల లోపించింది. మానవ వనరుల అభివృద్ధి ఆశించిన మేరకు ప్రగతి లేదు.

ఐక్యరాజ్య సమితి జనసంక్షేమానికి 17 సుస్థిరాభి వృద్ధి లక్ష్యాలను నిర్దేశించింది చాలా లక్ష్యాల సాధనలో భారత్ వెంకుబడి వుంది. పెరుగుతున్న వినియోగ వ్యయానికి తగినట్లు ఆదాయాలు పెరుగడం లేదు.

ప్రదర్శన ప్రభావానికి గురైన ప్రజలు ఎక్కువ ఖర్చులు చేస్తూ అప్పుల పాలవుతున్నారు. అనేక కుటుంబాలు అప్పుల ఊబిలోకి కూరుకు పోతున్నారు.

వ్యవసాయ రంగములో పెట్టుబడికి తగిన గిట్టుబాటు లేక రైతులు వ్యవసాయ రంగం నుండి నిష్క్రమించి పట్టణాలకు వలసలు పోతున్నారు. కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక మధ్యవర్తుల దళారీల మోసాలకు బలై ఆర్థికంగా కుదేలై ఆత్మహత్యలకు పాల్పడే పరిస్థితులు రాజ్యమేలుతున్నాయి.

గ్రామీణ ఆర్థికవ్యవస్థ పరిపుష్టికి ఆర్థిక స్వాలంభనకు ఆయువు పట్టైన చేతి వృత్తుల ఉత్పత్తులకుగిరాకీ తగ్గడం వల్ల చేతివృత్తులు కుదేలైనాయి. చేతి వృత్తులు ఆధునికీకరణకు నోచుకోక పోవడం వల్ల వీటిపై ఆధారపడి జీవించే వారు ఇతర రంగాలకు వలస వెళ్లారు. ప్రభుత్వం చేతి వృతుల ఆధునికీకరణకు అధునాతన సాంకేతికతను అందించి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తే చేతివృత్తుల పై ఆధారపడిన వారి జీవితాలలో ఆర్థిక వెలుగులు తేవడానికి సమగ్ర కార్యాచరణ వ్యూహాలను అమలు చేయాలి.

**యువత నైపుణ్యాభివృద్ధి**

జనాభాలో 60 శాతంవున్న యువతలో చదువుకు తగిన నైపుణ్యాలు లేవు. ఉపాధి పొందే స్థితిలో లేకపోవడం వల్ల నిరుద్యోగం వారి పాలిట శాపంగా పరిణమించింది. ప్రభుత్వం విద్యార్థి దశ నుండే విద్యార్థులకు ఎర్న్ వైల్ లెర్న్ విద్యావిధానాన్ని అమలు చెయ్యాలి. చదువుకునే రోజుల్లోనే విద్యార్థుల్లో పని పట్ల శ్రద్ధ ఆసక్తి పెంచి స్వశక్తితో స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకునే పరిస్థితులు సృష్టించి యువత ఉపాధిని సృష్టించే శక్తిగా ఎదిగి ఆత్మగౌరవంతో జీవించే వ్యవస్థను నిర్మాణం చెయ్యాలి.

దేశములో లభించే సహజ వనరుల అభిలషణీయ వినియోగానికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలి. పర్యావరణ హిత పారిశ్రామిక అభివృద్ధికి దోహదపడే పరిశ్రమల స్థాపనకు పూనుకోవాలి.

పేదరికం నిరుద్యోగం ఆర్థిక అసమానతలు లింగ వివక్ష వేతన వివక్ష ప్రాంతీయ అసమానతల కట్టడి విధ్య వైద్య పోషకాహార సౌకర్యాల కల్పనలో బడ్జెట్లో ఎక్కువ నిధులు కేటాయించి సకాలములో వ్యయం చేసి నైపుణ్యాల వృద్ధి యువత మహిళా సాధికారిత సంక్షేమ కార్యక్రమాలకు గ్రామీణ ఉపాధి కల్పన పథకాల సమర్థ అమలు. ప్రజల జీవన ప్రమాణాలను తలసరి ఆదాయాల పెరుగుదలతో మెరుగైన మానవ వనరుల అభివృద్ధికి ప్రాధాన్యతలు

ప్రజ్వరిల్లితేనే 2030 నాటికి భారత్ ప్రగతి వెలుగుల్లో ప్రపంచంలో మూడో ఆర్థిక శక్తిగా ఎదుగుతుందని ఆశిద్దాం.



**నేదునూరి కనకయ్య**
**రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ ఎకనామిక్ ఫోరం సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక కరీంనగర్**
**9440245771**

# భైంసా వాసవి హై స్కూల్‌లో ఘనంగా పోలీస్ ఫ్లాగ్ డే వేడుకలు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (భారత శక్తి):భైంసా వాసవి హై స్కూల్లో పోలీస్ స్మారక దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే)ను ఘనంగా నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమర వీరులను స్మరించుకుంటూ కార్యక్రమం ప్రారంభమైంది.




ఈ సందర్భంగా పట్టణ సీఐ గోపీనాథ్ మాట్లాడుతూ, "విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన ధైర్యవంతులైన పోలీసు సిబ్బంది త్యాగాలు అపారమైనవి. వారి సేవలను స్మరించుకునేందుకు ప్రతి సంవత్సరం అక్టోబర్ 21న పోలీస్ స్మారక దినోత్సవం జరుపుకుంటాము" అని పేర్కొన్నారు. అలాగే ఆయన "మాదక ద్రవ్యాల ముప్పు"పై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. అదనంగా, సైబర్ క్రైమ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు.

# పీక్స్‌కు చేరిన పొలిటికల్ హీట్

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)

తెలంగాణ రాజకీయాల్లో జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు గతంలో ఎన్నడూ లేనంతగా పొలిటికల్ హీట్ ను పీక్స్ కు తీసుకెళ్లాయి. సిట్టింగ్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మృతితో ఈ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు వచ్చిన విషయం తెలిసిందే. సాధారణంగా సిట్టింగ్ సీటుకు అనివార్య కారణాల వల్ల మధ్యలో ఎన్నికలొస్తే, సానుభూతి పైనే సిట్టింగ్ ఎమ్మెల్యే కు చెందిన పార్టీ ఆశలు పెట్టుకుంటుంది. అందులోనూ మాగంటి గోపీనాథ్ భార్య సునీతకు ఎమ్మెల్యే టిక్కెట్ కేటాయించడంతో సానుభూతి ఓటింగ్ పై ఇంకాస్త ఎక్కువ ఆశలే పెట్టుకుంది బీఆర్ ఎస్ పార్టీ. దీనికితోడు జూబ్లీహిల్స్ బరిలో నిలిచిన దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత ఎన్నికల ప్రచారం కొనసాగుతున్న తీరు, కాస్త కొత్తగా ఉంది.కేటీఆర్ వంటి కీలక నేతలు పాల్గొన్న బీఆర్ ఎస్ ఎన్నికల సభల్లో ఎమ్మెల్యే అభ్యర్థి సునీత భావోద్వేగం ఆపుకోలేక, భర్తను అభిమానించే కార్యకర్తలను చూసి తీవ్ర దుఖంతో కన్నీళ్లు పెట్టుకుంటున్న తీరు చూసి సొంత పార్టీ నేతలే షాకవుతున్నారు. కనీసం వేదికపై నోటి నుండి మాటలు రాలేనంతగా ఆమె విలపిస్తుంటే, మాగంటి గోపీనాథ్ అభిమానులే కాదు, చూస్తున్న ఓటర్లను సైతం కలచివేస్తోంది. భర్త, పిల్లలు తప్ప ఇన్నాళ్లు రాజకీయాలను కన్నెత్తి చూడని సునీత ,ఇప్పుడు ఏకంగా హో?రాహోరీ పోరులో ఎమ్మెల్యేగా గెలుపు కోసం అధికార పార్టీతోనే పోటీపడుతున్నారు. కన్నీళ్లే ప్రచారాస్త్రంగా మాగంటి సునీత ప్రచారం కొనసాగుతున్న తీరుపై కాంగ్రెస్ నేతలు విమర్శలతో విచరుకుపడుతుంటే, మరోవైపు బీఆర్ ఎస్ నేతలు,సోషల్ మీడియాలో సైతం సునీతకు గట్టిగానే మద్దతు లభిస్తోంది. గతంలో జూబ్లీహిల్స్ లో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాగంటి గోపీనాథ్ చేసిన అభివృద్ధి, నమ్మిన క్యాడర్, నమ్ముకున్న నియోజకవర్గ ఓటర్లతోపాటు భార్య సునీతపై సానుభూతి ఖచ్చితంగా వర్కవుట్ అవుతుందనే కొండంత ఆశతో ఉన్నారు బీఆర్ ఎస్ నేతలు.జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీపడుతన్న నవీన్ కుమార్ యాదవ్ సైతం రాజకీయాల్లో తానేం తక్కువ కాదంటూ మొదటి నుండి జెట్ స్పీడ్ తో దూసుకుపోతున్నారు. తీవ్ర పోటీలో సైతం సీటు దక్కించుకున్న నవీన్ , సీటు ప్రకటన క్షణం నుండి నామినేషన్ వేసే వరకూ పార్టీలో సీనియర్లు, కుల పెద్దలు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన బీసీ నేతలు ఇలా ప్రతీ ఒక్కరినీ స్వయంగా వెళ్లి కలసి ,వారి మద్దతు తీసుకున్నారు.తనకు సీటు కేటాయించుకుండా అడ్డుపడ్డ అంజన్ కుమార్ యాదవ్ , అనిల్ కుమార్ యాదవ్ లను సైతం తానే స్వయంగా వెళ్లి కలసి , వారి మెప్పుపొందరాంటే పరిస్దితి అర్ధం చేసుకోవచ్చు

# సరిహద్దుల చెక్ పోస్టులను మూసివేయాలని ఆదేశాలు జారీ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 23(భారత శక్తి):తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ సాదిక్



తెలంగాణలో ఆర్టిఏ చెక్ పోస్టులు మూసివేతపై హర్షం వ్యక్తం చేశారు.

బోర్డులు, బారికేడ్లు తొలగింపు పట్ల ప్రభుత్వానికి లారీ యజమానుల కృతజ్ఞతలు తెలుపుతూ

లారీ యజమానుల సమస్యలను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కు ధన్యవాదాలు తెలిపారు.

అవినీతి అడ్డాలుగా మరి వాహనదారులను పీల్చి తింటున్న సరిహద్దుల్లోని ఆర్టీఏ చెక్ పోస్టులను ఎత్తి వేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించడాన్ని వాహనదారులు ప్రత్యేకంగా లారీ యజమానులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు .ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి , రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు .ఇటీవల సరిహద్దు చెక్ పోస్టులపై ఏసీబీ అధికారులు దాడిచేసిన నేపథ్యంలో వారి అవినీతిని చూసి అవాక్కు అయ్యారని ఇదే విషయాన్నీ ఉన్నతాధికారులకు తెలియజేశారు . వారు సీఎం దృష్టికి తీసుకోని పోవడంతో వెంటనే చెక్ పోస్టులు మూసి వేసి ఆన్ లైన్ ద్వారా కార్యకలాపాలు నిర్వహించాలని నిర్ణయించారు.ఈ మేరకు బుధవారం ఒకే సమయంలో సరిహద్దుల చెక్ పోస్టులను మూసివేయాలని ఆదేశాలు వెళ్లడం అక్కడ బోర్డులు తీసివేయాలని ,చెక్ పోస్టుల్లో ఉన్న ఫుర్నిచర్ ఆర్టీఓ కార్యాలయాలకు తరలించాలని ఆదేశాలు జారీచేశారు .సిబ్బందిని రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ కమిషనర్ కు రిపోర్ట్ చేయాలనీ ఆదేశాల్లో పేర్కొన్నారు .

రాష్ట్రంలోని అన్ని రవాణా చెక్ పోస్టులను మూసివేస్తూ ఆదేశాలు జారీ చేయడం లారీ యజమానులకు ఎంతో సంతృప్తిని ఊరటను ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల తెలంగాణ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సయ్యద్ సాదిక్ హర్షం ప్రకటించారు. ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ సయ్యద్ సాదిక్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అదేవిధంగా ప్రభుత్వ అధికారులకు పెద్దలకు ఎమ్మెల్యేలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ తరపున ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అదేవిధంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ లను అసోసియేషన్ సభ్యులు కలుసుకొని వినతిపత్రం ఇవ్వడం జరిగిందని, వెంటనే వారు స్పందించి త్వరలోనే చర్యలు చేపడతామని హామీ ఇచ్చి ఇప్పుడు కీలక నిర్ణయం తీసుకోవడం వల్ల సంతోషాన్ని వ్యక్తపరిచారు. అక్టోబర్ 22న సాయంత్రం 5 గంటల లోపు మూసివేయాలని ఆ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేస్తూ ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామం అని సాదిక్ అన్నారు. రెండు నెలల క్రితమే చెక్ పోస్టులను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నా కొనసాగించడంపై ఆర్టీఏపై సీఎం రేవంత్ సీరియస్ అయ్యారనీ రవాణా శాఖపై ప్రభుత్వానికి ఎంతో చిత్తశుద్ధి ఉందని ఈ సందర్భంగా కొనియాడారు.

ప్రభుత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలోని అన్ని ట్రాన్స్పోర్ట్ చెక్ పోస్టులు మూసివేయాలని రవాణా శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారనీ, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్లు, జిల్లా ట్రాన్స్పోర్ట్ అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారనీ చెక్ పోస్టుల దగ్గర ఉన్న బోర్డులు, బారికేడ్లు, సిగ్నేజ్ తొలగించాలని ఆదేశించారనీ సిబ్బందిని ఇతర శాఖలకు తిరిగి నియమించాలని.. చెక్ పోస్టుల దగ్గర ఎవరూ ఉండొద్దన్నారనీ దీనివల్ల రవాణా శాఖకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు.

చెక్ పోస్టుల దగ్గర వాహనాల రాకపోకలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని వెల్లడించారనీ రికార్డులు, ఫర్నీచర్, పరికరాలు వెంటనే జిల్లా ట్రాన్స్పోర్ట్ కార్యాలయానికి తరలించాలని తెలిపారు. ఆర్థిక, పరిపాలనా రికార్డులను సమన్వయం చేసి భద్రపరచాలని ప్రభుత్వం ఆదేశించిందని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా తగిన ప్రకటనలు ఇవ్వాలని చెప్పారు. చెక్ పోస్టుల మూసివేతపై సమగ్ర నివేదిక అక్టోబర్ 22 సాయంత్రం 5 గంటలలోపు సమర్పించాలని రవాణాశాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారని వెంటనే చర్యలు తీసుకుంటున్నందుకు ప్రభుత్వానికి లారీ ఓనర్స్ అసోసియేషన్ తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు అని సయ్యద్ సాదిక్ పేర్కొన్నారు.

# 8 ఏళ్ల పాటు ఒంటరి పోరాటం చేసిన శివరంజని

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి)(

పట్టువదలని విక్రమార్కుడి కథలు మనం చిన్నప్పుడు చదువుకిని ఉంటాం.. కానీ హైదరాబాద్‌కు చెందిన పిల్లల వైద్యురాలు శివరంజని సంతోష్ చేసిన పోరాటం.. దేశ ఆరోగ్య విభాగాన్ని కదిలించింది. సమాజపు ఆరోగ్య పరిరక్షణ కోసం, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యం కోసం గళం వినిపించిన ఆమె ప్రయత్నాలు ఫలాన్నిచ్చాయి. ఆమె సాధించిన విజయం ఇప్పుడు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల ప్రాధికార సంస్థ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ఫుడ్ సేఫ్టీ కమిషనర్లు మరియు లైసెన్స్ అధికారి?లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది: "ఇకపై ఎలాంటి ఫుడ్ ప్రొడక్ట్స్‌పై అనే పదాన్ని వాడకూడదని నిర్దేశించింది. ఇందుకోసం హైదరాబాద్‌కు చెందిన శివరంజని 8ఏళ్లపాటు పోరాటం చేశారు. ఆమె పోరాటం ఫలించి ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ ఫిల్మ్ నగర్ ప్రాంతంలో చిన్నపిల్లల క్లినిక్ నిర్వహిస్తున్న డాక్టర్ శివరంజని. లేబుల్‌తో టెట్రా ప్యాక్‌లలో విక్రయిస్తున్న ఎనర్జీ డ్రింకులు ఆరోగ్యానికి హానికరం అని గుర్తించారు. వాటి విక్రయాలు ఆపేయాలని... పేరు తీసేయాలని ఆమె డిమాండ్ చేస్తూ..వచ్చారు. దీనిపై 8ఏళ్ల పాటు సుదీర్ఘంగా పోరాటం చేశారు. ఎట్టకేలకు అక్టోబర్ 14న అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆర్డర్ వచ్చిన వెంటనే డాక్టర్ శివరంజనీ భావోద్వేగానికి గురయ్యారు. 8 ఏళ్లపాటు తాము ఎంత పోరాటం చేసిందీ తలుచుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. "ఇది నాకు చాలా పెద్ద రిలీఫ్‌గా ఉంది. ఇన్నేళ్ళుగా ప్రైవేటు కంపెనీలు పేరుతో ప్రజలను మోసం చేస్తున్నాయి. అసలు అనేది ప్రాణాలు కాపాడే ఔషధం. దీన్ని తప్పుడు లేబులింగ్, వక్రీకృత మార్కెటింగ్ ద్వారా సంప్రదించి, అసలు దీన్ని తీసుకుంటే ? ముఖ్యంగా పిల్లలకు, పెద్దలకు డయేరియా మరింత ముదిరేలా చేస్తుంది. ఈ అవినీతి మీద పోరాటం ఇప్పుడు ఫలితాన్నిచ్చింద"న్నారు.

# దీపావళి జీవితంలో వెలుగుకు



చీకటి వెలుగుల రంగేళీ
జీవితమే ఒక దీపావళి
దీపావళి మన భావి
జీవితంలో తేవాలి
ఆనంద కేళీ

అష్ట ఐశ్వర్యాలు చేకూరి
ఆరోగ్య సంతోష
సంతృప్తుల సందడిలో
స్వదేశీ స్వాభిమానం
సంకల్ప భారత్
అవతరించాలి
అభివృద్ధిలో నూతన
వెలుగులు విరజిమ్మాలి

శాంతి సహనం సమన్వయం
సంఘీభావంతో విప్లవ
క్రాంతి కావాలి దీపావళి

వెలుగు జిలుగులలో ఆర్థిక
అసమానతలు తొలగాలి
మహిళా యువజన
సామాన్యుని సాధికారిత
అభివృద్ధి సంక్షేమం
పరుగులు తీయాలి

కుల మత ప్రాంత లింగ వివక్ష
లైంగిక వేదింపులు
మానవ అక్రమ రవాణా డ్రగ్స్
రహిత సమాజ నిర్మాణానికి
దీపావళి దారి దీపం కావాలి

మమత సమత సౌహార్దత
సామాజిక ఆర్థిక రాజకీయ
సాంస్కృతిక వికాసానికి
దీపావళి తొలి పొద్దు కావాలి

పగలు సెగలు ప్రతీకారాలు
మాని హింసా ప్రవృత్తి ని
పాతరేసి ప్రగతికి పురోగతికి
పాటుపడుథాం
ఆశావహ దృక్పథంతో
ఆత్మవిశ్వాసంతో ముందుకు
సాగుదాం

బంధాలు అనుబంధాల
ఆలంభణతో
ఆత్మీయత ఆప్యాయత
అభిమానానికి
ఆర్ధత అవగాహన సహకార
స్ఫూర్తితో సామాజిక ఆర్థిక
రాజకీయ ఉద్రిక్తతలను
అడ్డుకుందాం

భారతీయ కుటుంబ వ్యవస్థ
పునరుద్ధరణకు దీపావళి
దిశ దశ కావాలి

సుస్థిర రాజకీయ
సుపరిపాలనతో
విశ్వస్థాయిలో భారత్
కీర్తి ప్రతిష్టలు
ఇనుమడించాలి

నేదునూరి కనకయ్య
అధ్యక్షులు తెలంగాణ ఎకానమిక్ ఫోరం
ఫ్రీలాన్స్ రైటర్ సామాజిక ఆర్థిక అధ్యయన
వేదిక రాష్ట్ర అధ్యక్షులు
కరీంనగర్9440245771

# రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ విజిట్




కడప, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 23: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా, గౌరవ డాక్టర్ సి.యామిని, అధ్యక్షులు మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు గౌరవ సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప శ్రీ ఎస్.బాబా ఫక్రుద్దీన్ వారు రాయచోటి సబ్ జైలు లీగల్ ఎయిడ్ క్లినిక్ ను విజిట్ చేయడం జరిగినది. రిజిస్టర్లను పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను తెలియజేశారు, జైలు లోపల ఖైదీల హక్కులు, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము, ఖైదీలతో మాట్లాడి వారి కేసు వివరాలను, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు, ఉచిత న్యాయ సహాయమును సద్వినియోగం చేసుకోవాలి అన్నారు, అనంతరం జైలు పరిసరాలను, రిజిస్టర్ లను పరిశీలించి తగు సూచనలను సలహాలను ఇవ్వడం జరిగినది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100 పై ప్రచారం నిర్వహించడం జరిగినది. ఏవైనా సమస్యలుంటే రాయచోటి మండల న్యాయ సేవా సమితిని మరియు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడపను సంప్రదించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమములో రాయచోటి సబ్ జైలు సూపర్డెంట్, ప్యానల్ న్యాయవాది మరియు ఖైదీలు పాల్గొన్నారు.

# బిజెపి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



ములుగు జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 23 (భారత శక్తి): మేడ్చల్ జిల్లా ఘట్కేసర్‌లో గోరక్షకుడు సోను సింగ్ (ప్రశాంత్) ను అతి దారుణంగా తుపాకీతో ఎంఐఎం గూండాలు కాల్పులకు పాల్పడిన ఘటనలో ప్రశాంత్ సింగ్ తీవ్రంగా గాయపడగా, ప్రస్తుతం యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సంఘటనపై భారతీయ జనతా పార్టీ ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి నగరపు రమేశ్ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి, అనంతరం కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చింతలపూడి భాస్కర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. గోరక్షకుడిపై కాల్పులు జరిపిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, గోరక్షకుడికి ఉన్నత వైద్య సదుపాయాలు కల్పించాలని, రాష్ట్రంలో గోరక్షణ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని బీజేపీ డిమాండ్ చేయడం జరిగింది,గోమాతను రక్షించే గోరక్షకులపై కాల్పులు జరగడం సనాతన ధర్మానికి అవమానం, ప్రజాస్వామ్యానికి అవహేళన.

రాష్ట్ర ప్రభుత్వం గోరక్షణ చట్టాన్ని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది.

గోరక్షకులను రక్షించాల్సిన బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది.

నిందితులను వెంటనే అరెస్టు చేసి, ఇలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

“బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ ఎన్. రామచందర్ రావు ప్రజాస్వామ్య పద్ధతిలో రాష్ట్ర సచివాలయం ఎదుట నిరసన వ్యక్తం చేయడానికి వెళ్తుండగా, పోలీసులచే అక్రమంగా అరెస్టు చేయడం పూర్తిగా ప్రజాస్వామ్య విరుద్ధ చర్య. దీనిని బీజేపీ తీవ్రంగాఖండిస్తుందనిఅన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఒక వర్గానికి తొత్తులుగా మారి, తెలంగాణలో గన్ కల్చర్‌కు ప్రోత్సాహం ఇస్తోందని శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం, ఇలాంటి ఘటనలకు పాల్పడే వారిని కాపాడుతోంది. ఇది ప్రజాస్వామ్యానికి ముప్పు,” అన్నారు.ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయం సాధించే వరకు బీజేపీ ఆందోళన కొనసాగుతుందని ములుగు జిల్లా బీజేపీ ప్రకటించింది. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ భూక్యా జవహర్ లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీలమంతుల రవింద్రాచారి, జిల్లా ఉపాధ్యక్షులు, భర్తాపురం నరేష్, అల్లే శోభన్, రవి రెడ్డి మండల అధ్యక్షులు రాయంచు నాగరాజు, ఇమ్మడి రాకేశ్ యాదవ్ యాద సంపత్ , సతీష్ వావిలాల జనార్ధన్, రెడ్డి శ్రీనివాస్, కాసర్ల సురేశ్, శ్రీహరి, శ్రీనివాస్, కళ్యాణ్, లాకావత్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఘన్పూర్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయంను సందర్శించిన సిపి సన్‌ప్రీత్ సింగ్

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)అక్టోబర్23:



వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ బుధవారం వెస్ట్‌జోన్ పరిధిలోని ఘనపూర్ పోలీస్ స్టేషన్ పాటు ఎసిపి కార్యాలయమును సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిసారిగా వెస్ట్‌జోన్ పరిధిలోని పోలీస్ స్టేషన్లను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్స్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్నిసెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలుసూచనలు చేస్తూ ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ ఇండ్లను సందర్శించి వారి స్థితిగతులపై ప్రత్యక్షంగా ఆరా తీయాలని, ఆర్థిక సైబర్ నేరాలకు సంబంధించి కేవలం కేసు నమోదు చేయడమే తమ బాధ్యతనే కాకుండా సైబర్ నేరాలకు సంబంధించి నేరానికి పాల్పడిన నేరస్థుల మూలాల కూడా దర్యాప్తు అధికారులు కనిపెట్టి నిందితులను అరెస్టు చేయాలని. గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలకు సంబంధించి క్రయ విక్రయాలపై స్టేషన్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి మత్తు పదార్థాల నియంత్రణకై నిరంతరం పనిచేయాలని. నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు.

పోలీస్ కమిషనర్ వెంట వెస్ట్ జోన్ డిసిపి రాజ మహేంద్ర నాయక్, ఏసీపీ భీం శర్మ, ఘన్పూర్ ఇన్స్ స్పెక్టర్ వేణు తో ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


# నిరుద్యోగ యువత జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవర్



సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 23:జాబ్ మేళాకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు జరుగుతున్నాయని యువత భారీ సంఖ్యలో పాల్గొని ఈ సువర్ణవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. ఈ నెల 25 (శనివారం ) హుజూర్నగర్ పట్టణం లోని పెర్ల్ ఇన్ఫినిటీ ఇంటర్ నేషనల్ స్కూల్ లో నిర్వహించే జాబ్ మేళా ఏర్పాట్లను గురువారం జిల్లా ఎస్పి కే .నరసింహ తో కలిసి ఆయన పర్యవేక్షించారు. కంపెనీల వారీగా స్టాల్స్ కేటాయింపుల వివరాలను అందజేయాలనీ సింగరేణి ప్రతినిధి చందర్ ను కలెక్టర్ ఆదేశించారు. రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద అభ్యర్థులు ఎక్కువగా నిలబడకుండా రంగాల వారీగా ఎక్కువ కౌంటర్లు ఏర్పాటు చేయాలని, డిగ్రీ కళాశాల, మార్కెట్ యార్డ్ , స్వర్ణ వేదిక పంక్షన్ హాల్ ప్రక్కన ఉన్న వెంచర్ లను పరిశీలించి పార్కింగ్ ఏర్పాటు చేసి కుర్చీలు ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్ కౌంటర్ల వద్ద, భోజనాల వద్ద ఎవరికీ అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చూసుకోవాలని కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణకు సూచించారు. జాబ్ మేళా ప్రాంగణానికి అప్రోచ్ రోడ్లను వేయాలని, మొబైల్ టాయిలెట్స్, అభ్యర్థుల సౌకర్యార్థం జిరాక్స్ సెంటర్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ని, వర్షం కురిసిన వాటర్ ప్రూఫ్ టెంట్ లను జాబ్ మేళా ప్రాంగణం,స్వర్ణ వేదిక పంక్షన్ హాల్ ప్రాంగణం, పార్కింగ్ ప్రదేశాలలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి , ఆర్డీఓలు శ్రీనివాసులు, సూర్యనారాయణ,డి ఎస్ పి ప్రసన్న కుమార్,సింగరేణి ప్రతినిధి చందర్,జిల్లా ఉపాధి కల్పనాధికారి శంకర్, జి ఎం ఇండస్ట్రీస్ సీతారాం నాయక్, ఎస్ సి కార్పొరేషన్ ఈడి శ్రీనివాస్ నాయక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి,సరోత్తం రెడ్డి, కొప్పల వేణారెడ్డి, చింతల లక్ష్మి నారాయణ రెడ్డి దొంగరి వెంకటేశ్వర్లు,గెల్లి రవి,తన్నీరు మల్లిఖార్జున్, పోతు భాస్కర్,కలెక్టర్ వెంట ఉన్నారు.

# ప్రజలు కోరుకుంటే తప్పకుండా రాజకీయ పార్టీ పెడతా

- పార్టీ పెడితే నాకు కాదు ప్రజలకు మేలు జరగాలి
- ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికే 'జనం బాట' కార్యక్రమం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి), అక్టోబర్ 23: తెలంగాణ ప్రజానీకం కోరుకుంటే తప్పకుండా తాను రాజకీయ పార్టీని ప్రారంభిస్తానని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. గురువారం ఆమె జాగృతి నాయకులతో కలిసి యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించే 'జనం బాట' కార్యక్రమానికి లక్ష్మీ నరసింహస్వామి ఆశీస్సుల కోసమే వచ్చినట్లు వెల్లడించారు. మొన్న తిరుపతి, ఇప్పుడు యాదాద్రి దేవాలయాలను దర్శించుకున్నాం. ఈ నెల 25 నుంచి చేపట్టనున్న 'జనం బాట' కార్యక్రమానికి ఎలాంటి అవాంతరాలు రాకుండా చూడాలని స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు. జనంబాట ద్వారా ప్రజా సమస్యలను అర్థం చేసుకునే శక్తి ఇవ్వాలనే దైవ దర్శనం చేసుకుంటున్నామని, ఈ నెల 25 నుంచి సొంత గ్రామం నిజామాబాద్ నుండి 'జనం బాట' కార్యక్రమం మొదలవుతుందని పేర్కొన్నారు. 33 జిల్లాల్లో 4 నెలలు పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ప్రతీ జిల్లాలో 2 రోజుల పాటు ఉండి అక్కడి సమస్యలు తెలుసుకుంటామన్నారు. జిల్లాల పర్యటనలో మేధావులు, విద్యావంతులు, రైతులు, యువత, మహిళలు ఇలా అన్ని వర్గాలను కలుస్తూ వారు చెప్పే సమస్యలను అర్థం చేసుకొని వాటిని ఏ విధంగా పరిష్కారం చేయాలన్న దానిపై దృష్టి పెడతామని తెలిపారు. ప్రజలతో కూలంకషంగా మాట్లాడేందుకు జాగృతికి ఈ కార్యక్రమం వేదికగా మారనుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కేసీఆర్ యాదాద్రిని చక్కగా పునర్నిర్మించారు. యాదాద్రి ప్రాశస్త్యాన్ని కాపాడే విధంగా ఇప్పుడున్న ప్రభుత్వం, అధికారులు కృషి చేయాలి. దర్శనానికి వస్తుంటే దారిలో విచిత్రమైన హోర్డింగ్ లను ఉన్నాయని, అలా కాకుండా తిరుమలలో మాదిరిగా స్వామి వారి హోర్డింగ్ లు చిత్రపటాలను ఏర్పాటు చేసి భక్తులకు ఆహ్లాదంగా ఉండేలా చూడాలని సూచించారు. జనంబాట పర్యటనలో భాగంగా మళ్లీ యాదాద్రికి వస్తాం అప్పుడు ఇక్కడున్న అన్ని సమస్యలపై వివరంగా మాట్లాడతానని అన్నారు. తెలంగాణ జాగృతి అనేది ఒక ఎన్జీవో గా పుట్టి 19 ఏళ్లుగా కొనసాగుతోందని, ప్రజా సమస్యలతో పాటు రాజకీయ అంశాలను కూడా గతంలో మేము మాట్లాడాము, తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా రాజకీయాలు, రాజకీయ సమీకరణాలు మాట్లాడటం జరిగింది. సివిల్ సోసైటీ సంస్థ అయినప్పటికీ అవసరమైతే రాజకీయాలు పుష్కలంగా మాట్లాడతామని పునరుద్ఘాటించారు. రాజకీయాలు మాట్లాడాలంటే రాజకీయ పార్టీగానే ఉండాల్సిన అవసరం లేదని, పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటే తప్పకుండా వస్తాం అందులో ఇబ్బందేమీ లేదని తెలిపారు. ఏపీలో మూడు, తమిళనాడులో రెండు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. కేరళలో గల్లీకి ఒక పార్టీ ఉంది. పార్టీలు ఉండటం పెద్ద విషయం కాదు వాటి వల్ల ప్రజలకు మేలు జరగాలి. నేను పార్టీ పెడితే నాకు లాభం కాదు ప్రజలకు మేలు జరిగేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. ప్రజలు ఏం కోరుకుంటున్నారో తెలుసుకునేందుకు 'జనం బాట' ద్వారా వారిని కలిసేందుకు వెళ్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షులు సుజిత్ రావు, తెలంగాణ జాగృతి ఆర్గనైజింగ్ సెక్రటరీ దుగుంట్ల నరేష్, జాగృతి రాష్ట్ర కమిటీ సభ్యులు కోల శ్రీనివాస్, రాచమల్ల బాలకృష్ణ, మారయ్య, రామ్ కోటి ప్రజాపతి, గోపు సదానంద, యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ బోల్ల శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలి - జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య

- అక్రమ రవాణా, నిల్వలపై నమోదు చేసిన 6-ఏ కేసుల పురోగతి పై కలెక్టర్ సమీక్ష

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 23:




విజిలెన్స్ బలోపేతం, ఆధారాలు సేకరణపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలపై పౌరసరఫరాల శాఖ నమోదు చేసిన 6-ఏ కేసుల పురోగతి పై పౌరసరఫరాల శాఖ,వాణిజ్య పన్నుల శాఖ, పోలీస్ శాఖ అధికారుల తో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), జిల్లా పౌరసరఫరాల అధికారి (డీసీఎస్ఓ), డీఎం సివిల్ సప్లై, పోలీసు అధికారులు, ఏసీటీఓ, సాంకేతిక సహాయకులు, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూకేసుల పరిశీలనలో వేగం తీసుకురావాలని, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్న వారిపై పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పలు సూచనలు చేసారు. బియ్యం అక్రమ రవాణా వాహనాలను పట్టుకున్నప్పుడు పోలీసు, రెవెన్యూ అధికారులు తప్పనిసరిగా వీడియో, ఫోటో ఆధారాలను సేకరించి, 6-ఏ నివేదికకు జతపరిచి సమర్పించాలన్నారు .సాంకేతిక సహాయకులు నమూనాలను వాహనం నంబరు, స్వాధీనం తేదీతో ప్రత్యేక బ్యాగులో భద్రపరచాలి. విశ్లేషణ ప్రక్రియను ఫోటో ,వీడియో కవరేజ్ చేయాలన్నారు, వాటిని నివేదికతో సమర్పించాలి. బియ్యం రవాణాకు సంబంధించిన బిల్లులను ఏసీటీఓ అధికారులు ఒక రోజులో గా పరిశీలించి, వాహన రాకపోకల మూలాన్ని నిర్ధారించాలని పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న అక్రమ రవాణా బియ్యంను ప్రతి 15 రోజులకు ఒకసారి పత్రికలలో ప్రకటన ఇచ్చి, బహిరంగ వేలం ద్వారా విక్రయించాలని సూచించారు. కోర్టులలో ప్రభుత్వ ప్రయోజనాలను రక్షించేందుకు, డీసీఎస్ఓ ప్రభుత్వ న్యాయవాదులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల తో సమావేశమై సమన్వయంతో ముందుకు సాగాలి. ప్రభుత్వ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉత్తర్వులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా మరియు నిల్వలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్( రెవిన్యూ ) మాధురి , డి ఎం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్, కమర్షియల్ టాక్స్ అధికారులు పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అలవిగాని హామీలతో రైతులను ముంచిన కాంగ్రెస్

- పాలన గాలికొదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు కొట్టుకుంటున్నారు
- వరంగల్ డిక్లరేషన్ లోని హామీలను అమలు చేయాలి
- బిజెపి కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి డిమాండ్



భారత శక్తి (యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి) అక్టోబర్ 23: అలవిగాని హామీలతో రాష్ట్రంలోని రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని బిజెపి కిసాన్ మోర్చా యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు ఫకీర్ రాజేందర్ రెడ్డి విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు బిజెపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తహసిల్దార్ కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు ఫకీర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రైతులను హామీల పేరుతో వంచించి పాలన గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు కొట్టుకుంటూ రోజుకో విధంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. పాడి రైతులకు సుమారు ఆరు నెలల నుండి బిల్లులు ఇవ్వకుండా పాల రేటు తగ్గించి రైతుల రక్తాన్ని తాగుతున్నారని, ఒకవైపు పశువుల దాణా రేట్లు పెరుగుతూ ఇటు పాల దిగుబడి రాక పాడి రైతులు హరిగోస పడుతున్నారని అన్నారు. అధికారంలోకి వచ్చే ముందు వరంగల్ డిక్లరేషన్ లో ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకపోగా స్థానిక ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సొంత గ్రామంలో రెండు లక్షల రుణ మాఫీ అందరికీ కాలేదన్నారు. ఒకవేళ సైదాపురం గ్రామంలో అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అయితే ఇదే తహసిల్దార్ కార్యాలయం ముందు నేను క్షమాపణ కోరతానని సవాల్ విసిరారు. రైతులకు ఇస్తానన్న బోనస్ ఎటు పాయే, కౌలు రైతులకు ఇస్తా అన్న 15000 ఎటు పాయే, రైతులకు ఇస్తానన్న భరోసా ఏది అని ప్రశ్నించారు. ఏ విధంగా చూసినా కూడా రైతులను వంచించే విధంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుందని అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని, ప్రతి గ్రామంలో సిసి కాంక్రీట్ కల్లాలను ఏర్పాటు చేస్తూ ఎక్కడ కూడా వడ్ల కొనుగోలు విషయంలో ఆలస్యం కాకుండా రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రచ్చ శ్రీనివాస్, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గసభ్యులు గుంటుపల్లి సత్యం, పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్, జెల్ల భానుచందర్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు గంధమల్ల మహేష్, మండల ఉపాధ్యక్షుడు ఏలూరు సత్యనారాయణ, సీనియర్ నాయకులు భువనగిరి శ్యాంసుందర్, లెంకలపల్లి శ్రీనివాస్, బొమ్మగాని రాజమణి, జిల్లా కార్యవర్గ సభ్యులు దొంత భరత్, సారాజీ లక్ష్మయ్య, మిట్ట వీరేష్, ఆవుల సత్యనారాయణ, దొమ్మాట ప్రభాకర్, సుడుగు రాజిరెడ్డి, వాల్మీకి అజయ్, జి వినోద్, దొమ్మాట నరేష్, కర్రె లక్ష్మయ్య, కళ్లెం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కామారెడ్డి జిల్లాలో సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు ఇంజనీరింగ్ కాలేజ్ సందర్శించి పరిశీలించిన జిల్లా కలెక్టర్




కామారెడ్డి, జిల్లా భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 23: గురువారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆర్ట్స్, సైన్స్ కాలేజ్ ఆధ్వర్యంలో గల ఓల్డ్ ఇంజనీరింగ్ కాలేజ్ లో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయడానికి నిర్ణయించినందున ఇంజనీరింగ్ కాలేజ్ సందర్శించి

ఏర్పాట్లను పర్యవేక్షించి, అన్ని వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని, త్రాగునీరు, టాయిలెట్స్, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చిమొక్కలు పూర్తిగా తొలగించాలని, అవసరమైన చోట ఫ్లోరింగ్ చేయించాలని, గదులు శుభ్రతతో పాటు, మరమ్మత్తులు చేయించి అన్ని మౌళిక వసతులు ఏర్పాటు చేసి సైన్స్ మ్యూజియం విజయవంతం చేయాలని సంబంధిత అధికారులు మున్సిపల్, పంచాయితి , ప్రిన్సిపల్ ను ఆదేశించారు.

జిల్లాలో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయడం వల్ల విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన%శీ% పెంపొందించడం తోపాటు శాస్త్రీయ వైఖరులు అభివృద్ధి చెందుతాయని విద్యార్థులు, యువత ప్రజలకు విజ్ఞానశాస్త్రం పట్ల ఆసక్తి పెంపొందించడం, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడం, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యమనికలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాజు , జిల్లా సైన్స్ అధికారి సిద్ధిరాం రెడ్డి , డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ప్రభాకర్ , పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మున్సిపల్ అధికారులు, స్థానిక మండల రెవెన్యూ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

# హరిహరులకు ప్రీతికర మాసం కార్తికం

సనాతన హైందవ ధర్మం లో హిందువులకు ఈ కార్తిక మాసంలో ప్రతిరోజూ పరమ పవిత్రమైనదే. ప్రతిరోజూ పండుగే. శివకేశవుల పూజలకు ఈ కార్తికం ఎంతో ప్రత్యేకమైనది.హరిహరసుత అయ్యప్ప స్వామి దీక్షలకు కడు పవిత్రమైనది. ఈమాసము స్నానములకు, దీప దానములకు,వివిధ వ్రతములకు శుభప్రదమైనది. ఈ మాసంలోనే ఉభయపక్షములందు అనేక వ్రతములు ఉన్నాయి. శరణు ఘోషలతో అయ్యప్ప దీక్షలు కూడా ఈ నెలలో ప్రారంభమై మకర సంక్రాంతి (మకర జ్యోతి దర్శనం) వరకు కొనసాగుతుంది. సామాజిక సమరసతకు ఈ మాసం అద్దం పడుతుంది.

కార్తికసమో మాసో
కృతేన సమం యుగమ్
వేదసదృశం శాస్త్రం
తీర్థం గంగయా సమమ్

(కార్తికమాసానికి సమానమైన మాసమేదీ లేదు. సత్యయుగంతో సమానమైన యుగమేదీ లేదు. వేదములతో సమానమైన శాస్త్రమేదీ లేదు. గంగానది వంటి ఇతర నదేదీ లేదు.) అని స్కంద పురాణంలో చెప్పబడింది.

ధార్మిక యోచనలు కలిగిన ప్రజలు ఏకభుక్తము, లేక నిరాహారాది వ్రతాలు చేస్తారు. రాత్రులలో దేవాలయాలందు లేదా తులసి దగ్గర దీపాలు వెలిగిస్తారు. స్వయంగా దీపదానాలు చేయనివారు ఆరిన దీపాలను వెలిగించుట వలన, గాలిమొదలైన వాటి వల్ల దీపాలు ఆరిపో కుండా చేసి, దీపదాన ఫలితాన్ని పొందవచ్చును. కార్తీక మాసంలో ఉభయ పక్షాలందు ఎన్నో వ్రతాలున్నాయి.

హరిహరులకు ప్రీతికరం

చంద్రుడు పూర్ణుడై ఏ నక్షత్రంలో ఉంటాడో, ఆ నక్షత్రం పేరు ఆ మాసానికి వస్తుంది. కృత్తికా నక్షత్రంలో చంద్రుడు పూర్ణుడై సంచరించుట వలన ఈ మాసానికి కార్తిక మాసమని పేరు. కార్తిక మాసమునకు సమానమైన మాసము, విష్ణుదేవుని కంటే సమానమైన దేవుడు, వేదములకు సమాన మైన శాస్త్రములు, గంగకంటే పుణ్యప్రథములైన తీర్థములు లేవన్నది పురాణ వచనం. కార్తిక మాసము అత్యంతపవిత్రమైనది. మహిమాన్వితమైనది. శివకేశవులకు ప్రీతికరమైన మాసం. ఈ మాసంలో దేశం నలుమూ లలా ఉన్న ఆలయాలలో రుద్రాభి షేకాలు, లక్ష బిల్వార్చనలు, రుద్ర పూజలు విశేషంగా జరుపుతారు. విశేషార్చనలు జరిపే భక్తులకు సదాశివుడు ప్రసన్నుడై వారి అభీష్టాలను తీరుస్తాడని భక్తులు విశ్వసిస్తారు. అందుకే ఆ స్వామికి 'అశుతోషుడు' అన్న పేరు వచ్చింది. 'అభిషేక ప్రియః శివః' శివునికి అలంకారాలతో రాజోపచారములతో, నైవేద్యములతో పనిలేదు. మనస్సులో భక్తినుంచుకుని శివుడ్ని ధ్యానిస్తూ చేసే అభిషేకంతో శివుడు ప్రీతి చెందుతాడు. శివాభిషేకం అన్ని దోషాలను పోగొట్టి సకల శుభాలను కలగజేస్తుంది. ఈ మాసంలో శివార్చన చేసినవారికి గ్రహదోషాలు, ఈతిబాధలు ఉండవు. శివుడిని శ్రీవృక్ష పత్రములతో (బిల్వదళవలు) పూజించిన స్వర్గమున లక్ష సంవత్సరములు జీవించును. ప్రదోషకాలంలో పరమేశ్వరుడు, ఏకకాలంలో రెండురూపాలని ప్రదర్శిస్తూ ఎడమభాగాన పార్వతి, కుడి భాగాన పరమేశ్వర రూపంగా అర్ధ నారీశ్వరునిగా దర్శనమిచ్చే సమయం ఈ ప్రదోషకాలంగా చెప్పబడింది. ప్రదోషకాలంలో శివారాధన,శివదర్శనంచేసుకుంటే శివుని అనుగ్రహానికి పాత్రులగుదురు. శివాలయములో ప్రార్థన, లింగార్చన, బిల్వార్చన వంటి పుణ్య కార్యములు ఆచరించుట ఈ



మాసంలో విశేష ఫలాన్ని ప్రసాదిస్తాయి. అష్టోత్తర లింగార్చన, మహా లింగార్చన, సహస్ర లింగార్చన ఉత్తమోత్తమ మైన అర్చన. ఈ మాసంలో ఈ అర్చనలు చేస్తే సంవత్సర మొత్తం చేసిన ఫలాన్నిస్తాయి. తులసి దళాలతో శ్రీ మహావిష్ణుని కార్తికమాసంలో పూజిస్తే ముక్తిదాయకం అని శాస్త్ర వచనం. ఈ మాసంలో విష్ణువు దామోదర నామంతో పిలవబడతాడు. 'కార్తిక దామోదర ప్రీత్యర్థం' అని ఈ మాసాన వ్రత దీక్ష ఆచరించాలి. తులసి చెంత హరిపూజ పుణ్యప్రదం. సత్యనారాయణ వ్రతం, విష్ణు సహస్రనామ పారాయణ, రుద్రాభిషేకాలు చేయడం శ్రేష్టం. శివానుగ్రహానికి, విష్ణువు అనుగ్రహానికి ఈ మాసం ఉత్కృష్టమైంది. కార్తిక మాసంలో ఏమంత్ర దీక్ష తీసుకున్నా మంచి ఫలితాలను ఇస్తుందని శాస్త్ర వచనం. 'కార్తిక పురాణం' రోజుకో అధ్యాయం పారాయణ చేయడం శుభకరం. ఈ మాసం మొదటి నుండి సూర్యోదయానికి పూర్వమే నదీస్నానం అత్యంత ఫలప్రదం. కార్తిక నదీ స్నాన విషయంలో ఆరోగ్య సూత్రం కూడా ఇమిడి ఉంది. నదీ జలాలు కొండలలోను, కోనలలోను, చెట్టు పుట్టలను తాకుతూ ప్రవహిస్తాయి. అలా ప్రవహించడం ద్వారా ఎన్నో వనమూలికల రసం నదీ జలాల్లో కలుస్తుంది. ఈ మాసంలో గృహిణులు, యువతులు వేకువనే స్నానం చేసి తులసి కోట ముందు దీపారాధన చేసి గౌరీదేవిని పూజిస్తే ఈశ్వరానుగ్రహంతో సౌభాగ్యాన్ని, సకల శుభాలను పొందుతారు. మాసమంతా స్నాన విధిని పాటించలేని వారు పుణ్య తిథులలోనైనా స్నానం ఆచరించాలి. కార్తీక మాసం మొదలునుండే 'ఆకాశదీపం' ప్రారంభమవుతుంది. ఉభయ సంధ్యలలో గృహమందు, పూజామందిరంలోను, తులసి సన్నిధిలోను, ఆలయమలలో దీపారాధన, ఇహ, పర సౌఖ్యాలను కలగచేస్తుంది. ఈ మాసం దీపారాధనకు ప్రశస్తం. దీపదానమందు ఆవునెయ్యి ఉత్తమం. మంచి నూనె మధ్యమము. ఏకాదశి అత్యంత విశేషమైనది. 'ఉత్థాన ఏకాదశి' కార్తిక శుద్ధ ద్వాదశి కార్తిక పౌర్ణమి లాంటి దినాలు ప్రశస్తమైనవి.

కార్తిక మాసం నామ ఔచిత్యం

సనాతన హిందూ సంప్రదాయం లో కాలం అనంతమైనది. కాలం ఎంతో బలమైనది. కాలం సమస్తమైనది. అందుకే భగవద్గీతలో గీతాచార్యుడు లి'కాలాత్ కలయికాం అహం'లి అంటాడు. (నేను భావ స్వరూపంలో ఉండి కాలం లెక్కలు కట్టుకుంటూ ఉంటాను.) అనాది ప్రతి తెలుగు మాసం పున్నమి నుండి అమావాస్య వరకు గల కాలాన్ని 'సర్వసంధి కాలం' అంటారు. అమావాస్య నుండి పౌర్ణమి వరకు గల 16 రోజులలో ఒక్కొక్క రోజు చంద్రుడికి ఒక్కొక్క కళ హెచ్చుతూ ఉంటుంది. 16 కళలతో ఒప్పి పూర్ణిమనాడు చంద్రుడు సంపూర్ణ కాంతివంతుడు అవుతాడు. అలా చంద్రుడు 16 కళలతో సంపూర్ణమైన వెలుగులతో ప్రకాశించే దినాలు ఏడాదికి 12 వస్తాయి అంటే ఏడాదికి 12 పూర్ణిమలు వస్తాయన్నమాట.



ఏడాదిలో వచ్చే 12 పున్నమలలోనూ ఒక్కొక్క నక్షత్రంతో కూడి ఉంటాడు చంద్రుడు ఆ రోజు చంద్రుడు ఏ నక్షత్రంతో కూడి ఉంటాడో ఆనాటి నక్షత్రాన్ని బట్టి ఆ పౌర్ణమికి ఆ పేరు కలుగుతుంది. అట్లే ఆ మాసం కూడా ఏర్పడుతుంది. ఆ నక్షత్రం పేరుతోనే ఆ మాసాన్ని వ్యవహరిస్తారు. కార్తిక మాసంలో పౌర్ణమి రోజు చంద్రుడు కృత్తికా నక్షత్రంతో కూడి ఉండటం వలన ఆ పౌర్ణమిని లి'కార్తిక పౌర్ణమి'లి అని, ఆ మాసానికి లి'కార్తికమాసం'లి అని పేరు వచ్చింది. తెలుగు నెలల ప్రకారం సంవత్సరంలో 8వ మాసం కార్తిక మాసం. ఈ కార్తిక మాసానికి 'కౌముది మాసం' అని కూడా పేరు. కార్తిక మాసానికి అధి దేవత దామోదరుడు.

త్రిపుర పౌర్ణమి కౌముది మాసం

తెలుగు మాసముల ప్రకారం సంవత్సరంలో 8వ మాసం కార్తీక మాసం కార్తీక మాసానికి కౌముది మాసం అని కూడా పేరు కార్తీక మాసానికి అది దేవత దామోదరుడు కార్తీక మాసంలో వచ్చే పూర్ణిమను త్రిపుర పూర్ణిమ అంటారు ఇది శంకరుడికి మిక్కిలి ప్రీతికరమైన రోజు ఈ రోజు శంకరుడు త్రిపురాసురుని సంభవించినందుకు దీనికి త్రిపుర పౌర్ణమి అనే పేరు కూడా స్థిరపడింది శంకరుని కీర్తిని నా రోజు నీ వలన విని త్రిపురాసురుడు శంకరుడి కంటే తానే బలవంతుడనని అహంకారపడతాడు శంకరుడు అంటే అసూయ చెందుతాడు అంతటితో ఆగక త్రిపురాసురుడు కైలాసం మీదకు దండెత్తి శివుని యుద్ధానికి పులికొలుపుతాడు మూడు రోజులు యుద్ధం తీవ్రంగా జరుగుతుంది. ఆ యుద్ధంలో శివుడు త్రిపురాసురుని సంహరించగా అప్పుడు దేవతలు పరమశివుని స్తోత్రం చేశారు అందుకే ఈనాటి రాత్రి మహిళలు శంకరుని విజయాన్ని స్మరిస్తూ తులసి కోట వద్ద 720 దూది వత్తులను నీతిలో ముంచి పెద్ద దీపం వెలిగిస్తారు అని ఒక పురాణ కథ వివరిస్తుంది.

పదహారు కళలతో కార్తిక పౌర్ణమి

కార్తిక పౌర్ణమి రోజున చంద్రుడు కృత్తిక నక్షత్రంలో ఉంటాడు కృత్తికకు అగ్ని నక్షత్రం అని పేరు ఈ నక్షత్రానికి అధిపతి అగ్నిదేవుడు కనుక ఈ రోజున దీపారాధన మూలకంగా అగ్నిని ఆరాధించాలని శాస్త్రం ప్రకారం కార్తీక పౌర్ణమి రోజు ఆలయాలలో అనంతమైన దీపాలను వెలిగించే ఆచారం అనాదిగా వస్తుంది ఇది కూడా ఒక విధమైన దీపాల పండుగ వంటివి అయితే చిమ్మ చీకట్లు కమ్మిన అమావాస్య రోజున దీపావళి వస్తే ఆ పండుగ పూర్ణచంద్రుడు 16 కళలతో వెలిగే నిండు పున్నమి నాడు రావడం ఎంతో విశేషం.

కన్నుల పండుగగా కార్తిక దీపోత్సవం

ఈ కార్తీక మాసంలో శివకేశవుల భేదాలు లేకుండా అన్ని ఆలయాలలో ఒకే రోజున ఒకే విధంగా జరిపే ఉత్సవమే కార్తీక పౌర్ణమి ఇది ఎంతో కన్నుల పండుగగా జరిగే దీపోత్సవం మామూలుగా కృత్తికా నక్షత్రం కార్తిక పౌర్ణమి తిథి కలిసి వస్తుంటాయి అప్పుడప్పుడు నక్షత్రము ఒక రోజున పౌర్ణమి ఒక రోజున విడివిడిగా రావడం కూడా జరుగుతుంది ఎక్కువగా కృత్తికా నక్షత్రాన్ని ఈ దీపారాధనకు ముఖ్యమని భావిస్తారు అందుకే ఈ దీపారాధనకు కృత్తికా దీపం లేదా కార్తీకదీపం అని పేరు వచ్చింది. పవిత్రమైన అరుణాచల క్షేత్రంలో ఈరోజున కృత్తిక దీపం వెలిగించే ఆచారం అనాదిగా వస్తుంది ఎంతో కన్నుల పండుగగా అరుణాచల కృత్తికా దీపం మహెూత్సవం జరుగుతుంది.

ఆరోగ్య ఆనందాలతో కార్తిక వనభోజనం

కార్తీక మాసంలో చేసే వనభోజనం ఎంతో ఆరోగ్యప్రదం ఆనందకరం వనభోజనం అన్న మాటకు యదార్థమైన అర్థం వనం అన్నమాటకి అమర కోసం వ్యాఖ్యానం చేసింది వనం అంటే మాట అందరూ అడవిని ప్రేమించి అక్కడ కలిసి మెలిసి సంతోషంగా భక్ష్య భౌజియా పానీయాలతో కూడిన షడ్రసోపేతమైన పదార్థాలను ఆరాధిస్తూ మంచి మాటలు వినాలి ఇకపై వీలైనంతవరకు వైరాగ్యభావంతో జీవించాలని అర్థం. కానీ అన్నం ఒక్కటే తినడానికి వనభోజనానికి వెళ్ళక్కర్లేదని శాస్త్రాలు చెబుతున్నాయి వాస్తవంగా ఆలోచిస్తే అందరము చివరికి జనాలను విడిచి వనాలకు వెళ్లాల్సిన వారమే కదా ఈ వాస్తవాన్ని కార్తీక మాసం వనభోజనం మనకు తెలియజేస్తుంది. పుత్రం పవిత్రం సమాసాధ్య వానప్రస్థాశ్రమేవసేద్ భార్యాపుత్రిం నివేష్యచ అన్నాడు వేదవ్యాస మహర్షి అందుకే వనభోజనానికి వెళ్లేవారు వైరాగ్య భావనతో పవిత్రచింతనతో నిష్కల్మష హృదయంతో వెళ్లాలి ప్రకృతిలో ఆరోగ్యాన్ని సిద్ధింపజేసే అమలక ఉసిరి చెట్లు వృక్షాలు తులసి వనం మామిడి చెట్లు ఎక్కడ ఉన్నాయో అక్కడికే వెళ్లాలి మామిడి చెట్టుకు సంస్కృతంలో రసాలం అని పేరు పరమేశ్వరుడు ఉన్న ఏకైక చెట్టు రసాలం అనగా మామిడి చెట్టు ఉసిరి మామిడి తులసి చెట్లున్న వనానికి వెళ్లి మాత్రమే భోజనం చేయాలి అలా చేసిన భోజనమే కార్తీకమాస వనభోజనం అవుతుంది.

జ్వాలాతోరణం ఆకాశదీపం నందా దీపం

కార్తీక మాసంలో పూర్ణిమ నాడు చేసే మరొక దీపోత్సవం ఇది ఎదురెదురుగా రెండు స్తంభాలు పాతి వాటికి అడ్డంగా ఒక దూలాన్ని కడతారు ఎండు గడ్డిని ఆ మూడు బాదులకు దట్టంగా చుట్టి దాన్ని అంటిస్తారు ఆ గడ్డి మండుతూ ఉండగా దాని క్రిందుగా పల్లకిలో స్వామివారిలను మూడుసార్లు తిప్పే ఆచారాన్ని కొన్ని పురాణ కథలు వివరిస్తున్నాయి జ్వాలాతోరణ రూపంలోనే గాక ఆకాశదీపం నందా దీపం గొప్పలలో దీపాలు వెలిగించి పొలాల్లో తటాకాల్లో వదలడం వంటి ప్రక్రియల రూపంలో ఈరోజు ప్రధానంగా అగ్నిని ఆరాధించే ఆచారం ఉంది ఈ మాసం పూర్తిగా ప్రతి సాయంత్రం ప్రతి ఇంటిలో ద్వారానికి రెండు వైపులా ద్వీపాలు వెలిగిస్తారు ఇంటి ముంగిట గుమ్మట దీపాలు వేలాడదీస్తారు.ఆకాశ దీపం పెట్టే సమయంలో ఈ క్రింది శ్లోకాలను భక్తితో పఠించాలి.

దామోదరాయ నభసి
తులాయాన్ దోలయాసః
ప్రదీపంతే ప్రయచ్ఛామి
నమో అనంతాయ వేధసే
తులాయాం తిలతైలేన
సాయంకాలే సమాగతే
ఆకాశ దీపం యో దధ్యాత్
మాసమేకం హరింప్రతి
యాలక్ష్మీ దివసే పుణ్యే
దీపావళ్యాస్చ భూతలే
గవాం గోష్ఠిం చ కార్తిక్యాం
సాలక్ష్మీ వరదా మమ?
కీటాః పతంగాః మశకాస్చవృక్షాః
జలే స్థలే అలే ఏ నివసంతి?
జీవా దృష్ట్వా ప్రదీపం
చ జన్మ భాగినః
భవతింత్వ స్వపచాహి విప్రాః

( దామోదరుని ప్రీత్యర్థం కార్తిక మాసము నందు వెలిగించే ఈ ఆకాశదీపం శ్రీహరికి ప్రియమగు నట్లు వెలిగించే ఈ దీపం నీరు, భూమి, వృక్షాలు, పండ్లు వంటి వాటిలో నివసించే కీటకాలు, పతంగులు, జీవజాల మంతా దీపం చూడగానే అవి పాపములు తొలగించుకొని మరల పుట్టుక లేకుండా పుణ్యఫలం పొందుతాయని నమ్మకం. ఈ ఆకాశ దీపం ద్వారా సమస్త జీవరాసులకు శుభం కలుగుతుంది. ఇంట లక్ష్మీ కటాక్షం కలుగుతుంది. అనే భావంతో కూడుకున్న ఈ శ్లోకాన్ని భక్తిశ్రద్ధలతో పఠించాలి.

ఈ దీపాన్ని సూర్యాస్తమయం తర్వాత మాత్రమే వెలిగించాలి.

ఈ దీపాన్ని ఇంటిముందు లేదా పైకప్పు పైన ఉంచి ఆకాశం వైపు చూడాలి. భక్తితో రెండు చేతులు జోడించి నమస్కరిస్తూ పై శ్లోకాలను పఠించాలి.

ఆకాశదీపం మసక భారేంతవరకు దాన్ని కదిలించకూడదు.

ఈ నియమాలు పాటిస్తూ ప్రతి ఇంటి ముంగిట ఆకాశ దీపాలు వెలిగించడం కార్తిక మాసంలో సంప్రదాయం. ఏది ఏమైనా పగలు తగ్గి రాత్రి హెచ్చుగా ఉండే ఈ కాలంలో నెమ్మదిగా చలి ప్రభావం పెరుగుతుంది. ఆ చలి ప్రభావాన్ని తగ్గించి, వాతావరణంలో ఉష్ణాన్ని పెంచి, వాతావరణ సమతుల్యతను కాపాడటానికి ఇంటింటా ఈ దీపారాధనలు దోహదం చేస్తాయన్నది వాస్తవమైన విషయం. దీన్ని పెద్దలు చెప్పిన ఆచారంగా మనం పాటిస్తే మనకు తెలియకుండానే మనందరికీ ఎంతో ఉపకారం జరుగుతుంది. అందుకే 'పెద్దల మాట సద్దన్నం మూట' అనే నానుడి ప్రచారంలోకి వచ్చింది.

దక్షిణ భారత దేశంలో కార్తిక మాసానికి, కార్తిక దీపోత్సవాలకు ఎంతో విశేషమైన ప్రాధాన్యత ఉంది అని చెప్పక తప్పదు. ఈ మాసంలో శివుడు అగ్ని రూపంలో వ్యక్తం అవుతాడని పురాణాలు చెబుతున్నాయి. అగ్ని అన్నింటిలో ఉండే అపవిత్రతని ఏ విధంగా నశింపజేస్తాడు అదేవిధంగా భగవంతుడు మానవునిలోని అజ్ఞానం అహంకారం అసూయ మొదలైన దుర్గుణాలను నశింపజేసి, జ్ఞానమనే ఒక్క దీపాన్ని వెలిగింపజేసి ప్రకాశవంతం చేస్తాడని ఈ కార్తిక మాసంలో జరిపే దీపోత్సవం మనకు తెలియజేస్తుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకుంటూ తాత్విక చింతనతో కార్తిక మాసాన్ని వైభవంగా జరుపు కుందాం! సనాతన ధర్మ వైశిష్ట్యాన్ని అర్థం చేసుకొని ధర్మబద్ధులుగా జీవిద్దాం!



"సాహిత్య కళా విభూషణ్"
చౌడూరి నరసింహారావు
ప్రవచన కర్త, ఆధ్యాత్మిక విశ్లేషకులు

## కాటన్ మిల్లుల వద్ద రైతులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి: రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ గోపి

సూర్యాపేట, భారత శక్తి ప్రతినిధి ,అక్టోబర్ 23:



కాటన్ మిల్లుల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు పత్తి కొనుగోలు చేసేలా చూడాలని, కిసాన్ కపాస్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపి సూచించారు.గురువారం ఆయన సూర్యాపేట మండలం, బాలెంలలోని మంజిత్ కాటన్ ఫ్యాక్టరీ ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి సందర్శించారు.

మాయిచర్ మిషన్ ద్వారా పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు.రైతులు పత్తిని గ్రామంలోనే ఆరబెట్టుకొని తీసుక రావాల్సిందిగా కోరినారు.

8 శాతం ఉన్న పత్తికి ప్రభుత్వం మద్దతు ధర 8110/- చెల్లిస్తుంది తెలిపినారు.ఈ సంవత్సరం సి సి ఐ నూతన పద్ధతిలో పత్తి కొనుగోలు చేయాలని సూచనలు చేసిందని ,కిసాన్ కపాస్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని పత్తిని విక్రయించుకోవచ్చని తెలిపారు.కిసాన్ కపాస్ యాప్ ద్వారా గ్రామాల వారీగా రైతులు ఎలా స్లాట్ బుక్ చేసుకోవాలో వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని, జిల్లాలోని పత్తి రైతులు అందరు చరవాణి నంబర్లు అప్ డేట్ చేయాలని చెప్పారు.తదుపరి బాలెంల రైతు వేదిక లో వ్యవసాయ శాఖ అలాగే మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయా శాఖల పురోగతి పై సమావేశం నిర్వహించారు.జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మార్కెటింగ్ అధికారి నాగేశ్వరశర్మ, మండల వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## గోరక్షకులపై దాడి చేసిన నింధితులను వెంటనే అరెస్ట్ చేయాలి: బీజేపీ కామారెడ్డి శాఖ

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) అక్టోబర్ 23: బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్ర రాజధానిలో గోరక్షకులపై దాడి చేసిన నింధితులను వెంటనే అరెస్ట్ చేసి శిక్షించాలనీ డిమాండ్ చేస్తూ బీజేపీ కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ, రాష్ట్ర రాజధాని పోచారంలో గోవులను తరలిస్తున్న ఎంఐఎం నాయకులను అడ్డుకున్నందుకు సోను సింగ్ (ప్రశాంత్) పై తుపాకీతో కాల్పులు జరపడం జరిగిందనీ, ఈ కాల్పులలో తీవ్రంగా గాయపడ్డ సోను (ప్రశాంత్) ప్రస్తుతం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని అన్నారు.

ఇలాంటి మతవాద దాడులు రాష్ట్రంలో చట్టవ్యవస్థ పూర్తిగా కూలిపోయిందని నిరూపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుండీ తెలంగాణ రాష్ట్రంలో ఎం.ఐ.ఎం మతోన్మాద మూకల స్వైర విహారం విపరీతంగా పెరిగిపోయిందనీ, ఎం.ఐ.ఎం నాయకుల రాక్షసత్వానికి బీ.ఆర్.ఎస్ పార్టీ మౌనంగా ఉండి మద్దతు తెలిపితే, కాంగ్రెస్ పార్టీ వెన్నుతట్టి ప్రోత్సహిస్తుందనీ అన్నారు.

అమాయక ప్రజలపై, అధికార యంత్రంగంపై, చివరికి రక్షణ కల్పించే పోలీసుల గుండెల్లో ఎం.ఐ.ఎం గూండాలు కోరలు దింపుతున్నా.. చోద్యం చూస్తున్న చేవలేని కాంగ్రెస్ పార్టీ



చేతకానితనాన్ని ఎండగడుతూ బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ఎన్.రాంచందర్ రావు నేతృత్వంలో కాంగ్రెస్ – ఎంఐఎం రజాకార్ పాలనకు వ్యతిరేకంగా నిరసన చేపడితే, గోరక్షకులపై తుపాకీలతో దాడిచేసిన ఎం.ఐ.ఎం నాయకులను, పోలీసులపై దాడి చేసిన ఎం.ఐ.ఎం కార్యకర్తలను అరెస్టు చేసే దమ్ములేని కాంగ్రెస్ ప్రభుత్వం నిరసన చేపట్టిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ రాంచందర్ రావు ని, బిజెపి నాయకులను అక్రమంగా అరెస్టు చేయటం సిగ్గు చేటు అని అన్నారు. ప్రభుత్వం వెంటనే దోషులను అరెస్ట్ చేసి, కఠిన శిక్ష విధించాలని బీజేపీ డిమాండ్ చేస్తుందని, హిందువుల భద్రతకు హామీ ఇవ్వలేని పక్షంలో, ఆ ప్రభుత్వం అధికారంలో కొనసాగే నైతిక హక్కును కోల్పోతుందనీ అన్నారు.

# విద్యాభివృద్ధికి సహకరించండి

– కలెక్టర్ ను కలిసి వినతి పత్రాన్ని అందజేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే నిర్మల జగ్గారెడ్డి దంపతులు

– ప్రభుత్వ పాఠశాల కళాశాల పనుల పర్యవేక్షణ

సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, అక్టోబర్ 23:

సంగారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలతో పాటు జూనియర్ కళాశాల నిర్మాణ పనులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



దంపతులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల కళాశాల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాల కళాశాల మధ్య కాంపౌండ్ వాల్ నిర్మాణానికి 50 లక్షలు, ఉన్నత పాఠశాల కళాశాల గ్రౌండ్లో గ్రావెల్ కోసం మరో 20 లక్షలు, అదేవిధంగా ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన భవనానికి పెయింటింగ్ నిమిత్తం 10 లక్షల రూపాయలను తక్షణమే మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని అందజేశారు. ఆరు నెలల కిందట బాలుర ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాలను వేరు చేసి ప్రహరీ కూడా నిర్మించాలని ప్రతిపాదన చేసినట్లు పేర్కొన్నారు. కానీ ఇప్పటివరకు పనులు పూర్తి కాలేదని తెలిపారు. కేవలం బడ్జెట్ కారణంగానే పనులు ఆగిపోయాయని అధికారులు సమాధానం ఇవ్వడం జరిగిందన్నారు. 50 లక్షల నిధుల కోసం కలెక్టర్ కు టి జి ఐఐసీ చైర్పర్సన్ నిర్మల జగ్గారెడ్డికి లెటర్ హెడ్ పై విజ్ఞప్తి చేశామన్నారు. ఇక జూనియర్ కళాశాలలో సెకండ్ ఫ్లోర్ అదనపు తరగతి గదుల ఏర్పాటుకు సేఫ్టీ వాల్ సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కళాశాల ప్రిన్సిపల్ జగ్గారెడ్డిని కోరారు. వీటికి సంబంధించి మరో 50 లక్షల నిధుల కోసం కలెక్టర్కు లేక ఇవ్వాలని జగ్గారెడ్డి సూచించారు. కళాశాలలో నిరుపయోగంగా శిథిలావస్థలో ఉన్న భవనాలను కూచివేసేందుకు కలెక్టర్కు సమాచారం అందించినట్లు తెలిపారు. కూల్చివేతలకు సంబంధించి ప్రొసీజర్ త్వరగా పూర్తిచేసే కూల్చివేతలు చేపట్టాలని అధికారులకు సూచించారు. జూనియర్ కళాశాల ఉన్నత పాఠశాల గ్రౌండ్ లో వర్షాలు పడినప్పుడల్లా నీళు నిలుస్తున్నాయని ఉపాధ్యాయులు విద్యార్థులు జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గ్రౌండ్ లెవెల్ కోసం 20 లక్షల రూపాయలు ఖర్చు అవుతుందని కలెక్టర్కు వినతి పత్రం అందించాలని జగ్గారెడ్డి సూచించారు.

బాలుర ఉన్నత పాఠశాల మన ఊరు మనబడి కింద నిర్మించిన రెండు అంతస్తుల భవనాలు పెయింటింగ్ వేయాలని ఉపాధ్యాయులు జగ్గారెడ్డికి విజ్ఞప్తి చేశారు. పెయింటింగ్ కోసం పది లక్షల రూపాయల నిధులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. విద్యా వ్యవస్థ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

## ఆ సినిమా నాకు చాలా నేర్పింది..

### అనుపమ పరమేశ్వరన్ కామెంట్స్ వైరల్



రీసెంట్ తమిళ హిట్ 'బైసన్'తో త్వరలో తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నది అనుపమ పరమేశ్వరన్. ధృవ్ విక్రమ్, మారి సెల్వరాజ్ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం అక్టోబర్ 17న తమిళంలో రిలీజై హిట్ అందుకోగా.. అక్టోబర్ 24న తెలుగులో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా తాజాగా మీడియా సమావేశంలో అనుపమ ఆసక్తిర విషయాలు పంచుకుంది. 'మారి సెల్వరాజ్ సినిమాలో చేయాలనేది నా డ్రీమ్. ఆయన మొదట ఆఫర్ చేసినప్పుడే నటించాల్సింది. కానీ అప్పుడు నాకు షెడ్యూల్ ప్రాబ్లెమ్ ఉండి కుదరలేదు.
ఇప్పుడు 'బైసన్'లో ఆయనతో పనిచేసే అవకాశం రావడం నాకు నిజంగా స్పెషల్. ఈ సినిమా నాకు కొత్తగా చాలా నేర్పింది. ధృవ్ విక్రమ్‌లో ఉన్న ప్యాషన్ అద్భుతం. సినిమా కోసం ఎంత కష్టపడ్డాడో నాకు తెలుసు. షూటింగ్ సమయంలో ఆయనలో కనిపించిన ఆ డెడికేషన్ చూసి నేను ఇన్‌స్పైర్ అయ్యాను. ఆయనతో స్క్రీన్ షేర్ చేసుకోవడం నా అదృష్టం. గర్వంగా ఫీల్ అవుతున్నా.. ఈ మూవీకి తమిళంలో అద్భుతమైన స్పందన లభించింది.. అందుకే తెలుగులో కూడా రిలీజ్ చేయాలని డిమాండ్ ఎక్కువగా ఉంది. అక్టోబర్ 24న మీ ముందుకు రాబోతున్నాం.. ఇక్కడ కూడా సపోర్ట్ చేసి హిట్ ఇస్తారని ఆశిస్తున్నాము' అని తెలిపింది.

# అలనై నీ ఒడిలో ఒదిగా

## దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే



దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న విభిన్నమైన పీరియాడిక్ హారర్ థ్రిల్లర్ చిత్రం 'కాంత'. బుధవారం ఈ సినిమా నుంచి 'అమ్మడివే..నా చెలివే' పాటని విడుదల చేసింది చిత్రబృందం. "ఈ అద్భుతమే ఊహించనిదే ఊహాల్లో ఈ ప్రేమే లేనే లేదే.. ఈ అద్భుతమే ఊహించనిదే... నాకింత సంతోషం ఎప్పుడు లేదే.. నిశిలా నలుపై నేనే ఉంటే..శశివై ఇలకే నువ్వొచ్చావే.. ఎదకే వెలుగే చూపించావే...అలనై ఒడిలో నేనొదిగానే.. తారలకే జో పలికే జాబిలివే తెలుసా నీకే...అమ్మడివే నా చెలివే..."అంటూ సాగే ఈ గీతం ప్రేక్షకుల్ని ఆకట్టుకునేలా ఉంది. ఝాను చంతర్ స్వరాలు అందించిన ఈ పాటకి కృష్ణ కాంత్ సాహిత్యమందించగా, ప్రదీప్ కుమార్ ఆలపించారు. ఈ చిత్రాన్ని సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో రానా, దుల్కర్, ప్రశాంత్ పొట్లూరి, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారు. నవంబరు 14న థియేటర్లలోకి రానుంది చిత్రం.

# సాంప్రదాయిని సుప్పిని...



శివాజీ – లయ కలయికలో విజయవంతమైన సినిమాలు చాలానే వచ్చాయి. మరోసారి ఆ జోడీ తెరపై సందడి చేయనుంది. ఈ కలయికలో రూపొందుతున్న కొత్త చిత్రానికి 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' అనే పేరుని ఖరారు చేశారు. బుధవారం పేరుని ప్రకటిస్తూ, మోషన్ పోస్టర్‌ని విడుదల చేశారు. ఈటీవీ విన్‌తో కలిసి శివాజీ స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు.
శివాజీ, లయ జంటగా నటిస్తుండగా... రోహన్, అలీ, ధనరాజ్, రఘుబాబు, థర్టీ ఇయర్స్ పృథ్వీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్తూరు నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో శివాజీ పంచాయతీ సెక్రటరీ శ్రీరామ్ పాత్రలో సందడి చేయనున్నారు.

**ఈటీవీ విన్‌తో కలిసి శివాజీ స్వయంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహిస్తున్నారు.**

## రూ.100 కోట్లు దాటిన 'డ్యూడ్'..

## ప్రదీప్ రంగనాథన్ హ్యాట్రిక్




సినీ వర్గాలు ఊహించినట్టే 'డ్యూడ్' రూ.100 కోట్ల మార్క్ దాటేసింది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ గురువారం అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు కొత్త పోస్టర్ విడుదల చేసింది. "బాక్సాఫీసు వద్ద డ్యూడ్ సెంచరీ కొట్టింది. దీపావళి సీజన్‌లో బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది" అని పేర్కొంది. ఈ నెల 17న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం 6 రోజుల్లో ఈ కలెక్షన్లు రాబట్టింది.
వరుసగా మూడు విజయాలు..
ప్రదీప్ రంగనాథన్ ) హీరోగా నటించిన మూడో చిత్రం 'డ్యూడ్'. మమితా బైజు హీరోయిన్. శరత్ కుమార్, నేహాశెట్టి కీలక పాత్రలు పోషించారు. కీర్తీశ్వరన్ దర్శకుడు. ఇంతకుముందు ప్రదీప్ నటించిన 'లవ్‌టుడే', 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్' సైతం రూ.100 కోట్లకుపైగా కలెక్షన్లు రాబట్టడం విశేషం. కోలీవుడ్‌తోపాటు టాలీవుడ్‌లోనూ తనకంటూ ప్రత్యేక క్రేజ్ సొంతం చేసుకున్నారు ప్రదీప్.



# ప్రపంచస్థాయి ఫ్రాంచైజీ చిత్రంగా... 'మిరాయ్'

"నాణ్యమైన సినిమాని మనం మన దేశంలోనే చేయగలమని నిరూపించిన సినిమా 'మిరాయ్'. మన దగ్గర ఎంత అద్భుతమైన సాంకేతిక నిపుణులు ఉన్నారో ఈ చిత్రం చాటి చెప్పింది" అన్నారు ప్రముఖ దర్శకుడు మారుతి. ఆయనతోపాటు, పలువురు సినీ ప్రముఖులు ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన 'మిరాయ్' విజయోత్సవంలో పాల్గొన్నారు. తేజ సజ్జా కథానాయకుడిగా.. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మించారు. సెప్టెంబరు 12న విడుదలైన ఈ చిత్రం ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. కథానాయకుడు తేజ సజ్జా మాట్లాడుతూ "ఒక మంచి సినిమా వచ్చిందంటే దాన్ని ప్రోత్సహించి గొప్ప స్థాయికి తీసుకెళతారు ప్రేక్షకులు. ఈ సినిమాని ఆదరించిన తీరుని ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటా. ఈ సినిమా కోసం చాలా వేడుకలు చేశాం. ఈ వేడుక మాత్రం సాంకేతిక బృందం కోసమే. బ్రహ్మాండమైన ఈ సినిమాకోసం దర్శకుడు కార్తీక్ సహా మిగతా బృందమంతా పడిన తపన ఎప్పటికీ గుర్తుండిపోతుంది" అన్నారు.

# ఆంగ్లంలో 'కాంతార: చాప్టర్ 1'



అంతర్జాతీయ ప్రేక్షకుల్ని మెప్పించడమే లక్ష్యంగా 'కాంతార: చాప్టర్ 1' చిత్రాన్ని ఆంగ్లంలోకి అనువదించి విడుదల చేయాలని నిర్ణయించింది నిర్మాణ సంస్థ. అందుకోసం గం.2.45 నిమిషాల నిడివితో సినిమాని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 31న ఆంగ్ల చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. రిషబ్‌శెట్టి కథానాయకుడిగా నటించి, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రమిది. హొంబలే ఫిల్మ్స్ నిర్మించింది. ఈ నెల 2న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం ఇప్పటికే దాదాపు రూ.800 కోట్లు వసూళ్లు సాధించింది. తెలుగులో రూ.100 కోట్లు వసూలు చేసింది. పాన్ ఇండియా స్థాయిలో విజయవంతమైన 'కాంతార'కి ముందు భాగం కథతో రూపొందిన చిత్రమిది.

**అందుకోసం గం.2.45 నిమిషాల నిడివితో సినిమాని ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఈ నెల 31న ఆంగ్ల చిత్రాన్ని విడుదల చేస్తున్నారు.**

## వస్తున్నా.. ఇప్పుడే అసలు సినిమా మొదలవ్వద్ది.. బండ్ల గణేష్ కీలక ప్రకటన

: టాలీవుడ్ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ తన రీఎంట్రీని ప్రకటించాడు. సిద్దు జొన్నలగడ్డ హీరోగా నటించిన తెలుసుకదా సినిమా సక్సెస్ మీట్ లో బండ్ల పాల్గొన్నాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్మాత ఎస్కేఎన్ తనను రీఎంట్రీ ఇవ్వాలని అడిగాడని చెప్పారు. తాను టెంపర్ లాంటి బ్లాక్ బస్టర్ సినిమాతో సినిమాలకు బ్రేక్ ఇచ్చానని, ఫ్లాప్ సినిమాతో బ్రేక్ తీసుకోలేదని చెప్పారు. ఇప్పుడు మళ్లీ సినిమా మొదలవుతుందని స్పష్టం చేశారు. దీంతో నిర్మాతగా తన రీఎంట్రీని కన్ఫామ్ చేశారు.
ఇదిలా ఉంటే బండ్ల గణేష్ మొదట నటుడిగా సినిమాల్లో మెప్పించగా తరవాత రవితేజ హీరోగా నటించిన ఆంజనేయులు సినిమాతో టాలీవుడ్‌కు ప్రొడ్యూసర్‌గా పరిచయం అయ్యారు. ఈ సినిమా తరవాత వరుస సినిమాలు చేసినా గబ్బర్ సింగ్ సినిమాతో సూపర్ డూపర్ హిట్ కొట్టారు. గబ్బర్ సింగ్ తరవాతే బండ్లకు నిర్మాతగా ఎంతో గుర్తింపు వచ్చింది. ఇక చివరగా ఎన్టీఆర్ తో టెంపర్ సినిమా చేసి బ్లాక్ బస్టర్ హిట్ కొట్టారు.

# అతడే ఒక పరిశ్రమ



'ఒంటరిగా నడిచే ఒక బెటాలియన్...' ప్రభాస్ కొత్త సినిమా పోస్టర్‌పై కనిపిస్తున్న శీర్షిక ఇది. ప్రభాస్ నటిస్తున్న సినిమా కథకు, పాత్రకే కాదు... ఆయన వ్యక్తిగత ప్రయాణానికీ అక్షరాలా వర్తిస్తుంది ఆ శీర్షిక. ప్రభాస్ ఇప్పుడు హీరో మాత్రమే కాదు, ఆయనే ఒక పరిశ్రమ. ఆయన పేరుతో రూ.వేల కోట్ల వ్యాపార లావాదేవీలు జరిగిపోతుంటాయి. అన్ని సినిమాలూ ఒక లెక్క... ప్రభాస్ సినిమా ఒక లెక్క అన్నట్టుగా ఉంటుంది వ్యవహారం. మన పరిశ్రమ సత్తాని రూ.వందల కోట్ల నుంచి రూ.వేల కోట్లకు మార్చేసిన ఘనత ప్రభాస్‌కి దక్కుతుంది. డార్లింగ్‌కి కథ నచ్చేసిందట అనే మాట వినిపిస్తే చాలు... ఆ సినిమాపై ఇటు దక్షిణ భారతం నుంచీ, అటు ఉత్తరాది వరకూ ఉత్సాహంగా వ్యాపారాలు సాగిపోతుంటాయి. ఓవర్సీస్ అయితే మరింత ఆసక్తికరంగా ఎదురు చూస్తుంటుంది ప్రభాస్ సినిమా కోసం. నిర్మాణం, పంపిణీ, ప్రదర్శన... ఇలా అన్ని విభాగాల్లోనూ ఆ జోష్ కొట్టొచ్చినట్టు కనిపిస్తుంటుంది. ఉత్తరాదిలో పాగా వేయాలని మన హీరోలు ఎంతోమంది ప్రయత్నించారు. కానీ ఎవ్వరికీ సరైన పట్టు దొరకలేదు. తెలుగుకీ, హిందీకీ మధ్య ఎంత దూరమో అనిపించేది. కానీ 'బాహుబలి' సినిమాల నుంచి ఆ లెక్కని సమూలంగా మార్చేశారు ప్రభాస్. తెలుగు, హిందీ అనే హద్దులే లేవు ఇప్పుడు. ప్రభాస్ కటౌట్ భాషతో సంబంధం లేకుండా అందరికీ నచ్చేసింది. దక్షిణాదిలాగే ఉత్తరాదిలోనూ డార్లింగ్ డార్లింగ్ అంటూ ఆప్యాయంగా పిలుస్తుంటారు ప్రేక్షకులు. పాన్ ఇండియా స్టార్ అనే మాటకి అచ్చుమైన నిర్వచనంగా నిలిచారు ప్రభాస్. తెరపై ఆయన రూపమే కాదు, ఆయన పలికిన ఓ మాట వినిపించినా చాలు... అది సినిమాని మరింత శక్తిమంతంగా మార్చేస్తుంది. ఇటీవల విడుదలై ఘన విజయం సాధించిన 'మిరాయ్' సినిమానే అందుకు ఉదాహరణ. ప్రభాస్ కటౌట్‌లాగే ఆయన కథలూ భారీగా ఉండాల్సిందే. రూ.వందల కోట్లతో, రెండు మూడు భాగాలుగా ప్రభాస్ సినిమాలు రూపొందుతుంటాయి. 'బాహుబలి: ది కన్‌క్లూజన్', 'సలార్ 2', 'కల్కి 2' ఇలా అన్నీ పెద్ద కథలే. భవిష్యత్తులో ఈ కథలు మరింత విస్తృతం అయినా ఆశ్చర్యం లేదు. కథానాయకుడిగా అంత ఎత్తుకు ఎదిగినా సరే, ప్రభాస్ మాత్రం ఎప్పట్లాగే ఒదిగే ఉంటారు. తక్కువగా మాట్లాడతారు, ఎక్కువ పనిచేస్తుంటారు. అదే ప్రభాస్ విజయరహస్యం. ఆయన పుట్టినరోజు నేడు. ఈ సందర్భంగా ప్రభాస్ నటిస్తున్న కొత్త సినిమాల కబుర్లు ఈ రోజు బోలెడన్ని వినిపించనున్నాయి. వాటితో సంబరాలు చేసుకొనేందుకూ అభిమానులు సిద్ధమైపోయారు.



# ఆ హావభావాలు వీడ్కోలుకు సంకేతమా?

## వరుసగా రెండు డకౌట్‌లు..

భారత స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ ) మరోసారి నిరాశ పరిచాడు. కనీసం పరుగుల ఖాతా కూడా తెరలేకపోవడం గమనార్హం. దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన విరాట్‌పై భారీ అంచనాలే ఉన్నాయి. కానీ, వాటిని అందుకోవడంలో విఫలమయ్యాడు. ఆసీస్‌తో పెర్త్ వన్డేలో 8 బంతులు ఆడిన కోహ్లీ పరుగుల ఖాతా తెరవలేదు. ఇప్పుడు తనకు కలిసొచ్చే అడిలైడ్‌లోనూ ఇబ్బంది పడ్డాడు. ఈసారి నాలుగు బంతుల్లోనే వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో భారత అభిమానులు తీవ్రస్థాయిలో నిరుత్సాహానికి గురయ్యారు. అయితే, కోహ్లీ తన వన్డే కెరీర్‌లో ఇలా వరుసగా రెండు మ్యాచుల్లో డకౌట్ కావడం ఇదే తొలిసారి. ఇప్పుడు ఆ చెత్త రికార్డును ఖాతాలో వేసుకున్నాడు.

ఈ సిరీస్‌లో ఔట్ అయ్యిందిలా..

పెర్త్ వేదికగా భారత్ - ఆస్ట్రేలియా మధ్య తొలి వన్డే జరిగింది.

వర్షం పలుమార్లు అంతరాయం కలిగించినా చివరికి ఆసీస్‌నే విజయం వరించింది. ఆ మ్యాచ్‌లో విరాట్ ఆఫ్‌సైడ్ బంతిని కదిలించి వికెట్ ఇచ్చాడు. మిచెల్ స్టార్క్ సంధించిన బంతిని ఆడబోయి బ్యాక్‌వర్డ్ పాయింట్‌లో ఫీల్డర్‌కు చిక్కాడు. ఇప్పుడు అడిలైడ్‌లోనూ రాణిస్తాడనుకుంటే ఇక్కడా బ్యాట్ ఎత్తేశాడు. ఈసారి బార్ట్‌లెట్ బౌలింగ్‌లో వికెట్ల ముందు దొరికిపోయాడు.

కనీసం డీఆర్ఎస్ కూడా తీసుకోకపోవడం గమనార్హం. పెవిలియన్‌కు వెళ్తూ అభిమానులకు అభివాదం చేయడంతో కొత్త చర్చ మొదలైంది. ఈ సిరీస్ అనంతరం వన్డేలకూ వీడ్కోలు చెబుతాడా? అనే సందేహం అభిమానుల్లో నెలకొంది. ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారిపోయింది.

# సెలక్టర్లపై నమ్మకం ఉంచాలి: సర్ఫరాజ్ విషయంలో ఇర్ఫాన్ వ్యాఖ్యలు



దక్షిణాఫ్రికా తో రెండు టెస్టులు ఆడేందుకు భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఇటీవల ప్రకటించింది. రిషభ్ పంత్‌ను సారథిగా నియమించింది. సర్ఫరాజ్ ఖాన్‌కు అవకాశం కల్పించకపోవడంతో తీవ్రస్థాయిలో చర్చ మొదలైంది.

ఒకానొక దశలో ఇది రాజకీయంగానూ దారితీసింది. అతడి పేరు వల్లే అవకాశం రావడం లేదంటూ కాంగ్రెస్ - భాజపా నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ కీలక వ్యాఖ్యలు చేశాడు.

సెలక్టర్లపై నమ్మకం ఉంచాలని.. కొన్ని ప్రణాళికలు ఉంటాయని వ్యాఖ్యానించాడు."సెలక్టర్లు, కోచ్, మేనేజ్‌మెంట్.. ఎవరికైనా సరే నిర్దిష్టమైన ఆలోచనలు ఉంటాయి. కొన్నిసార్లు అభిమానులకు అవి తప్పుగా కనిపిస్తాయి. అయితే, ప్రతి విషయాన్ని గుచ్చిగుచ్చి చూడాల్సిన అవసరం లేదు. నిజాన్ని దాచిపెట్టేలా కొత్త కథనాలు సృష్టించొద్దు" అని ఇర్ఫాన్ పోస్టు పెట్టాడు.

కమ్యూనికేషన్ బాగుండాలి: అశ్విన్"ఆటగాళ్లకు, బోర్డుకు మధ్య సరైన కమ్యూనికేషన్ ఉండాలి. లేకపోతే ఇలాంటి అయోమయ పరిస్థితులే ఎదురవుతాయి. ఈ సందర్భంగా నాకు సుబ్రమణియన్ బద్రినాథ్ గుర్తుకొస్తాడు. అతడు భారత్ తరఫున చాలా మ్యాచులు ఆడాడు. సారథిగానూ వ్యవహరించాడు. మనోజ్ తివారీ విషయంలోనూ ఇలాగే జరిగింది.

కానీ, వారిని జాతీయజట్టులోకి ఎక్కువగా తీసుకోలేదు. అందుకే, ఇలాంటి సమయంలో ప్లేయర్లతో బోర్డు ప్రతినిధులు మాట్లాడాలి. నువ్వు భారత్ %ూ% జట్టుకు ఆడకపోయినా నిన్ను జాతీయ టీమ్‌కు తీసుకుంటామన్న భరోసా ఇవ్వాలి. అప్పుడే ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేకుండా ఉంటుంది" అని అశ్విన్ వ్యాఖ్యానించాడు.

# గిల్‌తో కరచాలనం..

## వక్రబుద్ధిని చాటుకున్న పాక్ అభిమాని.



టీమ్‌ఇండియా ప్రస్తుతం అడిలైడ్‌లో ఉంది. ఆస్ట్రేలియాతో రెండో వన్డే సందర్భంగా అక్కడ పర్యటిస్తోంది. ఈ క్రమంలో ఆప్షనల్ ట్రైనింగ్ సెషన్ కావడంతో ఆటగాళ్లలో కొందరు అడిలైడ్ చూసేందుకు వెళ్లారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ) కూడా హర్షిత్ రాణాతో కలిసి బయటకు వెళ్లాడు. ఈ సందర్భంగా ఓ క్రికెట్ అభిమానితో కరచాలనం చేశాడు.

అయితే, సదరు ఫ్యాన్ పాకిస్థాన్‌కు చెందిన వ్యక్తి కావడంతో ఆ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఎందుకంటే, గిల్‌తో కరచాలనం అనంతరం ఆ వ్యక్తి 'పాకిస్థాన్ జిందాబాద్' అంటూ నినదించాడు. ఇప్పుడు అదే తీవ్ర చర్చకు దారితీసింది. సదరు ఫ్యాన్ చేసిన దానిపై నెట్టింట విమర్శలు వస్తున్నాయి. కానీ, టీమ్‌ఇండియా సారథి గిల్ మాత్రం ఎలాంటి స్పందన లేకుండా ముందుకుసాగిపోయాడు.

దీంతో శుభమన్‌పై ప్రశంసల వర్షం కురుస్తుండగా.. పాక్ అభిమానిపై సోషల్ మీడియాలో తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

ఆసియా కప్ సందర్భంగా పాక్ ఆటగాళ్లతో కనీసం మన క్రికెటర్లు కరచాలనం కూడా చేయలేదు. విజేతగా నిలిచినా సరే మోసిన్ నఖ్వీ నుంచి టైటిల్‌ను అందుకోలేదు. కానీ, ఇప్పుడు ఆ అభిమాని ఎవరనేది చూడకుండా గిల్ హుందాగా కరచాలనం చేశాడు. కానీ, అతడు మాత్రం వక్రబుద్ధిని ప్రదర్శించాడని భారత క్రికెట్ అభిమానులు విరుచుకుపడ్డారు. ఇది ఆ దేశం సాధించిన అతిపెద్ద అచీవ్‌మెంట్‌గా ఎద్దేవా చేస్తూ కామెంట్లు చేశారు.

# పేసర్‌కు స్పిన్నర్‌కు తేడా తెలియదా? శశిథరూర్‌పై నెటిజన్లు ఫైర్



భారత సెలక్షన్ కమిటీని ఇరకాటంలో పెడదామని భావించిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్‌కు చుక్కెదురైంది. సోషల్ మీడియాలో తాను పెట్టిన పోస్టుకు విమర్శల తాకిడి ఎక్కువైంది. అసలు ఆయన ఏం పోస్టు పెట్టారు?ఎందుకు ఇలాంటి పరిస్థితి వచ్చిందో చూద్దాం.

ఆస్ట్రేలియాతో భారత్ రెండో వన్డేను అడిలైడ్ వేదికగా ఆడుతోంది. టాస్ ఓడిన టీమ్‌ఇండియా తొలుత బ్యాటింగ్ చేసింది. నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 264 పరుగులు చేసింది. అయితే, తుది జట్టులో గత మ్యాచ్‌కు, ఇప్పటికీ ఏమార్పు లేకుండా బరిలోకి దిగింది. కుల్‌దీప్ యాదవ్‌కు అవకాశం ఇవ్వాలని బయట నుంచి డిమాండ్లు వచ్చినా మేనేజ్‌మెంట్ మాత్రం ఎలాంటి మార్పు లేకుండానే ఆడించింది. దీంతో కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టారు. "కేవలం నాలుగు బంతుల్లోనే ఆసీస్ బౌలర్ జేవియర్ బార్ట్‌లెట్ భారత సెలక్షన్ నిర్ణయం ఎంత తెలివి తక్కువైందో నిరూపించాడు. జర్నీ మ్యాన్ హర్షిత్ రాణా కోసం మ్యాచ్ విన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను పక్కనపెట్టడం సరైంది కాదు. ఇంగ్లాండ్ పర్యటనలోనూ ఇలాగే చేశారు. ఇప్పుడు ఆసీస్‌తో వన్డే సిరీస్‌లోనూ తుది జట్టులో ఆడించడం లేదు. ఇది అసంబద్ధం. దారుణం" అని శశిథరూర్ పోస్టు పెట్టారు. ఇప్పుడు ఇదే నెట్టింట వైరల్‌గా మారిపోయింది.

బ్యాటింగ్‌లో రాణించాడు..

ఫాస్ట్ బౌలర్‌కు, స్పిన్నర్‌కు తేడా తెలియకుండానే ఆట గురించి కొందరు పోస్టులు పెట్టేస్తారంటూ అభిమానులు కామెంట్లు చేయడం మొదలుపెట్టారు. హర్షిత్ రాణా తుది జట్టులో ఎందుకు అనే ప్రశ్నకు ఇవాళ అతడు బ్యాటింగ్‌తో సమాధానం ఇచ్చాడు. ఆఖర్లో దూకుడుగా ఆడి 24 పరుగులు రాబట్టాడు. అర్ష్‌దీప్ సింగ్‌తో కలిసి టీమ్‌ఇండియాకు విలువైన భాగస్వామ్యం అందించాడు. దానిని గుర్తుచేస్తూ నెటిజన్ల కామెంట్లు ఇలా..

"జేవియర్ బార్ట్‌లెట్ పేసర్. కుల్‌దీప్ యాదవ్ చైనామన్ స్పిన్నర్. మీరు మాత్రం భారత సెలక్షన్ కమిటీని విమర్శించే తొందరలో అది మరిచిపోయినట్లు ఉన్నారు""ఆస్ట్రేలియా కూడా నలుగురు పేసర్లతో బరిలోకి దిగింది. భారత్ అదే చేసింది. జేవియర్ బార్ట్‌లెట్ స్పిన్నర్ కాదు. ఇప్పటికే జట్టులో అక్షర్ పటేల్‌తోపాటు వాషింగ్టన్ సుందర్ ఉన్నాడు. వీరిద్దరూ బ్యాటింగ్ కూడా చేస్తారనే మేనేజ్‌మెంట్ తీసుకుంది""జేవియర్ బార్ట్‌లెట్ కాదు. మీరు జేవియర్ దోహర్తి గురించి ఇలా పోస్టు పెట్టారనుకుంటా. హర్షిత్ రాణా బ్యాటింగ్‌లోనూ కొన్ని పరుగులు రాబట్టాడు.

# చావోరేవో



మహిళల వన్డే ప్రపంచకప్‌లో ఇప్పటికే మూడు సెమీస్ బెర్తులు ఖరారైపోయాయి. మిగిలిన ఏకైక బెర్తు మీద కన్నేసిన భారత జట్టు.. గురువారం కీలక పోరుకు సిద్ధమైంది. సెమీస్ అవకాశాలు సంక్లిష్టం కాకూడదంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన.. న్యూజిలాండ్‌ను ఢీకొనబోతోంది. వన్డే ప్రపంచకప్‌ను రెండు విజయాలతో ఘనంగా ఆరంభించి.. ఆ తర్వాత గాడి తప్పి, మూడు ఓటములు చవిచూసిన భారత మహిళల జట్టు.. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రదర్శన చేయకపోతే కష్టమే.

స్మృతిమహిళల వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టు కీలక సమరానికి సిద్ధమైంది. 5 మ్యాచ్‌లు ఆడి 4 పాయింట్లే సాధించిన భారత్.. తనతో సమాన స్థితిలో ఉన్న న్యూజిలాండ్‌ను గురువారం ఢీకొనబోతోంది. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లతో చివరి మూడు మ్యాచ్‌ల్లో గెలిచేందుకు మంచి అవకాశాలు వచ్చినా.. సద్వినియోగం చేసుకోలేక ఓటమి చవిచూసింది హర్మన్‌సేన. బాగా ఆడి కూడా, అవకాశాలను ఉపయోగించుకోలేక చేజేతులా ఓడిన భారత్.. ఇంకోసారి అలాంటి తప్పులే చేస్తే సొంతగడ్డపై జరుగుతున్న ప్రపంచకప్‌లో సెమీస్ చేరడం కష్టమవుతుంది. ఈ మ్యాచ్ ఓడినా, భారత్‌కు ఛాన్స్ ఉంటుంది కానీ.. అందుకు వేరే సమీకరణాలు కలిసి రావాలి. కివీస్‌ను ఓడిస్తే.. చివరి మ్యాచ్‌లో బలహీన బంగ్లాదేశ్‌పై గెలిచి ఏ ఇబ్బందీ లేకుండా ముందంజ వేయడానికి అవకాశముంటుంది.వీళ్లతో జాగ్రత్త: ప్రధాన బ్యాటర్లు స్మృతి, హర్మన్ ఫామ్ అందుకోవడం.. ప్రతీక, హర్లీన్, దీప్తి, రిచా కూడా లయలోనే ఉండడం భారత్‌కు సానుకూలాంశం. అయితే ఫినిషింగ్‌లో భారత్ ఇబ్బంది పడుతోంది. బౌలింగ్ పరంగా కీలక సమయాల్లో వికెట్లు తీయడం, పరుగులు కట్టడి చేయడంలో తడబడుతోంది. ఈ లోపంతోనే వరుసగా మూడు మ్యాచ్‌లు ఓడింది. చావోరేవో అనదగ్గ ఈ మ్యాచ్‌లో స్పిన్నర్లు దీప్తి, శ్రీచరణిలపై భారత్ ఎన్నో ఆశలతో ఉంది. ప్రత్యర్థి జట్టుకు ఆల్‌రౌండర్లు అమేలియా కెర్, సోఫీ డివైన్ కీలకం. వీరితో పాటు సుజీ బేట్స్, బ్రూక్ హాలిడే, జెస్ కెర్ కూడా సత్తా చాటుతారని కివీస్ ఆశిస్తోంది.

బౌలరా.. బ్యాటరా.. ఆల్‌రౌండరా?: ముందు మ్యాచ్‌ల్లో ఆరో బౌలర్ లేని లోటు కనిపించడంతో ఇంగ్లాండ్‌పై బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్‌ను తప్పించి, పేసర్ రేణుక సింగ్‌ను ఆడించింది భారత్. కానీ ఈ నిర్ణయం పెద్దగా ఫలితాన్నివ్వలేదు. రేణుక పొదుపుగా బౌలింగ్ చేసినా, వికెట్ తీయలేకపోయింది. మరోవైపు బ్యాటింగ్‌లో జెమీమా లేని లోటు కనిపించింది. మరి కివీస్‌పై ఈ ఇద్దరిలో ఎవరిని ఆడిస్తారో చూడాలి. బ్యాటింగ్ కూడా చేయగల స్పిన్నర్ రాధ యాదవ్‌ను ఆడించే అవకాశాన్ని కొట్టిపారేయలేం. ఇంతకుమించి జట్టులో మార్పులేమీ ఉండకపోవచ్చు.

పిచ్‌ముంబయిలోని డీవై పాటిల్ స్టేడియం బ్యాటింగ్‌కు అనుకూలం. స్పిన్నర్ల ప్రభావం ఉంటుంది. మ్యాచ్‌కు కొంతమేర వర్షం ముప్పు ఉంది.తుది జట్లు (అంచనా)

భారత్: స్మృతి, ప్రతీక, హర్లీన్, హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), దీప్తి, రిచా, స్నేహ్, అమన్‌జ్యోత్, జెమీమా/రేణుక, శ్రీచరణి, క్రాంతిబీ న్యూజిలాండ్: సుజీ బేట్స్, జార్జియా ప్లిమ్మర్, అమేలియా కెర్, సోఫీ డివైన్, బ్రూక్ హాలిడే, మ్యాడీ గ్రీన్, ఇసబెల్లా, జెస్



# వ్యవస్థను కాపాడే వారే జర్నలిస్టులు : ఎంపీ ఈటెల రాజేందర్

ఎల్బీనగర్, అక్టోబర్ 23 (భారత శక్తి): టీయూడబ్ల్యూజే ఐజేయు ఆధ్వర్యంలో జర్నలిస్టుల మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న ఎంపీ ఈటెల రాజేందర్. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, జర్నలిస్టులకు బయటికి వెళ్లినప్పుడు అత్యంత గౌరవం ఉంటుంది. కానీ ఇంటి ఖర్చులకు కూడా డబ్బులు లేని పరిస్థితిలో చాలా మంది ఉంటారు. వెండి తెర మీద మెరుపుల జీవితాలు ఎలా కనిపిస్తాయో..జర్నలిస్టుల జీవితాలు కూడా అంతే. వ్యవస్థను కాపాడటంలో జర్నలిస్టుల పాత్ర మరువలేనిది. కలాన్ని నమ్ముకుని సమాజానికి ఏదో చేయాలని తపన ఉన్నవారు జర్నలిస్టులు. మేధాసంపత్తి కలవారు చాలా మంది పీహెచ్డీలు, ఎంసీజేలు చేసి ఈ వృత్తిని నమ్ముకొని ఉన్నారు.ఇంటి జాగ కావాలని కోరుతున్నారు. కానీ ప్రభుత్వాలు మాట ఇస్తున్నాయి తప్ప నిలబెట్టుకోవడం లేదు.నేను ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇచ్చాము సంక్షేమం కోసం నిధులు కేటాయించాము...కానీ అది మూన్నాళ్ళ ముచ్చటే అయింది. జర్నలిస్టు హెల్త్ కార్డులు ఉన్నా వారికి వైద్య చికిత్స మాత్రం






అందడం లేదు. ప్రభుత్వం వెంటనే సంపూర్ణ చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని ఈ వేదిక మీద నుండి డిమాండ్ చేస్తున్నా. ఇంటిలిజెన్స్ వ్యవస్థ కంటే ఎక్కువ సమాచారం మన జర్నలిస్టుల దగ్గర ఉంటుంది.. కానీ అవన్నీ వారు రాయడం లేదు.తెలంగాణ రాష్ట్రంలో మూడు లక్షల కోట్ల రూపాయల బడ్జెట్ పెడుతున్నారు..కానీ ఆరోగ్యశ్రీ కోసం 1100 కోట్ల రూపాయలు ఖర్చు పెట్టలేక పోతున్నారు. జర్నలిస్టులు హెల్త్ కార్డులు పట్టుకుని హాస్పిటల్ కి వెళ్తే అవమానకరంగా బయటకి వెళ్లగొడుతున్నారు. ప్రభుత్వ సొమ్ము దోచుకొని పోయే వాళ్లు దోచుకుంటున్నారు.ఈ పేద జర్నలిస్టులు ఇబ్బంది పడితే మంచిది కాదు. నాలుగవ స్థంభం అయిన జర్నలిస్టులు స్వేచ్ఛగా పనిచేసుకొనే పరిస్థితి కల్పించాలి. జర్నలిస్టులకు హెల్త్ క్యాంప్ నిర్వహించిన లిఖిత డయాగ్నొస్టిక్స్ యాజమాన్యం ఏవి నాయుడు, డాక్టర్ శ్రీధర్ రెడ్డి, సిబ్బందికి ధన్యవాదములు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, జర్నలిస్ట్ నాయకులు విరాహత్ అలీ, మేకల సత్యనారాయణ, నరసింహ, శేఖర్, ప్రవీణ్ కుమార్, సురేందర్, సాక్షి శ్యామ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా,మల్ రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్లు నరసింహ గుప్తా,సీఐ సైదులు,కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బద్దూరి వెంకటేశ్వర రెడ్డి, తోకల శ్రీనివాస రెడ్డి, బీజేపీ నాయకులు సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ప్రవీణ్ కుమార్

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి): ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యునిగా ఎల్బీనగర్ కు చెందిన సీనియర్ పాత్రికేయులు, టీయూడబ్ల్యూజే సీనియర్ నాయకులు టి.ప్రవీణ్ కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.పలువురు జర్నలిస్టులు, యూనియన్ నాయకులు, శ్రేయోభిలాషులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



**భగత్ సింగ్ నగర్ లో సరూర్ నగర్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టి హెల్మెట్, లైసెన్స్, ఇన్సూరెన్స్ లేని 8 వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ వాహన తనిఖీ సీఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో సెక్టార్ ఎస్ఐ మహేందర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.**

**ఎల్బీనగర్, అక్టోబర్ 23 (భారత శక్తి):**




## ఏపూరు లో మహిళ హత్యకు కారణం... కొడుకులే

* **హత్యకు దారితీసిన అక్రమ సంబంధం**
* **హత్య కేసులో నింధితుల అరెస్టు**
* **కన్న కొడుకులే నిందితులుగా తేల్చిన పోలీసులు**
* **వివరాలు వెల్లడించిన డిఎస్పి ప్రసన్న కుమార్**



సూర్యాపేట, అక్టోబర్ 23 (భారత శక్తి ప్రతినిధి): ఇటీవల ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలో మహిళ హత్య జరిగిన సంఘటన కలకలం రేపిన సంగతి ఈ కేసులో ఆ మహిళ హత్యకు కారకులు ఆమె సొంత కొడుకు లేనని పోలీసులు తేల్చి చెప్పారు.ఏపూర్ గ్రామానికి చెందిన కొరివి బిక్షమమ్మ వయసు (40) హత్యకు అక్రమ సంబంధమే కారణమని డిఎస్పి ప్రసన్నకుమార్ పేర్కొన్నారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆమె గత మూడు సంవత్సరాలుగా వేరే గ్రామానికి చెందిన వ్యక్తితో అక్రమం కలిగి ఉండటంతో భర్త కొరివి మల్లయ్య కుటుంబ సభ్యులు ఆమెను ప్రవర్తన మార్చుకోమని పలుమార్లు హెచ్చరించారు.వారు చెప్పిన మాటలు లెక్కచేయకుండా అదే విధంగా తన యొక్క అక్రమ సంబంధం కొనసాగిస్తుండడంతో తన యొక్క చిన్న కొడుకు పెళ్లి సంబంధాలు రావడం లేదని ఊరిలో పరువు పోతుందని భావించి అందుకు అతని భార్య బిక్షమమ్మ ను చంపేస్తే తప్ప మరొక మార్గం లేదని భావించి తన యొక్క ఇద్దరు కొడుకులు కొరివి ప్రవీణ్, కొరివి భరత్ తో చర్చించి తన అన్న కొడుకు కొరివి మహేష్ అతని ఫ్రెండ్స్ వంశి, జనార్దన్ లు అందరు కలిసి ఒక పథకం వేసుకొని అక్టోబర్ 21వ తారీఖున ఉదయం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీకి సదరు కొరివి బిక్షమమ్మ వచ్చి మధ్యాహ్నం తిరిగి ఇంటికి వెళుతున్న మార్గ మధ్యలో ముందుగా అనుకున్న ప్రకారం జనార్ధన్ బైక్ మీద వచ్చి శ్రీరాములు ఇంటి ముందు ఆమెను అడ్డగించి వెంటనే మహేష్ కు ఫోన్ ద్వారా తెలుపగా మహేష్ వంశీయులు కారులో వచ్చి మహేష్ తన వద్ద ఉన్న కత్తితో గొంతు కోసి మీద పొడవుగా వంశీ కూడా తన వద్ద ఉన్న కత్తితో ఆమెను చాతి మీద వీపున పొడిచి అక్కడి నుండి ముగ్గురు పారిపోయారు.ఈ హత్య కేసు గాలింపు భాగంగా గురువారం సూర్యాపేట పట్టణం లో హైటెక్ బస్టాండ్ ముందు కారు అడ్డ వద్ద ఐదుగురు నిందితులను పట్టుకున్నారు.ఇట్టి కేసు ఎస్పీ పర్యవేక్షణ లో డిఎస్పి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో పరిశోధనాధికారి రూరల్ సీఐ రాజశేఖర్, ఆత్మకూర్ ఎస్సై శ్రీకాంత్,చివ్వేంల ఎస్ఐ మహేష్, ఆత్మకూర్,చివ్వేంల సిబ్బందిని అభినందించారు. నిందితుల వద్ద నుండి ఒక కారు,మూడు ద్విచక్ర వాహనాలు,ఒక ఆటో,5 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడి చేసిన నిందితులను రిమాండ్ కు తరలించారు. పరారిలో ఉన్న మరో నిందితుడి కొరివి మహేష్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

## పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా
# నిర్మల్ పోలీసుల సరికొత్త ప్రయత్నం





ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, అక్టోబర్ 23 (భారత శక్తి):నిర్మల్ జిల్లాకు చెందిన పోలీస్ కుటుంబంలో జన్మించిన నవీన్ స్థాపించబడిన నవీన్ గోల్డ్ & బ్రదర్స్ వారు ఒక్కో విద్యార్థికి చదువులకు ఉపయోగపడేలా 10,000 రూపాయల సహాయం చేయడానికి సామాజిక బాధ్యతగా ముందుకు వచ్చారు.పోలీస్ అమరవీరుల స్మారక దినం" వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా, ఈరోజు నిర్మల్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో "జిల్లాలోని హోం గార్డు కుటుంబాలకు చెందిన ప్రతిభావంతులైన *20* మంది విద్యార్థులకు, గతంలో చనిపోయిన హోం గార్డుల యొక్క ప్రతిభావంతులైన పిల్లలకి,ఒక్కొక్కరికి 10,000/ రూపాయల విలువైన చెక్కులను జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల ఐపీఎస్* ఆధ్వర్యంలో, నవీన్ జ్యువెలర్స్ యాజమాన్యం* వారు అందజేశారు. ఇందులో జాదవ్ దివ్య అనే విద్యార్థినీ NEET లో 485 మార్కులు సంపాదించి, ప్రస్తుతం MBBS చదువుతుంది.ఆర్.లావణ్య అనే విద్యార్థినీ ఇంటర్మీడియట్ లో గ్రేడ్ A సంపాదించి ఐఐటి మొదటి సంవత్సరం చదువుతుంది. ఇంకొక విద్యార్థిని మెంగ అనన్య 8 వ తరగతి లో Center of excellency సీటు సంపాదించింది. ఆరుగురు విద్యార్థులు ఇంటర్మీడియట్ లో ఉత్తమ ప్రతిభ కనబరిచి, ప్రస్తుతం BTech చదువుతున్నారు.ఒకరు LLB, ఒకరు ఫార్మసీ,ఒకరు డిగ్రీ, 8 మంది విద్యార్థులు SSC లో మెరిట్ గ్రేడ్ సంపాదించి ఇంటర్ చదువుతున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మా "పోలీస్ డిపార్ట్మెంట్ లో కూడా పేద కుటుంబాలకు చెందిన సిబ్బంది ఉన్నారు. వారిలో చాలా మంది పిల్లలు ప్రతిభావంతులు, కష్టపడి చదువుకుంటున్నారు. అలాంటి పిల్లల ప్రతిభను గుర్తించి, వారు ఉన్నత విద్యలో మరింత రాణించేందుకు ఈ ప్రోత్సాహాన్ని ఇవ్వడం జరిగింది.వారి తల్లిదండ్రులు ప్రజల భద్రత కోసం రాత్రింబగళ్లు కష్టపడుతుంటే, ఆ కుటుంబాల పిల్లలకు ఈ ఆర్థిక సహాయం ద్వారా మనం చిన్న సాయం చేసినా, అది వారి భవిష్యత్తు నిర్మాణానికి దోహదం చేస్తుందని తెలిపారు.ఈ గొప్ప ఆలోచనతో ముందుకు వచ్చి, పేద పోలీస్ కుటుంబాల పిల్లలకు ఆర్థిక సహాయం చేసిన నవీన్ జ్యూవెలర్స్ యాజమాన్యానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను అని తెలియ జేశారు. నవీన్ జ్యువెలర్స్ యజమాని మాట్లాడుతూ "నేను ఒక పోలీస్ కుటుంబానికి చెందిన వ్యక్తిని. చిన్నప్పటి నుండి పోలీస్ వాతావరణంలో పెరిగిన కారణంగా, మా పోలీస్ సిబ్బంది — కానిస్టేబుళ్లు, హోం గార్డులు — ఎదుర్కొనే కష్టాలు, బాధలు నాకు బాగా తెలుసు. అందుకే మా పోలీసులు కుటుంబాల పిల్లలను ప్రోత్సహించాలనే ఆలోచనతో, జిల్లా ఎస్పీ మేడం గారితో చర్చించి ఈ ఆలోచనను అమలు చేశాను అని తెలియ జేశారు. ఈ సందర్భంలో పోలీస్ పిల్లల్లో ఒకరు మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎవ్వరు కూడా మాకు ఇలాంటి సహాయం చేయలేదు, ఎస్పీ మేడం గారికి ఇంత గొప్ప ఆలోచన రావడం చాలా సంతోష కరమైన విషయం అని, "ఈ ప్రోత్సాహం మాకు ఎంతో ఆత్మవిశ్వాసం కలిగిస్తోంది. మా తల్లిదండ్రుల త్యాగం వృథా కాకుండా చదువులో మెరుగుపడేందుకు కృషి చేస్తాం" అన్నారు. మాకు ఈ ఆర్థిక సహాయం చేసిన జిల్లా ఎస్పీ మేడం గారికి, నవీన్ జ్యూవెలర్స్ యాజమాన్యానికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాము. అని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల తో పాటు,నవీన్ జ్యూవెలర్స్ యాజమాన్యం ప్రతినిధులు, పోలీస్ అధికారులు, సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గీతంలో ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

* **పలు ఆహ్లాదకర పోటీలలో పాల్గొన్న విద్యార్థులు**

సంగారెడ్డి, అక్టోబర్ 23(భారత శక్తి ప్రతినిధి) : ఆరోగ్యం, స్థిరత్వం, ప్రపంచ సామరస్యాన్ని ప్రోత్సహించడంలో ఆహారం యొక్క కీలక పాత్ర గురించి అవగాహన పెంచే లక్ష్యంతో హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం ప్రపంచ ఆహార దినోత్సవం2025ను ఘనంగా నిర్వహించారు. ప్రజలు, భూగోళాన్ని ఏకం చేసే ఆహారం యొక్క శక్తి ఇతివృత్తంగా ఈ కార్యక్రమాన్ని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ లోని లైఫ్ సైన్సెస్ విభాగం ఏర్పాటు చేసింది. ఈ వేడుకల ప్రారంభోత్సవంలో గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోతాహర్ రెజా, లైఫ్ సైన్సెస్ విభాగం అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న పలు కార్యక్రమాలు, పోటీలలో విద్యార్థులు చురుకుగా పాల్గొని, విలువైన అనుభవాన్ని పొందాలని వారు విద్యార్థులను ప్రోత్సహించారు. జ్ఞానాన్ని పంచుకోవడం, సృజనాత్మకత, ఉత్సాహంగా సాగిన ఈ వేడుకలను, సమాచారం, వినోదంతో నిండిన కార్యకలాపాల మేలు కలయికగా రూపొందించారు. ఈ సందర్భంగా పోస్టర్ ప్రెజెంటేషన్, ఆహార కల్తీని గుర్తించే ప్రదర్శన, ఆహార శుద్ధి నమూనాలు, పోషకాహారంపై అవగాహన, వ్యర్థాల నుంచి వినియోగంలోకి, ఆహారనిజాలు, అపోహలు వంటి చైతన్యపరచే కార్యక్రమాలలో పాల్గొన్న వారికి ఆహార భద్రత, పోషకాహారం, స్థిరత్వంపై ఆచరణాత్మక, లోతైన అవగాహనను కల్పించాయి.



# తెలంగాణ కేబినెట్ కీలక నిర్ణయం.. స్థానిక ఎన్నికల్లో ఇద్దరు పిల్లల నిబంధన రద్దు

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తెలంగాణ ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఇద్దరి కన్నా ఎక్కువ పిల్లలు ఉన్నవారు ఎన్నికల్లో పోటీకి అనర్హులు అనే నిబంధనను రద్దు చేయాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు ఆమోదముద్ర వేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఈ నిబంధన వల్ల ఇద్దరి కన్నా ఎక్కువ సంతానం ఉన్న అనేక మంది ఆశావహులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాన్ని కోల్పోతున్నారు. ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, ఈ నిబంధనను తొలగించాలని తీర్మానించింది. ఈ



నిర్ణయాన్ని వేగంగా అమలులోకి తెచ్చేందుకు ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీ చేయనుంది. ఈ ఆర్డినెన్స్ ద్వారా తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం2018తో పాటు, మున్సిపల్ చట్టాల్లోనూ అవసరమైన సవరణలు చేయనున్నారు. ముఖ్యంగా, పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 21(3)ను పూర్తిగా తొలగించాలని కేబినెట్ స్పష్టం చేసింది. ప్రభుత్వ నిర్ణయం ప్రజాస్వామ్య స్ఫూర్తిని బలోపేతం చేస్తుందని, మరింత మందికి ప్రజాప్రతినిధులుగా పనిచేసే అవకాశం కల్పిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఈ సవరణలు పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.

## హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన.. స్తంభించిన జనజీవనం

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి) : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను గురువారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. ఉరుములు, మెరుపులతో కూడిన కుండపోత వాన కారణంగా నగర జీవనం ఒక్కసారిగా స్తంభించిపోయింది. పలు ప్రధాన రహదారులన్నీ జలమయమై, కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోవడంతో కార్యాలయాల నుంచి ఇళ్లకు వెళ్లే ఉద్యోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరంలోని అల్వాల్, శామీర్‌పేట్, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సనత్‌నగర్, ఎర్రగడ్డ సహా అనేక ప్రాంతాల్లో ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. రోడ్లపై వర్షపు నీరు భారీగా చేరడంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయి, నగరంలో తీవ్రమైన ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. మరో గంట వ్యవధిలో ఉప్పల్, తార్నాక, సికింద్రాబాద్, హిమాయత్‌నగర్, ఖైరతాబాద్, బేగంపేట్, మాదాపూర్, మియాపూర్, హైటెక్ సిటీ, శేర్లింగంపల్లి వంటి ప్రాంతాల్లో కూడా భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. వాతావరణ శాఖ హెచ్చరికలతో హైదరాబాద్ నగర పోలీసులు కూడా స్పందించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రయాణాల్లో ఉన్నవారు సురక్షిత ప్రాంతాల్లో వేచి ఉండాలని, ట్రాఫిక్‌లో చిక్కుకోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని సూచించారు. తెలంగాణ వ్యాప్తంగా నెలకొన్న వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు వాతావరణ శాఖ అప్‌డేట్‌లను గమనిస్తూ ఉండాలని అధికారులు తెలిపారు.

## నవంబర్ 1 నుంచి కొత్త నామినేషన్ రూల్స్.. మారనున్న బ్యాంకు నిబంధనలు

బ్యాంకు ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. డిపాజిట్ ఖాతాలు, సేఫ్టీ లాకర్లకు సంబంధించిన నామినేషన్ సౌకర్యాలలో కీలక మార్పులు తీసుకువచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం, ఖాతాదారులు ఇకపై ఒకరికి బదులుగా గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా నియమించుకోవచ్చు. ఈ కొత్త విధానం నవంబర్ 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తుందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. బ్యాంకింగ్ చట్టాల (సవరణ) చట్టం 2025లో భాగంగా ఈ కొత్త నిబంధనలను ప్రవేశపెట్టారు. దీని ప్రకారం బ్యాంకు డిపాజిట్లకు నామినీలను రెండు విధాలుగా నియమించుకునే అవకాశం కల్పించారు. ఖాతాదారులు తమకు నచ్చిన విధంగా నలుగురు నామినీలకు ఒకేసారి లేదా ఒకరి తర్వాత మరొకరికి ప్రయోజనం అందేలా ఎంచుకోవచ్చు. అయితే, బ్యాంకుల్లోని సేఫ్ కస్టడీ వస్తువులకు, సేఫ్టీ లాకర్లకు మాత్రం ఒకరి తర్వాత మరొకరు అనే పద్ధతిలోనే నామినేషన్ చేసుకునేందుకు అనుమతి ఉంటుంది. ఈ కొత్త విధానంలో మరో ముఖ్యమైన సౌలభ్యం కూడా ఉంది. నలుగురు నామినీలను ఎంచుకున్నప్పుడు, ఎవరికి ఎంత వాటా (శాతం) చెందాలో కూడా ఖాతాదారులే ముందుగా నిర్దేశించవచ్చు. అయితే, మొత్తం వాటాలన్నీ కలిపి 100 శాతానికి సమానంగా ఉండాలి. ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో క్లెయిమ్ సెటిల్‌మెంట్లు చాలా సులభంగా, పారదర్శకంగా పూర్తవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడటం, కస్టమర్లకు సౌకర్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు చేసినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. బ్యాంకింగ్ చట్టాల సవరణ చట్టంలోని సెక్షన్లు 10, 11, 12, 13.. నవంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయని కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ నిబంధనలను అన్ని బ్యాంకుల్లో ఒకే విధంగా అమలు చేయడానికి అవసరమైన 'బ్యాంకింగ్ కంపెనీల (నామినేషన్) నిబంధనలు2025'ను, సంబంధిత ఫారాలను త్వరలోనే విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు.



## ఓటింగ్ ఇక మరింత సులభం!

* **ఓటర్ స్లిప్‌లపై మరింత స్పష్టంగా వివరాలు**
* **జిల్లా ఎన్నికల అధికారి జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్**

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి) : ఓటర్లకు మరింత సౌకర్యం కల్పించే దిశగా భారత ఎన్నికల సంఘం ఓటింగ్ ప్రక్రియను మరింత సులభతరం, పారదర్శకంగా మార్చే కొత్త చర్యకు నాంది పలికింది. ఇకపై ఓటర్ స్లిప్‌లలో ఓటర్ల సీరియల్ నంబర్ ,పార్ట్ నంబర్ ను పెద్ద అక్షరాలతో, స్పష్టంగా చదవడానికి వీలుగా ముంద్రించనున్నారు. ఈ కొత్త కార్యక్రమం ద్వారా పోలింగ్ కేంద్రాల్లో గందరగోళం తగ్గి, ప్రతి ఓటరు తాము ఉన్న ఓటర్ల జాబితాలోని వివరాలను త్వరగా గుర్తిస్తారని జిల్లా ఎన్నికల అధికారి , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ తెలిపారు. ఓటింగ్‌ను మరింత సులభంగా , పారదర్శకంగా మార్చే లక్ష్యంతో భారత ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. జూబ్లీ హిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక తో ఈ విధానం తెలంగాణ లో అమల్లోకి రానుంది.

## కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్ కు టికెట్ ఇచ్చింది.. చిత్తుగా ఓడించండి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న తరుణంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఒక రౌడీ షీటర్‌కు టికెట్ ఇచ్చిందని తీవ్రంగా ఆరోపించిన ఆయన, విజ్ఞులైన జూబ్లీహిల్స్ ప్రజలు అతడిని చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నిక హైదరాబాద్ నగర ప్రజల తెలివితేటలకు, విజ్ఞతకు ఒక కఠిన పరీక్షగా నిలుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల సన్నాహక సమావేశంలో కార్యకర్తలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. "కాంగ్రెస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం గుల్లగా మారింది. శాంతిభద్రతలకు మారుపేరైన హైదరాబాద్‌లో ప్రశాంత వాతావరణం కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలి. మా పదేళ్ల పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలన్నీ కాంగ్రెస్ వచ్చాక కనుమరుగయ్యాయి" అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ దుష్టపాలన గురించి ప్రజలకు మరింతగా వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ ఉప ఎన్నిక ఫలితం రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికలపై తీవ్ర ప్రభావం చూపుతుందని కేసీఆర్ జోస్యం చెప్పారు. "జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ గెలిస్తే, ఆ గెలుపు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కొనసాగుతుంది. ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారనే సంకేతాలు వెళతాయి. ఈ ఉప ఎన్నికలో మన విజయం ఖాయం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జూబ్లీహిల్స్ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ తరఫున మాగంటి సునీత, కాంగ్రెస్ నుంచి నవీన్ యాదవ్, బీజేపీ అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు. నవంబర్ 11న పోలింగ్ జరగనుండగా, నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

## టెక్ హబ్‌గా ఏపీ, ఇంధన రంగంలో అపార అవకాశాలు...

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి): ఆంధ్రప్రదేశ్‌ను పెట్టుబడులకు స్వర్గధామంగా మార్చే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు తన యూఏఈ పర్యటనను వేగవంతం చేశారు. పర్యటనలో భాగంగా రెండో రోజైన గురువారం, అబుదాబిలో ఇంధన, టెక్నాలజీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులతో ఆయన సమావేశమయ్యారు. రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ భేటీలు జరిగాయి. ముఖ్యంగా, అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఏడీఎన్ఓసీ) ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. దక్షిణాసియాకు చేరువగా సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్... ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు అత్యంత అనుకూలమని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ రంగంలో పెట్టుబడులకు ఏపీలో విస్తృతంగా అవకాశాలు ఉన్నాయని అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ ప్రతినిధులకు వివరించారు. యూఏఈ పర్యటనలో భాగంగా రెండో రోజు గురువారం అబుదాబీలో అల్ మైరాహ్ ఐలాండ్‌లోని ఏడీజీఎ స్క్వేర్‌లో ఏడీఎన్ఓసీ గ్లోబల్ ట్రేడింగ్ ప్రతినిధి అహ్మద్ బిన్ తలిత్‌తో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఈ భేటీలో పెట్రోకెమికల్, ఇంధన, ఎల్ఎన్‌జీ, గ్యాస్ ప్రాసెసింగ్, పోర్ట్ లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో అవకాశాలు గురించి చర్చించారు. కృష్ణపట్నం, మచిలీపట్నం, రామాయపట్నం, కాకినాడ వంటి పోర్టుల సమీపంలో పెట్రో కెమికల్, ఎనర్జీ రంగాల పెట్టుబడులకు అనువుగా ఉంటాయని సీఎం అన్నారు. ఏడీఎన్ఓసీ ఆంధ్రప్రదేశ్ మధ్య సాంకేతిక సహకారం పైనా స్పష్టమైన రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలని భేటీలో ఇరువురు నిర్ణయించారు.

* **అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్‌తోనూ భేటీ**



అబుదాబీ చాంబర్ ఆఫ్ కామర్స్ చైర్మన్ అహ్మద్ జాసిమ్ అల్ జాబీతో, జీ 42 సీఈఓ మాన్సూర్ అల్ మాన్సూరీతోనూ ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ పయనిస్తోందని, రాజధాని అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సేవలు జనవరి నుంచి అందుబాటులోకి వస్తున్నాయని సీఎం తెలిపారు. కొత్త అవకాశాలకు, ఇన్నోవేషన్‌కు అమరావతి కేంద్రంగా ఉంటుందన్నారు. విశాఖలో నవంబర్ 14, 15 తేదీల్లో జరిగే భాగస్వామ్య సదస్సుకు రావాలని ఈ సందర్భంగా వారిని సీఎం ఆహ్వానించారు. కృత్రిమ మేధస్సు, క్లౌడ్ కంప్యూటింగ్, హెల్త్‌టెక్ రంగాల్లో నూతన ఆవిష్కరణలపై పనిచేస్తున్న జీ 42 ఇంటర్నేషనల్ సంస్థను ఏఐ డేటా సెంటర్లు, ఇన్నోవేషన్ ల్యాబ్స్, స్మార్ట్ గవర్నెన్స్ టెక్నాలజీని రాష్ట్రంలో ఏర్పాటు చేసేందుకు స్వాగతించారు.

* **టెక్ కంపెనీ ప్రతినిధులతో నెట్వర్క్ లంచ్**

అనంతరం అబుదాబీలోని పారిశ్రామికవేత్తలతో ముఖ్యమంత్రి చంద్రబాబు బృందం నెట్వర్క్ లంచ్ సమావేశంలో పాల్గొంది. దీనిలో జీ 42 సీఈవో మనుకుమార్ జైన్, ఏడీఐసీ గ్లోబల్ హెడ్ లలిత్ అగర్వాల్, ఐహెచ్‌సీ సీఈవో అజయ్ భాటియా, డబ్ల్యుఐవో బ్యాంక్ సీఈవో జయేష్ పాటిల్, పాలిగాన్ మార్ఫిక్ సీఈవో జయంతి కనాని, ట్రక్కర్ సీఈవో గౌరవ్ బిశ్వాస్, పాలసీ బజార్ గ్రూప్ సీఈవో యశిష్ దహియా, ఇన్స్యూరెన్స్ మార్కెట్ సీఈవో అవినాష్, ఇన్సార్ట్స్ సీఈవో అజార్ ఇక్బాల్, జీఐఐ సీఈవో పంకజ్ గుప్తా, నూన్ సీఈవో ఫరాజ్ ఖలీద్, ఇన్సెప్షన్ సీఈవో ఆశీష్‌కోషి పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి టెక్ డెస్టినేషన్‌గా తీర్చిదిద్దే లక్ష్యాన్ని వారికి వివరించారు. రాష్ట్రంలో డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మెషిన్ లెర్నింగ్, ఫిన్ టెక్, హెల్త్ టెక్, క్లౌడ్ కంప్యూటింగ్, డిజిటల్ గవర్నెన్స్ వంటి రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలను సూచించారు. త్వరలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా ఏపీలో ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. యూఏఈలో టెక్నాలజీ ఆధారిత కంపెనీలతో సంయుక్త వర్కింగ్ గ్రూప్ ఏర్పాటు చేసి ఏపీలో భవిష్యత్ ప్రాజెక్టులను వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, టీజీ భరత్‌తో పాటు పరిశ్రమలశాఖ, ఈడీబీకి చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాకిస్థాన్‌లో హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై రగడ... ఎందుకీ వ్యతిరేకత?

పాకిస్తాన్, అక్టోబర్ 23: గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ (సర్వైకల్ క్యాన్సర్) మహమ్మారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక వ్యాక్సినేషన్ కార్యక్రమానికి తప్పుడు ప్రచారాలు పెద్ద అడ్డంకిగా మారాయి. వ్యాక్సిన్‌పై ప్రజల్లో నెలకొన్న అనుమానాలు, అపోహలను తొలగించేందుకు ఆ దేశ ఆరోగ్య శాఖ మంత్రి సయ్యద్ ముస్తఫా కమల్ అసాధారణ చర్య తీసుకున్నారు. స్వయంగా తన కుమార్తెను మీడియా ముందుకు తీసుకొచ్చి, బహిరంగంగా హెచ్‌పీవీ టీకా వేయించి ప్రజల్లో నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం చేశారు. పాకిస్థాన్‌లో గర్భాశయ క్యాన్సర్ కారణంగా ప్రతిరోజూ 8 మంది మహిళలు మరణిస్తున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) గణాంకాలు చెబుతున్నాయి. ఈ వ్యాధికి ప్రధాన కారణమైన హ్యూమన్ పాపిలోమావైరస్ (హెచ్‌పీవీ)ని నిరోధించేందుకు, పాక్ ప్రభుత్వం సెప్టెంబర్ 15న దేశవ్యాప్తంగా మెగా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించింది. మొదటి దశలో 9 నుంచి 14 ఏళ్లలోపు 1.3 కోట్ల మంది బాలికలకు టీకా వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే, కార్యక్రమం మొదలైన కొద్ది రోజులకే సోషల్ మీడియాలో నకిలీ వీడియోలు, వదంతులు వెల్లువెత్తాయి. ఈ వ్యాక్సిన్ వంధ్యత్వానికి కారణమవుతుందని, ఇది విదేశీ కుట్రలో భాగమని దుష్ప్రచారం ఊపందుకుంది. దీంతో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు టీకా వేయించేందుకు నిరాకరించారు. కొన్ని పాఠశాలలు కూడా ఆరోగ్య కార్యకర్తలను లోపలికి అనుమతించలేదు. ఈ ప్రతికూల పరిస్థితుల మధ్య, ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ కరాచీలో తన కుమార్తెకు టీకా వేయించారు. "ఈ వ్యాక్సిన్ సురక్షితమైనది, సమర్థవంతమైనది. మా ఆడపిల్లలను రక్షించుకోవడం చాలా ముఖ్యం. ఇలాంటి తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తీసుకున్న ఈ చర్య సత్ఫలితాలనిచ్చింది. ప్రజల్లో నెమ్మదిగా నమ్మకం పెరగడంతో, టీకా తీసుకునే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. దీంతో మొదట సెప్టెంబర్ 27తో ముగియాల్సిన కార్యక్రమాన్ని అక్టోబర్ 1 వరకు పొడిగించారు. సింధ్ ప్రావిన్స్ ఆరోగ్య మంత్రి డాక్టర్ అజ్రా ఫజల్ మాట్లాడుతూ, "అపోహలు తొలగిపోయాక, ప్రజలు స్వచ్ఛందంగా టీకా కేంద్రాలకు రావడం మొదలుపెట్టారు" అని తెలిపారు. ఇప్పటివరకు లక్ష్యంగా నిర్దేశించుకున్న 1.3 కోట్ల మందిలో 92 లక్షల మంది (78 శాతం) బాలికలకు వ్యాక్సినేషన్ పూర్తయింది. రాబోయే దశల్లో మిగతా ప్రావిన్సులలో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

## యువజన సాంస్కృతిక పోటీలు

కడప, అక్టోబర్ 23 (భారత శక్తి ప్రతినిధి): 20252026 సం. జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని జిల్లాస్థాయి యువజన సాంస్కృతిక పోటీలను స్థానిక రిమ్స్ రోడ్ లోని స్పిరిట్ డిగ్రీ కాలేజ్ నందు అక్టోబర్ 24 శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో 1.ఫోక్ డాన్స్ (గ్రూప్) 2.ఫోక్ సాంగ్ (గ్రూప్)3. స్టోరీ రైటింగ్ 4.పెయింటింగ్ 5.పోయెట్రీ 6.డిక్లమేషన్ 7.సైన్స్ మేళా వంటి వివిధ పోటీలు నిర్వహించి బహుమతుల ప్రధానం చేయనున్నారు. ఇందులో ఎంపికైన అభ్యర్థులను రాష్ట్ర,జాతీయస్థాయికి పంపనున్నామని స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

# సామాజిక అంశంగా మారిన పెన్షన్ దారుల సమస్యలు..

- ఆర్థిక భద్రత కోల్పోతున్న పెన్షన్ దారులు..
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుమిలిపోతున్న వేలమంది..
- ఆసరాగా ఉంటుందన్న పెన్షన్ నిరాశను మిగిలిస్తోంది..
- దాదాపు 30 సంవత్సరాలు ప్రభుత్వానికి ప్రజలకు సేవ..
- విశ్రాంతి తీసుకోవాల్సిన తరుణంలో ఇబ్బందులు పడుతున్నవైనం..
- ఒక్కోసారి నెలల తరబడి పెన్షన్ అందడం లేదంటున్న బాధితులు..
- స్వయంగా ముఖ్యమంత్రి నిధులు లేవని చెప్పడం సిగ్గుచేటు..
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో విలవిల లాడిపోతున్న పెన్షన్ దారులు..
- పీ.ఆర్.సి. అమలులో కూడా జాప్యం జరుగుతోంది..
- ప్రభుత్వం స్పందించకపోతే ఆత్మహత్యే శరణం అంటున్న పెన్షన్ దారులు..
- పెన్షన్ దారుల తరపున న్యాయపోరాటం చేస్తామని హెచ్చరిస్తున్న " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "

**దాదాపు 35 సంవత్సరాలు ప్రభుత్వానికి ప్రజలకు సేవచేసిన ఒక ప్రభుత్వ ఉద్యోగి తాను రిటైర్ అవుతున్న రోజు ఒక పండుగలాగా జరుపుకుంటారు.. తోటి ఉద్యోగులు ఎంతో గౌరవంగా సన్మానించుకుంటారు.. గొప్పగా అతడు చేసిన సేవలను చెప్పకుంటారు.. ఎంతో ఆనందంగా ఇంటికి వస్తాడు.. శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని భావిస్తాడు.. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కాలం గడిపేస్తుంటారు.. అతనికి ప్రభుత్వం నుంచి రావాల్సిన గ్రాడ్యూటీ లాంటి పైకాన్ని తన వారసులకు అందించి గర్వంగా ఫీల్ అవుతాడు.. అంతా బాగానే ఉంది అనుకున్నంతలో నెలరోజులు తిరిగిపోతాయి.. విధుల్లో ఉన్నప్పుడు ఒకరోజు ఆటో, ఇటుగా వచ్చేది జీతం.. దాంతో తన కుటుంబ అవసరాలు తీరిపోయేవి.. కానీ ఇప్పుడు పెన్షన్ సకాలంలో అందకపోవడంతో ఊహించని ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తుంది.. ఖర్చులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి.. ఆ వయసులో ఏపనీ చెయ్యాలన్నా కష్టమే.. ఇలాంటి పరిస్థితుల్లో ఆ రిటైర్డ్ ఉద్యోగి ఏమి చేయగలడు..? ప్రభుత్వ నిర్లక్ష్యంతో కుదేలవుతున్న పెన్షనర్ల జీవితాలు ఎప్పుడు గాడిలో పడతాయి..?**




**(స్పెషల్ కరస్పాండెంట్)**

**హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి) :**
తెలంగాణ రాష్ట్రంలో పెన్షన్‌దారుల సమస్యలు ప్రస్తుతం ఒక ప్రధాన సామాజిక అంశంగా మారాయి. పెన్షన్ అనేది వృద్ధులు, వికలాంగులు, విధవలు, ఒంటరి మహిళలు వంటి బలహీన వర్గాలకు ఆర్థిక భద్రత ఇచ్చే పథకం. కానీ అమలు స్థాయిలో అనేక ఇబ్బందులు ఎ దురవుతున్నాయి.

*** పెన్షన్‌దారుల ఇబ్బందులు :**
పెన్షన్ అందడంలో ఎంతో జాప్యం జరుగుతోంది.. ప్రతీ నెలా 1వ తేదీకి రావాల్సిన పెన్షన్ చాలాసార్లు ఆలస్యంగా జమ అవుతోంది.

అంతేకాకుండా అర్హత ధృవీకరణలో ఎన్నెన్నో సమస్యలు ఎదురవుతున్నాయి.. కొత్త కొత్త సర్వేలు, ఆధార్ లింకింగ్, బయోమెట్రిక్ గుర్తింపులో లోపాల వల్ల కొందరి పేర్లు జాబితా నుంచి తొలగించబడ్డాయి. అంతే కాకుండా గ్రామ స్థాయిలో అవినీతి లేదా దుర్వినియోగం జరుగుతోంది.. వృద్ధులు లేదా వికలాంగులు గ్రామసభల వద్ద తిరగాల్సి వస్తోంది. కొందరు మధ్యవర్తులు లంచాలు డిమాండ్ చేస్తున్నారు.

అదే విధంగా పెన్షన్ మొత్తాలు తక్కువగా ఉండటం జరుగుతోంది.. ప్రస్తుత పెన్షన్ రేట్లు ద్రవ్యోల్బణం కంటే చాలా తక్కువగా ఉన్నాయి.. ఇక డిజిటల్ వ్యవస్థలో సమస్యలు విపరీతంగా ఎదురవుతున్నాయి.. ఈ కేవైసీ లేదా బయోమెట్రిక్ ఫెయిల్ అవడం వల్ల పేదవారికి ఆన్‌లైన్ సిస్టమ్ ఇబ్బంది కలిగిస్తోంది. ముఖ్యంగా కొత్త లబ్ధిదారుల జాబితాలో చేర్చడంలో ఆలస్యం జరుగుతోందనే ఫిర్యాదులు వస్తున్నాయి.. అర్హులైన చాలా మంది ఇంకా జాబితాలో లేకపోవడం ఆందోళన కలిగించే విషయం..

*** కొట్టొచ్చినట్లు కనిపిస్తున్న ప్రభుత్వ నిర్లక్ష్యం :**
నియమిత పర్యవేక్షణ లేకపోవడంతో ఎన్నెన్నో సమస్యలు ఎదురవుతున్నాయి.. అధికారులు లబ్ధిదారుల జాబితాను సమయానికి అప్‌డేట్ చేయడం లేదు. ఫీల్డ్ వెరిఫికేషన్ లో చాలా లోపాలు కనిపిస్తున్నాయి..

*** బడ్జెట్ కేటాయింపులలో జాప్యం :**
కొన్నిసార్లు రాష్ట్ర బడ్జెట్‌లో పెన్షన్ నిధుల కేటాయింపులు ఆలస్యమవుతున్నాయి. సమస్యల పరిష్కారానికి ఫిర్యాదు వ్యవస్థ బలహీనంగా ఉండటం మరో ప్రమాదకర వ్యవహారం.. లబ్ధిదారులకు సమర్థమైన గ్రీవెన్స్ మెకానిజం లేకపోవడం కూడా ఒక ప్రధాన సమస్యగా మారిపోయింది..

*** తీసుకోవాల్సిన చర్యలు :**
నిర్వహణలో పారదర్శకత ఉండాలి.. ప్రతి మండల/గ్రామం స్థాయిలో లబ్ధిదారుల జాబితా పబ్లిక్‌గా అందుబాటులో ఉండాలి. పెన్షన్ మొత్తాల పెంపు జరగాలి.. ద్రవ్యోల్బణం ప్రకారం పెన్షన్ మొత్తాన్ని పునఃసమీక్షించాలి. పీ.ఆర్.సి. తక్షణమే అమలుచేయాలి..

టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవడం అవసరం.. మొబైల్ యాప్ లేదా హెల్ప్‌లైన్ ద్వారా లబ్ధిదారులు తమ పెన్షన్ స్థితిని తెలుసుకోవచ్చు.

*** గ్రామ స్థాయి ఫిర్యాదు కేంద్రాలు :**
లబ్ధిదారులు నేరుగా ఫిర్యాదు చేయగల వ్యవస్థ ఏర్పాటు చేయాలి. వృద్ధులు, వికలాంగుల ప్రత్యేక సదస్సులు నిర్వహించాలి.. వారి సమస్యలు వ్యక్తిగతంగా వినే సమీక్షా సమావేశాలు నిర్వహించాలి. అలాగే సామాజిక పర్యవేక్షణ కమిటీలు నియమించాలి.. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎన్.జీ.ఓ. లు కలసి పెన్షన్ అమలు పర్యవేక్షించాలి.

*** ప్రత్యేక నిధి :**
ఆలస్యాలు నివారించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధిని సృష్టించవచ్చు. పెన్షన్ అనేది దయ కాదు.. ప్రభుత్వం దీనిని సక్రమంగా అమలు చేయాలి. సాంకేతిక, పరిపాలనా మార్పులతో పాటు మానవతా దృక్పథం అవసరం.

చివరగా ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి ఎప్పుడు విడనాడుతుంది ?

ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అవమానకర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు.

పెన్షన్ ఆమోదం అంటే కేవలం ఫైనాన్స్ శాఖ బాధ్యత మాత్రమే కాదు. సంబంధిత విభాగం, ఆడిట్, ట్రెజరీ, పెన్షన్ డైరెక్టరేట్ ఈ నాలుగు స్థాయిల సమన్వయం అవసరం. కానీ ఈ విభాగాల మధ్య సరైన సమాచార మార్పిడి లేకపోవడం వల్లే ఆలస్యం జరుగుతోంది. అనేక చోట్ల సిబ్బంది కొరత కూడా ప్రధాన కారణంగా మారింది.

అలాగే ఐ.ఎఫ్.ఎం.ఐ.ఎస్., హెచ్.ఆర్.ఎం.ఎస్. వంటి ఆన్‌లైన్ వ్యవస్థలు ఉన్నా, అవి సమర్థంగా పనిచేయకపోవడం పెద్ద సమస్య. డేటా అప్‌డేట్ కాకపోవడం, లాగిన్ సమస్యలు, సర్వర్ ఫెయిల్యూర్స్ వంటి సాంకేతిక లోపాలు పెన్షన్ ప్రాసెస్‌ను నెలల తరబడి నిలిపివేస్తున్నాయి. పెన్షన్ సింగిల్ విండో సిస్టమ్ ఏర్పాటు చేయాలి.. అన్ని దశలు ఒకే వేదికలో పూర్తి కావాలి. ఉద్యోగి రిటైర్మెంట్‌కి 3 నెలల ముందే పెన్షన్ ఫైల్ స్వయంచాలకంగా ప్రారంభం కావాలి. పెన్షనర్ తన ఫైల్ ఎక్కడ ఉందో తెలుసుకునే సౌకర్యం కల్పించాలి.

ప్రతి జిల్లాలో పెన్షనర్ల ఫిర్యాదుల పరిష్కార కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వృద్ధ పెన్షనర్లకు హెల్త్ కార్డ్, మెడికల్ బెనిఫిట్స్ సులభంగా అందేలా చూడాలి. పెన్షనర్ల సంఘాలు సక్రమంగా సమన్వయం చేసుకుంటూ తమ సమస్యలను ప్రభుత్వానికి వినిపించాలి. మీడియా, సోషల్ మీడియా వేదికల్లో ఈ సమస్యలను విస్తృతంగా ప్రస్తావించడం ద్వారా ప్రజా మద్దతు పొందాలి.



జీవితమంతా ప్రభుత్వ సేవలో నిబద్ధతతో పనిచేసి, పదవీ విరమణ తర్వాత ప్రశాంత జీవితాన్ని ఆశించే వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులు ఇప్పుడు పెన్షన్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణలో ఈ పరిస్థితి రోజు రోజుకు తీవ్రమవుతోంది.

ఉద్యోగ విరమణ అయిన నెలల తరబడి పెన్షన్ ఖాతాల్లో జమ కావడం లేదు. కొన్ని సందర్భాల్లో పెన్షన్ పేపర్లు, సర్వీస్ రికార్డులు, లాస్ట్ పే సర్టిఫికేట్‌లు ట్రెజరీ లేదా డిపార్ట్మెంట్ కార్యాలయాల్లో నెలల తరబడి అటకెక్కిపోతున్నాయి. సాంకేతిక వ్యవస్థలు ఉన్నా సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల రిటైర్డ్ ఉద్యోగులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ...


పెన్షన్ దారులు చెబుతున్న మాట ఏమిటంటే పెన్షన్ అనేది దాతృత్వం కాదు.. అది సేవ చేసిన ప్రతి ఉద్యోగి హక్కు. ప్రభుత్వ నిర్లక్ష్యం, సాంకేతిక లోపాలు, సమన్వయ లోపం వంటి కారణాలతో ఈ హక్కు వాయిదా పడడం ప్రజాస్వామ్యానికి తగదు. ప్రభుత్వ యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకుని పెన్షనర్ల వ్యధకు ముగింపు పలకాలని ఆశిస్తోంది " ఫోరం ఫార్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ "..



## బియు, సియు, వివి ప్యాట్ల అనుసంధాన ప్రక్రియ విధానం పరిశీలన...

*** కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు..**

హైదరాబాద్, అక్టోబర్ 23 (భారత శక్తి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక నేపథ్యంలో జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ పన్వర్ హాల్ లో గురువారం శిక్షణ, అవగాహన కోసం ఉద్దేశించిన బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వివి ప్యాట్ల అనుసంధాన ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు రంజిత్ కుమార్ సింగ్, పోలీస్ పరిశీలకులు ఓం ప్రకాశ్ త్రిపాఠి, వ్యయ పరిశీలకులు సంజీవ్ కుమార్ లాల్ పరిశీలించారు.శిక్షణ అధికారుల పరిశీల సమక్షంలో ఈవిఎంల అనుసంధాన ప్రక్రియ చేపట్టారు.ఉప ఎన్నికలో ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉంటే అనుసంధానం ఎలా చేస్తారంటూ ట్రైనింగ్ పర్సన్స్ ను పరిశీలకులు ప్రశ్నించారు.సిరీస్ విధానంలో అనుసంధానం చేస్తామని ట్రైనర్లు తెలిపారు. ఎన్నికలో అభ్యర్థులు ఎక్కువ మంది బరిలో నిలిచే అవకాశం ఉన్నందున బియు,సియు,వివి ప్యాట్ల అనుసంధానం జాగ్రత్తగా పోలింగ్ పర్సన్స్ చేపట్టేలా శిక్షణ ఇవ్వాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ట్రైనర్లకు రంజిత్ కుమార్ సింగ్ చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిఈఈ మురళి పాల్గొన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో వినియోగించబోయే ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లకు గురువారం చాదర ఘాట్ విక్టోరియా ప్లే గ్రౌండ్ లో ఫస్ట్ లెవెల్ చెకింగ్ చేపట్టారు.ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆధ్వర్యంలో అదనపు కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ లు పర్యవేక్షించారు.రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవిఎం లకు మొదటి దశ పరీక్షలు నిర్వహించారు.



## గోరక్షకుడిపై కాల్పులు జరిగిన ఘటనలో నిందితుల అరెస్ట్

*** 12 గంటలలో నిందితులను అరెస్టు చేసిన రాచకొండ పోలీసులు**

*** ఎల్బీనగర్ క్యాంపు కార్యాలయంలో వివరాలు వెల్లడించిన సిపి సుధీర్ బాబు**



ఎల్బీనగర్, అక్టోబర్ 23 (భారత శక్తి): గోవుల తరలింపును అడ్డుకొని తనకు నష్టం కలిగిస్తున్నాడనే కక్షతో ఎలాగైనా తనని అంతమొందించాలని రివాల్వర్ తో కాల్పులు జరిపిన నిందితులను రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించిన వివరాలు కమీషనర్ పి. సుధీర్ బాబు గురువారం ఎల్బీనగర్ లోని క్యాంపు కార్యాలయంలో వెల్లడించారు. మేడ్చల్ జిల్లా పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాతబస్తీ బండ్లగూడకు చెందిన మహమ్మద్ ఇబ్రహీం గత పది ఏండ్లుగా ఆంధ్రప్రదేశ్ లోని హనుమాన్ జంక్షన్ నుండి ఆవులను కొనుగోలు చేసి నగరంలోని కబేళాలకు తరలిస్తుంటాడు. కీసర మండలం రాంపల్లిలో నివాసం ఉండే బిడ్ల ప్రశాంత్ కుమార్ అలియాస్ సోనూ సింగ్ గోరక్షక్ సభ్యుడిగా పని చేస్తున్నాడు. ఇతడు గతంలో అత్తాపూర్ లో నివాసం ఉండేవాడు. ఇటీవలే రాంపల్లికి మారాడు. ఇతనికి షాబాద్ కు చెందిన కురువ శ్రీనివాస్ స్నేహితుడు. సోనుసింగ్ పలుచోట్ల గోవుల తరలింపును అడ్డుకున్నాడు. రెండు రోజుల క్రితం ఇబ్రహీంకు చెందిన ఆవులను తరలిస్తున్న క్రమంలో ఘట్కేసర్ మండలం యమ్నంపేట్ చౌరస్తా దగ్గర ఔటర్ రింగ్ వద్ద పోలీసులకు పట్టించాడు. దీంతో సోనూసింగ్ పై ఇబ్రహీం కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో షాబాద్ కు చెందిన కురువ శ్రీనివాస్ మధ్యవర్తి ద్వారా మాట్లాడుకుందామని చెప్పి పాత బస్తీ వైపు రమ్మని చెప్పగా సోనూ సింగ్ అక్కడ వద్దు మీరే ఇక్కడకు రావాలని యమ్నంపేట్ సమీపంలోని టీ స్టాల్ వద్దకు రమ్మని చెప్పాడు. అక్కడికి ఇబ్రహీం ఖురేషి, మహమ్మద్ హనీఫ్ ఖురేషి, కురువ శ్రీనివాస్, హస్సన్ బిన్ మోసిన్లు వచ్చారు. ఆ టైమ్ లో సోనూసింగ్, ఇబ్రహీం ఖురేషి గంట సేపు మాట్లాడుకున్న తర్వాత ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన ఇబ్రహీం ఖురేషి ఇటీవల చత్తీస్ ఘడ్ నుండి తనకు తెలిసిన మిత్రుడి ద్వారా అనుమతి లేకుండా తెప్పించుకున్న రివాల్వర్ తో సోనూసింగ్ ను కుడివైపు చాతిపై ఫైరింగ్ చేశాడు. మరో బుల్లెట్ చాతి ఎడమ వైపు నుంచి దూసుకెళ్లింది. దీంతో అతడు రక్షించండంటూ కేకలు వేసుకుంటూ రోడ్డుపైకి పరుగులు తీసి కుప్పకూలాడు. ఇబ్రహీం అతని స్నేహితులు అక్కడి నుంచి పరారయ్యారు. కిందపడిపోయిన సోనూసింగ్ ను స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం నగరంలోని యశోద హాస్పిటల్ కు తరలించారు. ప్రస్తుతం సోనూసింగ్ పరిస్థితి నిలకడగా ఉందని డాక్టర్లు చెప్పినట్లు తెలిపారు. హత్యాయత్నానికి పాల్పడిన మహమ్మద్ ఇబ్రహీం, కురువ శ్రీనివాస్, హస్సన్ బిన్ మోసిన్ లను అరెస్ట్ చేసినట్లు, మరో నిందితుడు మహమ్మద్ హనీఫ్ ఖురేషి పరారిలో ఉన్నాడని తెలిపారు. అయితే గత ఆరు నెలలుగా సోను సింగ్ తో ప్రధాన నిందితుడు ఇబ్రహీం ఖురేషి రెండుసార్లు ఫోన్లలో మాట్లాడుకున్నట్లు తెలిపారు. కావాలనే ముందస్తు ప్రణాళిక ప్రకారం కాల్పులు జరిపారని సీపీ తెలిపారు. బాధితుడు సోనుసింగ్ పై వివిధ పోలీస్ స్టేషన్ లలో ఐదు కేసులున్నాయని కాల్పులు జరిపిన నిందితుడు ఇబ్రహీం ఖురేషిపై ఒక కేసు ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్దనుండి దేశీయ పిస్తల్, స్విఫ్ట్ కారు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి జోన్ డిసిపి పివి పద్మజ, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, మల్కాజిగిరి ఏసిపి ఎస్.చక్రపాణి ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.